మంగళవారం
05 ఫిబ్రవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 317

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | CIRCULATED IN TELANGANA & A.P STATES | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



'హనీ ఈజ్ ది బెస్ట్' 10



బాబు అవకాశవాది

- అభివృద్ధి మేం చేస్తే.. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారు 3
- విభజన హామీలు 14లో 10 అంశాలు నెరవేర్చాం
- బీజేపీ చీఫ్ అమిత్ షా



అమ్మకు పీఎం కంటే సీఎం గొప్ప

- అమ్మ అప్పుడే సంతోషించారు
- హ్యూమన్ ఆఫ్ బాంబే ఫేస్‌బుక్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ 4



అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తాం

- మాజీ మంత్రి డీకే అరుణ, విజయశాంతి 3



ఎంపి కవితకు కేరళ అసెంబ్లీ ఆహ్వానం

- 23 నుంచి 25 వరకూ కేరళ అసెంబ్లీ డైమండ్ జూబిలీ 4

దీదీ వర్సెస్ మోదీ



- కోల్‌కతా సంక్షోభం తీవ్రం
- తీవ్ర స్థాయికి సీబీఐ, బెంగాల్ పోలీసుల వివాదం
- 'రాజ్యాంగ పరిరక్షణ' పేరుతో మమత పోరాటం
- ప్రాణాలైనా అర్పిస్తా.. రాజీ పడనని స్పష్టం
- టీఎంసీ, విపక్షాల తీరుపై బీజేపీ ఆగ్రహం
- పార్లమెంట్‌ను కుదిపేసిన దీదీ దీక్ష
- పరిణామాలపై కేంద్రానికి గవర్నర్ నివేదిక
- సీబీఐ పిటిషన్‌పై నేడు సుప్రీం కోర్టు విచారణ

కోల్‌కతా సంక్షోభం అంతకంతకూ తీవ్రమవుతోంది. సీబీఐకి, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పోలీసులకు మధ్య తలెత్తిన వివాదంపై ఆ రాష్ట్ర సీఎం మమతాబెనర్జీ ధర్నాకు దిగడం, రాజకీయ కక్ష సాధింపు కోసమే కేంద్రం సీబీఐని ఉసిగొల్పుతోందని కేంద్ర ప్రభుత్వంపై సమరానికి సై అనడం, విపక్షాలు సైతం ఆమెకు మద్దతు పలకడం సార్వత్రిక ఎన్నికలకు ముందు రాజకీయ వేడిని రగిలించాయి. కాగా మమత తీరుపై బీజేపీ కూడా ఘాటుగా స్పందించింది. దీంతో ఈ పరిణామం రాజకీయాలతో పాటు రాజ్యాంగ సంకోభానికి దారి తీసేలా కనిపిస్తోందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

విజయక్రాంతి, కోల్‌కతా : సార్వత్రిక ఎన్నికలకు ముందు పశ్చిమబెంగాల్‌లో రాజకీయ వేడి రగిలింది. రాజకీయ, రాజ్యాంగ సంక్షోభ పరిస్థితులతో ఆ రాష్ట్రం రగులుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మధ్య ప్రచ్ఛన్నయుద్ధం తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా కేంద్ర నేర పరిశోధన సంస్థ (సీబీఐ) అధికారులు ఆదివారం శారదా కుంభకోణం కేసులో కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ నివాసంపై దాడి చేసి ఆయన్ని అరెస్ట్ చేయడానికి ప్రయత్నించడం, బెంగాల్ పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకోవడం, పర్యవసానంగా కేంద్రం పరిధిలోని సీఆర్పీఎఫ్ రంగ ప్రవేశం చేయడం పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగ సంక్షోభ పరిస్థితులను సూచిస్తున్నాయి. కాగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ప్రమేయంతోనే సీబీఐ అధికారులు నగర పోలీసు కమిషనర్ నివాసంపై దాడికి దిగారని ఆరోపిస్తూ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆదివారం రాత్రి నుంచి కోల్‌కొతా నడిరోడ్డుపై 'సత్యాగ్రహ' ధర్నాకు దిగడం, ఒక్క సీపీఎం మినహా అన్ని బీజేపీ ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇవ్వడం రాజకీయ సంక్షోభ పరిస్థితులను తలపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆదివారం రాత్రి భోజనం నిరాకరించిన దీదీ రాత్రంతా మేల్కొనే ఉన్నారు. మమత చేపట్టిన 'సేవ్ ది కాన్స్టిట్యూషన్' దీక్షకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు, ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే అధినేత స్టాలిన్, ఆర్జేడీ నేత తేజశ్వీయాదవ్, ఎన్సీ నేత ఉమర్ అబ్దుల్లా తదితరులు మద్దతు తెలిపారు. పలువురు మమతను ఫోన్లో పరామర్శించారు.

ప్రాణాలైనా అర్పిస్తా.. రాజీ పడను: మమత


పాణాలైనా ఇస్తా కానీ ఎట్టి పరిస్థితిలోనూ రాజీపడే ప్రసక్తే లేదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ అన్నారు. మెట్రో ఛానల్ వద్ద 'రాజ్యాంగ పరిరక్షణ' పేరుతో చేపట్టిన ధర్నా రెండో మీడియాతో ఆమె మాట్లాడారు. టీఎంసీ నేతలను వేధించినప్పుడు తాను రోడ్లపైకి రాలేదని, కోల్‌కతా పోలీస్ చీఫ్‌ను అవమానించడం వల్లే తాను ధర్నాకు దిగాల్సి వచ్చిందని తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. పోలీసులను అవమానిస్తే తాను ఎంతమాత్రం సహించబోనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. సత్యాగ్రహ ధర్నా చేస్తున్న ఆమె పశ్చిమ బెంగాల్ పోలీస్, కోల్‌కతా పోలీస్ ఈవెంట్లో పాల్గొన్నారు. ధర్నా చేస్తున్న ప్రదేశంలోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె పోలీసులకు పలు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుల సేవలను కొనియాడారు. 'ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటూ పోలీసులు తమ విధులు నిర్వర్తిస్తారు. వర్షం, తుపాను వచ్చినా మన పోలీసులు మాత్రం వారి విధులను విస్మరించరు. ప్రత్యేక పూజలు నిర్వహించే సమయంలో వాళ్లు కల్పించే భద్రత అంత తేలికైనది ఏమీ కాదు. మన పోలీసులు వాటన్నింటినీ సమర్థవంతంగా చేయగలరు. విధుల్లోకి (తరువాయి 4లో)



సీబీఐ దుర్వినియోగం కాకూడదు

- బీహార్ సీఎం నితీష్

పట్నా: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో నెలకొన్న పరిణామాలపై బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ స్పందించారు. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడుతున్నారో వారే సమాధానం చెప్పాలని నితీష్ వ్యాఖ్యానించారు. సీబీఐ, ప్రభుత్వం ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం ఎన్నికల తేదీలను ప్రకటించే లోపు దేశంలో ఏదైనా జరగొచ్చని బీహార్ సీఎం నితీష్ వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి, సీబీఐకి మధ్య నెలకొన్న వివాదంపై జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం ముఫ్తీ కూడా స్పందించారు. రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తించాల్సిన సీబీఐ లాంటి సంస్థలు దుర్వినియోగం అవడం దురదృష్టకరమని ఆమె వ్యాఖ్యానించారు. మమతాబెనర్జీకి ఈ విషయంలో మద్దతు తెలుపుతున్నట్లు ముఫ్తీ ప్రకటించారు. సీబీఐ లాంటి సంస్థలు ఇలా దుర్వినియోగానికి గురైతే ఫెడరల్ స్ఫూర్తి దెబ్బతినే అవకాశముందని ముఫ్తీ తెలిపారు.



నిప్పుతో చెలగాటమే

- హెచ్చరించిన శత్రుఘన్ సిన్హా

ఢిల్లీ: పశ్చిమబెంగాల్ సీఎం మమతాను గతంలో వెనకేసుకొచ్చిన బీజేపీ అసంతృప్త నేత శత్రుఘ్నుసిన్హా మరోసారి ఆమెకు బాసటగా నిలిచారు. మమతా బెనర్జీ, కేంద్రం మధ్య చోటుచేసుకున్న తాజా పరిణామలపై శత్రుఘ్నుసిన్హా పరోక్షంగా మోదీని ఉద్దేశిస్తూ ట్వీట్ చేశారు. 'సార్జీ, ఏం జరుగుతోంది? ఇప్పటికి ప్రభుత్వ సంస్థలు అప్రతిష్టపాలవుతూ, గౌరవం కోల్పోతున్నాయి. ఈ తరుణంలో నిప్పుతో చెలగాటం ఎందుకు? అది కూడా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో...కాలపరీక్షకు నిలిచిన మాస్ లీడర్, బెంగాల్ టైగ్రస్తో ఆటలెందుకు?' అని ఆ ట్వీట్లో శత్రుఘ్నుసిన్హా పేర్కొన్నారు. 'ఎల్లప్పుడూ ఆమె హవాయి చెప్పులు, కాటన్ చీరలు ధరిస్తారని గుర్తింపుపొందారు. మనం దాదాపు మన విశ్వసనీయత కోల్పోయాం. మనం ఏమి చెప్పినా జనం నమ్మే పరిస్థితిలో లేరు' అని నటుడు, రాజకీయనేత శత్రుఘ్నుసిన్హా వ్యాఖ్యానించారు.



సీబీఐ దుర్వినియోగం దేశ ప్రతిష్ఠ అంశం: శివసేన

ముంబయి: 'సీబీఐని దుర్వినియోగం చేయడం దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయం. ఏదైనా అక్రమం జరిగిందని భావిస్తే ముందుగా తెలియజేయాలి. ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగానికి ముప్పు వాటిల్లిందనిభావించిన ప్రజలు ఇందిరాగాంధీని ఓడించారు. ఈ సంఘటన తర్వాత ఏం చేయాలో ప్రజలకు తెలుసు" అని శివసేన నేత సంజయ్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అలాగే మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన అధినేత రాజ్ ఠాక్రే స్పందిస్తూ.. "మమతా చేస్తున్న పోరాటాన్ని మేం అభినందిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ఆమె పోరాడుతున్నారు. ఆమెకు మా పూర్తి మద్దతు ఉంటుంది. ఈ విషయంలో ఆమె వెనకాల నడవడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని అన్నారు.





పార్లమెంట్‌ను కుదిపేసిన దీదీ దీక్ష

ఢిల్లీ: దీదీ దీక్ష సోమవారం పార్లమెంట్‌ను కుదిపేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల నిరసనలతో ఉభయ సభలు దద్దరిల్లాయి. బెంగాల్లో కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా టీఎంసీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం రాజకీయ కక్షసారింపు చర్యలు సరికావంటూ కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యసభలో టీఎంసీ సభ్యులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ సభాకార్యక్రమాలను అడ్డుకోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. సీబీఐ దుర్వినియోగంపై చర్చ చేపట్టాలంటూ టీఎంసీ పట్టుపట్టింది. లోక్‌సభలోనూ సీబీఐ వ్యవహారంపై గందరగోళం రేగింది. కేంద్ర ప్రభుత్వం సీబీఐని దుర్వినియోగం చేస్తున్నదంటూ టీఎంపీ ఎంపీలు నిరసన చేపట్టారు. ఈ వ్యవహారంపై చర్చ చేపట్టాలంటూ నినాదాలు చేశారు. తృణమూల్‌కు మద్దతుగా విపక్షాలు కూడా ఆందోళన బాటపట్టాయి. దీంతో సభా సమావేశాలకు తీవ్ర అంతరాయం ఏర్పడంతో పార్లమెంట్ ఉభయ సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి.

'కోల్‌కతా ఘటన దేశ రాజకీయ వ్యవస్థకు ముప్పు: రాజ్‌నాథ్ సింగ్

వాయిదా అనంతరం బెంగాల్‌లో తాజా పరిణామాలపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని లోక్‌సభలో టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ డిమాండ్ చేశారు. దీనికి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ.. సీబీఐ అధికారులను విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమని అన్నారు. కోల్‌కతా ఘటన దేశ రాజకీయ వ్యవస్థకు ముప్పు లాంటిదని ఆయన అభివర్ణించారు. శారదా కుంభకోణంలో బడా రాజకీయ నాయకులు ఉన్నట్లు సీబీఐ దర్యాప్తులో తేలిందని గతంలో సుప్రీం కోర్టు కూడా చెప్పిందన్నారు. బెంగాల్ పరిణామాలపై ఆ రాష్ట్ర గవర్నర్‌తో మాట్లాడానని, ఘటనపై నివేదిక ఇవ్వాలని కోరినట్లు రాజ్‌నాథ్ సింగ్ సభకు తెలిపారు.

కేంద్రానికి బెంగాల్ గవర్నర్ నివేదిక

శారదా కుంభకోణం దర్యాప్తు నేపథ్యంలో కోల్‌కతాలో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సమీక్ష చేపట్టింది. పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠితో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫోన్లో మాట్లాడారు. సీబీఐ అధికారులను నిర్బంధించడంపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. తాజా పరిస్థితులపై బెంగాల్ చీఫ్ సెక్రటరీ, డీజీపీలు తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ విషయమై తాను ఇప్పటికే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు సమన్లు జారీ చేశానని, పరిస్థితిని చక్కదిద్దేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్‌కు గవర్నర్ తెలిపారు. అనంతరం పశ్చిమ బెంగాల్‌లో చోటు చేసుకున్న పరిణామాలపై నివేదికను ఆ రాష్ట్ర గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు పంపించినట్లు రాజభవన్ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఆ రాష్ట్రంలోని సీబీఐ అధికారుల నివాసాలు, కార్యాలయాల వద్ద కేంద్ర బలగాలతో భద్రత ఏర్పాటుచేయాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది.





అత్యవసర విచారణకు సుప్రీం నో

ఢిల్లీ: శారదా కుంభకోణం దర్యాప్తు నేపథ్యంలో కోల్‌కతాలో ఆదివారం రాత్రి నుంచి జరిగిన అనూహ్య పరిణామాలను సీబీఐ అధికారులు సోమవారం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దర్యాప్తునకు సహకరించేలా సీపీ రాజీవ్ కుమార్‌ను ఆదేశించాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి రాజీవ్ కుమార్‌కు పలుమార్లు సమన్లు జారీ చేశామని సీబీఐ తమ పిటిషన్లో పేర్కొంది. అయితే వాటికి ఆయన స్పందించలేదని, సాక్ష్యాలను నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారని సీబీఐ ఆరోపించింది. రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించేందుకు వెళ్లిన సీబీఐ అధికారులను బెంగాల్ రాష్ట్ర పోలీసులు పోలీసులు అడ్డుకుని కస్టడీలోకి తీసుకున్నారని పేర్కొంది. సీపీ వెంటనే లొంగిపోయేలా ఆదేశించాలని సుప్రీం కోర్టును సీబీఐ కోరింది. సీబీఐ తరపున సొలిసిటర్ జెనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ పిటిషన్‌పై ఇవాళే అత్యవసర విచారణ చేపట్టాలని తుషార్ కోర్టుకు విన్నవించారు. అయితే ఇందుకు న్యాయస్థానం నిరాకరించింది. రాజీవ్ కుమార్‌పై ఆరోపణలకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి రుజువులు లేనందున ఈ కేసును మంగళవారం విచారిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. దీంతో సీబీఐకి సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది.

సీఎస్, సీపీపై సీబీఐ కోర్టు ధిక్కార పిటిషన్

కాగా కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను ప్రశ్నించేందుకు వెళ్లిన సీబీఐ అధికారులను ఆ రాష్ట్ర పోలీసులు అడ్డుకున్న వ్యవహారంపై సీబీఐ సుప్రీం కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేసింది. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, డీజీపీ, పోలీస్ కమిషనర్లపై కోర్టు ధిక్కార పిటిషన్లు వేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులను వీరు ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘించారంటూ సీబీఐ ఈ పిటిషన్లలో పేర్కొంది.

సీబీఐపై హైకోర్టుకు.. బెంగాల్ ప్రభుత్వం

మరోవైపు శారదా చిట్ ఫండ్ స్కామ్‌లో కోల్‌కతా పోలీస్ చీఫ్ రాజీవ్ కుమార్‌ను ఆయన నివాసంలో ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు ఆదివారం రాత్రి చేసిన ప్రయత్నాలను ప్రశ్నిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం సోమవారం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర పోలీసు అధికారులకు నోటీసులకు సంబంధించిన హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ సీపీని ప్రశ్నించేందుకు రాజీవ్ కుమార్ నివాసంలోకి అడుగుపెట్టేందుకు సీబీఐ ప్రయత్నించిందని రాష్ట్ర ప్రభుత్వం తరపు అడ్వకేట్ జనరల్ కిషోర్ దత్తా ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ పిటిషన్‌పై తక్షణ విచారణకు కోల్‌కతా హైకోర్టు నిరాకరించింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

బీజేపీ x ప్రతిపక్షాలు



మరోవైపు బెంగాల్ వ్యవహారం బీజేపీ వర్సెస్ ప్రతిపక్షాల మధ్య వార్‌గా మారింది. ఆయా పార్టీల నేతలు మాటల యుద్ధానికి తెర లేపారు.

మమతా విధించిన అత్యవసర పరిస్థితి: ప్రకాశ్ జవడేకర్

విచారణ నిమిత్తం వచ్చిన కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడం వంటి ఘటన ఇప్పటి వరకు ఎన్నడూ జరగలేదని కేంద్రమంత్రి ప్రకాశ్ జవడేకర్ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో నెలకొన్న పరిస్థితులపై సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీబీఐ అధికారుల్ని అదుపులోకి తీసుకోవడమనేది ప్రజాస్వామ్యాన్ని హత్య చేసినట్లేనని జవడేకర్ ఆరోపించారు. సీఎం మమతా బెనర్జీ చేస్తున్న సత్యాగ్రహాన్ని ఆయన విమర్శించారు. 'ఓ విచారణ బృందాన్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇంతకముందెన్నడూ జరగలేదు. ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే. అసలు మమతా బెనర్జీ సత్యాగ్రహాన్ని ఎందుకు చేస్తున్నారని మేం ప్రశ్నిస్తున్నాం? ఆమె ఎవరిని కాపాడాలని ప్రయత్నిస్తున్నారు. పోలీస్ కమీషనరా? లేదా తనని తాను కాపాడుకుంటున్నారా? ప్రతిపక్ష పార్టీల నేతలు మమతా బెనర్జీకి మద్దతు ఇస్తున్నారు. అసలు వాళ్లంతా ఎవరు? బెయిల్‌పై (తరువాయి 4లో)



దీదీకి విపక్షాల దన్ను

సీబీఐ తీరుకు నిరసనగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేస్తున్న దీక్షకు విపక్షాలు మద్దతుగా నిలిచాయి. కాంగ్రెస్, జేడీఎస్, ఎస్పీ, టీడీపీతోపాటు శివసేన కూడా మద్దతు తెలిపింది.

విపక్షాలను సాగనంపడంపైనే బీజేపీ దృష్టి: గులాం నబీ ఆజాద్

కాంగ్రెస్ పార్టీ నాయకుడు గులాం నబీ ఆజాద్ స్పందిస్తూ.."భాజపా అధికారంలోకి వచ్చిననాటి నుంచి విపక్షాలను సాగనంపడంపైనే దృష్టి సారిం చింది. దేశ ప్రయోజనాల కంటే దీనిపైనే వారు ఎక్కువగా ఆలోచిస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడుతూ.."దీదీ చేస్తున్న పోరాటం సమంజసమే. దేశం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంది. ప్రజల నిర్ణయమే అంతిమం. కేంద్రానిది కాదు" అని అన్నారు.

కేంద్రంపై 23 పార్టీల పోరాటం: చంద్రబాబు

కేంద్రప్రభుత్వంపై దేశంలోని 23 పార్టీల ఉమ్మడి పోరాటం కొనసాగుతుందని ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. కోల్ కతాలో జరుగుతున్న పరిణామాలపై స్పందించిన సీఎం చంద్రబాబు.. రాష్ట్రాల (తరువాయి 4లో)



సూక్తి సుధ




ఒకరి గురించి మంచి చెప్పకపోయినా పర్వాలేదు, చెడు మాత్రం చెప్పొద్దు.

- షిర్డీ సాయిబాబా



కోరికలన్నీ తీర్చే కోరిక

మనసారా ముందుగా దేవుని సన్నిధి కోసం మౌనంగా నమ్మకంతో ప్రార్థించాలి. ఈ ప్రార్థనలోనే ఎన్నో కోరికలు ఇమిడి ఉంటాయి. మన ఈ జీవితంలో భగవంతుడొక్కడే కోర దగినవాడు. మనసు సంతృప్తి పెట్టగల ఏకైక లక్ష్యం ఆ పరమాత్ముడేనని మనం గ్రహించాలి. ఈ కోరికలు రెండు రకాలుగా ఉంటాయి.



- పరమాత్ముని తెలుసుకోవడానికి మనకు సహాయపడేవి
- ఆయనను తెలుసుకోకుండా నిరోధించేవి

ఎవరైనా మిమ్మల్ని అవమానిస్తే మీరు ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటారు కాని మీరు ప్రేమ అను ఉత్తమ శక్తిని వినియోగించి ప్రతీకారమనే కోరికను జయిస్తే ఆ పని పరమాత్మకిష్టమైన ఆయన సన్నిధిని చేరుకు సహాయపడుతుంది. కోరికలనేవి దివ్య మార్గంలో నెరవేరాలంటే ప్రాపంచిక మార్గంలో మనం వాటిని తృప్తిపరచాలనుకోవడం కోరి కష్టాలను పెంచుకోవడమే. కావున మంచి పనుల ద్వారా ఆ పరంపితకు ప్రతిరూపమైన పిల్లలుగా తయారైన వారమని మనకు మనమే నచ్చచెప్పుకోవాలి. శారీరక అలవాట్ల నుండి, విచారకరమైన పరిస్థితుల నుండి బయటపడి పరమాత్మ సాంగత్యంలో పరమానంద భరితమవ్వాలి. ఇదే కోరికలన్నింటిని తీర్చే అపురూపమైన కోరిక.

మనోబలం:-

మనోబలాన్ని వికసింపచేసుకోవడానికి అధ్యయనం అవసరం. జ్ఞానాన్ని అధ్యయనం చేయడంవల్ల ఆధ్యాత్మిక జ్ఞానంతో మనోబలం వికసిస్తుంది. దీంతో మన బుద్ధిలో కూడా ఒకకొత్త సంచలనం ఉంటుంది. ఆ శక్తితో జాగృతియై ఇది చేయాలి అది చేయాలి అనుకుంటాం. పెద్ద పెద్ద పనులు చేయడానికి రోజంతా వెచ్చించి మళ్ళీ సమయం లేదంటాం. ఇదే పెద్ద సమస్య. ఒక వేళ దీనిగురించి అర్థం చేసుకుంటే సమయం దొరుకుతుంది. రాబోయే సమయంలో ఏవ్యక్తి అయినా పరిస్థితులలో ఓడిపోవాలనుకోరు. కొందరు ఇప్పుడు మేము బాగానే ఉన్నాం కదా! కష్టం వచ్చినప్పుడు చూసుకుందాంలే అని ఆలోచిస్తారు. కాని రాబోయే సమయం సరిగ్గాలేదు. రోజు రోజుకు సమయం మారిపోతుంది. ఎందుకంటే అసలు పరిస్థితులు లేని రోజులూ ఉండవు.

ఎలాంటి సమస్యలు పరిస్థితులు లేకుండా ఈ రోజు బాగా గడిచింది అనుకోవడానికి లేదు, రోజు రోజుకూ ఈ సమస్యలు మరింత పెరుగుతాయని సమయం సంకేతాన్నిస్తుంది. అంటే ఆ బలహీనతకే జీవితాన్ని నడిపించుకోవడానికి ఆధారం చేసుకుంటాం. ఇది మనల్ని లోపల నుండి బలహీనపరుస్తుందా లేదా మరింత శక్తివంతంగా చేస్తుందా? బుద్ధిని ఉపయోగించండి, బలహీనతలు ఆధారంగా మనం మన జీవితాన్ని నడిపిస్తే మనలో మానసిక శక్తులు తిరిగి బలహీనతలు మరింత పెరిగిపోతాయి. అప్పుడు మనం సహజంగానే నిరాశకు లోబడతాం. మనసును శక్తిశాలిగా చేసుకోవాలంటే అన్నింటి కంటే ముందు మనసుకు శ్రేష్ఠ భోజనం కావాలి. మనసుకు భోజన చింతన. ఎలాంటి చింతన చేయాలి? ఆధ్యాత్మిక చింతన. ఈ రోజుల్లో ప్రపంచంలో వ్యర్థ చింతన, పరచింతన ఎక్కువగా ఉంది. ఎవరిని అడిగిన ఏవిషయాలుంటాయి? ఫలానావాళ్లు సమస్యలు సృష్టించారని, మీరు ఇలా అన్నారని, వారు అలాచేశారని అంటుంటారు. వ్యర్థంచింతన, పరచింతన ఎక్కువగా ఉంటుంది. దీనితో ఎలాంటి ప్రాప్తి ఉండదు. పైగా బలహీనతలు ఎక్కువ వస్తాయి. వదలాలనుకున్నా కాని వదల్లేరు. విషయాలను వర్ణిస్తారు. మన మనసును ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే ఆధ్యాత్మిక చింతన చేయాలి.

జయాపజయాలు:-

జీవితంలో ప్రతి ఒక్కరు విజయం, పొందాలని అనుకుంటారు. ఎవరు కూడా పరాజయం పొంది, తమ ప్రయత్నం వ్యర్థం కావాలనుకోరు. ఒక విధంగా ఇది సమంజసమే. కానీ జీవన యాత్రలో ప్రయత్నం చేస్తూ చేస్తూ ఒక వేళ పరాజయం పొందినా అందులో కూడా నేర్చుకునే ఒక విషయం దాగి ఉంది.

ఏ విధంగానే 'విజయం' నీ పరిచయాన్ని ప్రపంచానికి తెలియచేస్తుంది. విజయం పొందిన తరువాత ప్రపంచం నిన్ను గుర్తిస్తుంది. ఒకవేళ పరాజయం పొందితే ఆ పరాజయం నిన్ను నీవు పరిశీలించుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. పరాజయం ప్రపంచం యొక్క పరిచయాన్ని నీకిస్తుంది. పరిచయం తర్వాత నీ జీవిత విలువను తెలుసుకుంటావు. విజయం మనకు ఒకదారిని మాత్రమే చూపిస్తుంది. కాని పరాజయం వంద పరిష్కారాలను అందిస్తుంది. ఒకవేళ మన ఆలోచనా విధానం శుభప్రదంగా ఉంటే ఈ పరాజయమే ఇంకా ఎన్నో రెట్లు శక్తిశాలిగా తయారుచేస్తుంది. ఎన్నో విజయాలను కూడా అందిస్తుంది. శుభచింతనకు ఆధారమైన మనసు



శక్తిశాలిగా ఉండాలి. నేటి ప్రపంచంలో భౌతికంగా, ఆర్థికంగా శక్తివంతుల వ్వడానికి ఎన్నోమార్గాలున్నాయి. కాని మనసును శక్తిశాలిగా చేసుకోవడానికి ఒకటే మార్గం జ్ఞాన చింతన, రాజయోగభ్యాసం. దైనందిన జీవితంలో కొంతసమయం ఆత్మ ఉన్నతి కోసం కేటాయించాలి. మంచి ఆలోచన అనేవి ఒక అలవాటుగా మార్చుకోవాలి. కాని జ్ఞాన చింతన మారినప్పుడే చింతలు కూడా సమాప్తమవుతాయి. భౌతిక పనుల కోసమైతే సమయం వెచ్చించాల్సి ఉంటుంది. మన పనులు చేస్తూ కూడా శుభచింతన చేయవచ్చు. అప్పుడు ఆనందానుభూతి కలుగుతుంది. మనం చేసే ఆలోచనా ప్రభావం చుట్టుపక్కల వ్యాపిస్తుంది. మన తోటి వారిపై, పరివారంపై, మరి సమాజంపై కూడా దాని ప్రభావం ఉంటుంది. మన చింతన శ్రేష్ఠంగా ఉంటే మన కర్మల్లో కూడా దానిప్రభావం కనిపిస్తుంది. అప్పుడు సహజంగానే మన ద్వారా శ్రేష్ట కర్మలు జరుగుతాయి. అప్పుడు స్వపరివర్తనయే విశ్వపరివర్తనకు పునాది అవుతుంది. ఇంగ్లీష్‌లో ఓ సామెత ఉంది. హైథింకింగ్ సింపుల్ లివింగ్. మనిషి జీవితంలో ఉన్నతమైన మంచి ఆలోచన ఒకటే సరిపోదు, దానితో పాటు ఆ చింతన మన వ్యవహారంలో వచ్చినప్పుడే శక్తివంతులమవుతాము. ఆలోచనా విధానం మారితే ప్రపంచంకూడా మారుతుంది.ఆలోచన ఉన్నతంగా ఉంటే జీవితంతో పాటు స్థితి కూడా ఉన్నతంగా ఉంటుంది.

– బి.కె. శైలజ

ఆచరణ లేని జ్ఞానం వ్యర్థం



చాణక్యం

శ్లో॥ హతం జ్ఞానం క్రియా హీనం హతశ్చా జ్ఞానతో నరః।
హతం నిర్నాయకం సైన్యం స్త్రియో నష్టాహ్య భర్తృకాః॥

ఆచరణ లేని జ్ఞానం వ్యర్థం. అజ్ఞానం చేత మనుష్యుడు నష్టపోతున్నాడు. సరైన నాయకుడు లేని సైన్యం కకావికలమై అదుపు తప్పి నశించిపోతారని, భర్త లేని స్త్రీలు నష్టపోతారని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేస్తున్నారు. మహాభారతంలో ఇంకా వివరంగా ఈ క్రింది శ్లోకంలో తెలియచేస్తున్నారు.

శ్లో॥ పఠకాః పాఠకాశ్చైవ యే చాన్యే శాస్త్రచింతకాః।
సర్వే వ్యసనినో మూర్ఖా యః క్రియావాన్ న పండితః॥

ఆచరణలేని జ్ఞానం వ్యర్థమని తెలియచేస్తూ చదువువారు, చదివించువారు, శాస్త్రాలను గూర్చి ఆలోచించువారు వీరందరూ వ్యసనపరులు, మూర్ఖులుగా ఉన్నారు. శాస్త్రోక్త కర్తవ్యాలను ఆచరించే వారు, జ్ఞానాన్ని ఆచరణలో బెట్టువారు పండితులుగా పరిగణిస్తారు.

ఇంకోక శ్లోకంలో మనువు ఈ క్రింది విధంగా వివరిస్తున్నారు.

అజ్ఞేభ్యో గ్రన్థినః శ్రేష్ఠా గ్రన్థిభ్యో ధారిణో వరాః।
ధారిభ్యో జ్ఞానినః శ్రేష్ఠా జ్ఞానిభ్యో వ్యవసాయినః॥

మూర్ఖుల కంటే చదువుకొన్నవారు శ్రేష్ఠులు. గ్రంథాలు చదివే వారి కంటే గ్రంథస్థ విషయాలు జ్ఞాపకం ఉంచుకునేవారు శ్రేష్ఠులు. ఆధారణచేయు వారికంటే జ్ఞానులు శ్రేష్ఠులు. జ్ఞానుల కంటే ఆచరణలో పెట్టేవారు శ్రేష్ఠులంటున్నారు. ఇంకా ఈ విధంగా తెలియచేస్తున్నారు. సత్యం, తపస్సు, జ్ఞానం, అహింస (వైరత్యాగం), విద్వాంసులకు నమస్కరించటం, మంచిశీలమనే గుణాలు కలిగి ఉన్నవాడు విద్యాంసుడు. కేవలం చదివేవాడు విద్యాంసుడు కాడు. అజ్ఞానం వల్లనే మనుష్యుడు దెబ్బతింటున్నాడు. మార్కేండేయ పురాణంలో ఇలా తెలియచేస్తున్నారు.

తగ్గృహం యత్ర వసతి స్తత్ భోజ్యం యేన జీవతి।
యన్ముక్తయే తదేవోక్తం జ్ఞాన మజ్ఞాన మన్యథా॥

మనుష్యుడు ఉండటానికి తగిన గృహం, జీవించడానికి ఉపయోగపడేది ఆహారం, మోక్షాన్ని కలిగించేదే జ్ఞానం అని చెబుతూ, మిగిలినదంతా అజ్ఞానమని తెలియచేస్తున్నారు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

భారతీయ గణిశాస్త్ర చరిత్ర విశ్వం

విశ్వం

విశ్వం గురించిన కొంత ప్రాథమిక పరిచయాన్ని మొదటి సంపుటంలో ఉపోద్ఘాతంలో ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ఈ విషయాన్ని మరింత వివరంగా పరిశీలిద్దాం.

గ్రహాలు తమ కక్షల్లో రోజుకు ఇంచుమించు 118583/4 యోజనాలు ప్రయాణిస్తాయని భావించడం జరిగింది. ప్రతీ గ్రహం ఒక కల్ప కాలంలో ఖగోళ కక్షా(వృత్త) పరిధికి సమానమైన దూరం ప్రయాణిస్తుందని కూడా భావించడం జరిగింది. ఉదాహరణకు భూమి చుట్టూ, ఒక గ్రహం కక్షా (వృత్త) వ్యాసార్ధం 'r' అనుకుందాం. ఖగోళ కక్షా (వృత్త) వ్యాసార్ధం 'R' అనుకుందాం. ప్రతీ గ్రహం. ఒక్కొక్క భ్రమణంలో అది ప్రయాణం చేసే కక్షా దూరాన్ని బట్టి(ఉదా–2Πr), ఒక కల్పకాలంలో అది చేసే భ్రమణాల సంఖ్యను బట్టి(ఉదా–n), గ్రహం ప్రయాణించే మొత్తం దూరం(ఉదా–n*2Πr), ఖగోళ కక్షా (వృత్త) పరిధితో (ఉదా–2ΠR) సమానంగా ఉంటుంది. కక్ష అంటే భూమి చుట్టూ ఆ గ్రహం తిరుగుతున్నట్లు కనిపించే మార్గం. ఖగోళ కక్ష(వృత్తం) అనే పదం ఈ అర్థాన్ని సూచించదు. నిజానికి, ఖగోళ కక్షకు స్వతంత్రమైన ఉనికి లేదు. ఇది కేవలం గ్రహాల సంచార మార్గ దూరాన్ని గణించడానికి ఉపయోగపడుతుంది. కల్పంలో ఒక గ్రహం తన మార్గంలో ఎన్ని ప్రదక్షిణలు చేస్తుందో, అంటే ఎన్ని భగణాలు చేస్తుందో, అంటే ఎన్ని భగణాలు చేస్తుందో, ఆ సంఖ్యతో ఖగోళ కక్షా దైర్ఘ్యాన్ని(పరిధిని) భాగిస్తే ఆ గ్రహ సంచార మార్గ దూరం, లేక పొడవు తెలుస్తుంది. సూర్యసిద్ధాంతంలో చెప్పిన కక్షామానాలు ఇలా ఉన్నాయి.

చంద్ర	324000
సూర్య	4331500
శని	127668255
బుధశ్రీఘ్ర	1043209
కుజ	8146909
శుక్రశీఘ్ర	2664637
గురు	51375764
నక్షత్రమండల	259890012
నక్షత్రగోళం	18712080564000000

భూమి నుండి చంద్రుని దూరం

మొదటి ఆర్యభట సిద్ధాంతం మినహా మిగిలిన సిద్ధాంతాలన్నీ అన్ని గ్రహాలకూ ఒక రోజులో ఒకే ప్రయాణ దూరాన్ని(యోజనాలలో) తెలియచేశాయి. అయితే ఈ సిద్ధాంతాల కల్పదినం సంఖ్యలలో చిన్న చిన్న తేడాలుండటం కారణంగా ఖగోళ కక్ష, అలాగే గ్రహకక్షలలోను చిన్న చిన్న భేదాలు కనిపిస్తున్నాయి. ఆ సంఖ్యలలో ఖచ్చితత్వం గోప్యంగా ఉండడంచేత వాటిని ఇక్కడ తెలియచేయడం వల్ల ప్రయోజనమేమీ లేదు. ఈ గణాంకాలలో ఎక్కువ భాగం ఊహాజనితమే. అయితే చంద్రకక్ష మాత్రం ఊహాగానంతో నిర్ణయించబడలేదు.

అందులో సత్యాంశం ఎక్కువగా ఉంది. మొదటి ఆర్యభటుడు కాక మిగిలిన ఆచార్యులందరూ, చంద్ర కక్షాతలంలో చంద్రకక్షలోని ఒక నిమిషం 15 యోజనాలని చెప్పడం జరిగింది. దీనిని అనుసరించి చంద్రుని సంపూర్ణకక్షా ప్రమాణం (360x60x15) = 3,24,000 యోజనాలు, త్రిజ్యా (కక్ష సగటు వ్యాసార్థం) 51,566 యోజనాలు వస్తుంది. ఇది భూమి నుండి చంద్రునికి గల దూరం.

సూర్యసిద్ధాంతం అనుసరించి భూమి వ్యాసార్థం 800 యోజనాలు. భూమి చంద్రుల మధ్య దూరం భూమి వ్యాసార్ధానికి 64.46 రెట్లని పేర్కొన్నారు. ఆధునిక పరిశోధనలలో భూవ్యాసార్ధానికి 50.96 రెట్లు అని తెలిసింది. మన సిద్ధాంత కర్తలు తెలియచేసిన భూమి చంద్రుల మధ్య దూరం వాస్తవానికి దగ్గరగా ఉండటం, ఈ విధంగా నిశ్చయించిన మన ఆచార్యులను మనం కీర్తించాలి.

వేద విజ్ఞానం

భాగం-91

– డా॥ రేమెళ్ల అవధానులు

ధర్మ సందేహాలకు సమాధానాలు

దేవాలయాల్లో పువ్వులు, అక్షింతలు ఇస్తారు కదా! వాటిని ఏం చేయాలి?



జీవ లక్షణం ఉన్న ఏ పదార్థాన్ని కూడా నాశనం చెయ్యకూడదనేది ఋషుల అభిమతం వడ్లగింజలు మాత్రమే మళ్లీ మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటాయి. బియ్యానికి ఆ శక్తిలేదు. అందుకే మంగళకరమైన పసుపు, కుంకుమలతో కలిసి బియ్యం మంగళ కార్యాలైనా దేవతాపూజకు ఉపయోగపడతాయి. దేవాలయాల్లో హారతి, అర్చన చేయించే ముందు అర్చకుడు మన చేతికి కొన్ని పుష్పాలను, అక్షింతలను ఇచ్చి సంకల్పం చెప్పించి తిరిగి తీసుకొని దేవతామూర్తి పాదాల వద్ద ఉంచడం చూస్తుంటాం. ఆర్చామూర్తి పైన పూలను, పూజింపబడిన అక్షింతలు మనకిస్తుంటారు. పూలను చెవిలోపెట్టుకుం టారు కొందరు. ప్రసాదంగా స్వీకరిస్తారు మరి కొందుర. అక్షింతలు తలపై వేసుకోవాలి. శ్రీ రాఘవేంద్ర స్వామి మఠాల్లో ఇలా అక్షింతలు ఇచ్చే సంప్రదాయముంది. అయితే అక్షింతలు, పువ్వులు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా భక్తితో స్వీకరించాలి. ఇది వారి వారి భక్తికి సంబంధించిన విషయం.

ఆచారం తెలియని వాడికి అక్షింతలు ఇస్తే గుడి వెనక్కిపోయి నోట్లో వేసుకున్నాడట – అన్న సామెత మనం నిజం చేయకూడదు. మన ధర్మశాస్త్రకారులైన ఋషులు ఏది చెప్పినా అందులో ఓ అంతరార్థం ఉంటుంది. వేదకార్యల్లో అక్షింతలు, పితృకార్యాల్లో పేలాలు, తెల్లబియ్యం, నల్లనువ్వులు, మినుములు వాడతారు. దేవకార్యాల్లో వాడే పసుపు, కుంకుమతో కూడిన బియ్యంనే అక్షింతలు అంటారు.

– డా॥ పి. భాస్కరయోగి

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. కంసుని తండ్రి?
2. ధ్రువుని భార్యల పేర్లు?
3. సగరుని రెండవ భార్య సుమతీ కుమారులు ఎంత మంది?
4. పాతాళ లోకంలో ప్రవహించేటప్పుడు గంగకి ఏమని పేరు?
5. కుశధ్వజుడి కుమార్తెలు ఎవరు?
6. లంకకు సేతువు నిర్మించిన వానర సేనాని?
7. కురుక్షేత్రంలో మొదటి బాణం వేసి యుద్ధాన్ని ప్రారంభించింది ఎవరు?
8. నకులుడి తల్లి?
9. సీతా స్వయంవరంలో పెట్టిన షరతు?
10. నారదుని వీణ పేరు?

సమాధానాలు

1. ఉగ్రసేనుడు
2. భ్రమి, ఇల
3. 60,000
4. భోగవతి
5. మాండవి, శ్రుతకీర్తి
6. నలుడు
7. దుశ్శాసనుడు
8. మాద్రి
9. శివధనుస్సును విరుచుట
10. మహతి

శ్రీ రాజ్యలక్ష్మీదేవి

"రాజత్కృపా రాజపీఠ నివేశిత నిజాశ్రితా
రాజలక్ష్మి! కోశనాథా చతురంగా బలేశ్వరి!

అనంతకోటి సూర్యమండలాలను, మాలగా ధరించి పాలపుంతవలె ఉజ్వలకాంతి సమావృత్తమైన శ్రీ లలితా మహాభట్టారికకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. అమ్మ కరుణా కటాక్షాలను అర్థం చేసుకోలేని అల్పులం, మానవ మాత్రులం, సకల జగత్తును సృష్టించి, పరిపాలించి లయింప చేయగల అద్భుతమైన త్రయీశక్తి శ్రీ రాజ్యలక్ష్మి. ఇంతటి అద్భుతమైన శక్తిని ప్రపంచానికి వినిమయం చేసే శక్తిగా రాజ్యలక్ష్మియే అష్టలక్ష్మీ స్వరూపమై అవతరిస్తున్న విజయ ముహూర్తమిది. నిత్యజీవితంలోని ఘట్టాలను, ప్రతిక్షణం ప్రత్యేక సాక్షిగా వీక్షింపగలగి శాసించగల అనంతశక్తి సామర్థ్యాలు కలది. కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ తేజోవతియై శ్రీలలితా పరమేశ్వరి ప్రత్యక్షమగు గాక! ఈ మహాసామ్రాజ్ఞి, రాజరాజార్చితయైన శ్రీ రాజరాజేశ్వరిగా ఆవిష్కరింపబడుతున్న పవిత్ర క్షణాలివి.



అష్టలక్ష్మీ స్వరూపాలన్నీ "క్లీం" కార మంత్రంలో ఇమిడిపోయి, తిరిగి అష్టవిధ లక్ష్మీ ప్రకృతులైన రాజ్యలక్ష్మిగా స్వయాలంకృతమై ఈ పై శ్లోకానికి అర్థం వచ్చేలాగా సాక్షాత్కరించి నన్ను కటాక్షించుగాక! శ్రీ చక్రాధిష్ఠాన దేవత ఆహ్లాదకరమైన 'సర్వానుల్లంఘ్యశాసన' గానా అంతరాత్మలో ఏక స్వరూపమై తిష్టవేసుకొనుగాక! ఏకాక్షర బీజమైన అనంతశక్తిని నిక్షిప్తం చేసుకున్న విత్తనమై వర్ధిల్లుగాక! భక్తి అనుబంధాన్ని ఆత్మార్థంగా సంధింపచేసేదే ఈ కరుణాశక్తి. నన్ను, నా శరీరాన్ని, ఆలోచనలను, ఆత్మసాక్షిగా పరిపాలించు ఈ అద్భుత ఆనంద స్వరూపానికి ప్రణమిల్లుతున్నాను. నచ్చిన రీతిలో జీవిత మార్గాన్ని లక్ష్య సాధనవైపు కృపతో నన్ను నడిపంచు గాక! కళ్ళకు గంతలు కట్టినట్లు నీమీద ధ్యానం తప్ప, భక్తితో ఇతరాన్ని చూడలేని అల్పురాలి చేత వైకుంఠపాళి ఆడిస్తున్నావు. ఈ ఆటలో నా అడుగులు ఎటు వైపో? కాలం పాములా మింగివేస్తే పాతాళానికి కావచ్చు! నువ్వు కరిణించి కాపాడితే నిచ్చెన ఎక్కి వైకుంఠానికి కావచ్చు.

నా ప్రతి అడుగు నీవిచ్చిన సంకల్ప బలంతో, ఆశీర్వాదబలంతో, నీ కృపతో సరియైన ముహూర్తంలో కదులుతున్నది. నా ప్రతి అడుగు "నీవు" అనే గమ్యం చేరడానికి రాజమార్గానికి కారణమైన భక్తిని శక్తిని వ్యూహాత్మకంగా కదిలించే పథాన్ని స్ఫురింపచేయుగాక. తేజస్సు, మహిమగల దివ్యప్రభతో శ్రీ వరలక్ష్మీ అవతరించాలని నీమీద భారం వేసి ప్రయత్నం చేస్తున్నాను.

త్రిగుణాత్మక స్వరూపిణి

నిజ జీవితంలో ఎన్నో సమస్యలు వస్తుంటాయి, అన్నీ సవ్యంగా ప్రయత్నం చేస్తూ ఆ భగవతిపై భారం వేసి నిశ్చింతగా ఉంటాం. మన ముందడుగుకు ఫలితంగా "పీఠం" వరకు నడిపించే బాధ్యతను ఇచ్చిన విషయం మరచిపోతాం. అన్నీ మనం వేసిన అడుగులే అనే అహంకారంతో విర్రవీగుతాం. మానవుడిని సన్మార్గంలో పెట్టే శాసనంగా కష్టాలు, కన్నీళ్లు, ఎగుడు దిగుడులు సృష్టిస్తూ అమ్మవారు మానవుడిని పరీక్షిస్తుంది. మన జీవితానికున్న అంతుపట్టని చక్రవ్యూహంగానూ, పద్మవ్యూహంగానూ మార్చివేస్తుంది. మనం ఎలా నడుస్తాం, ఏ భావనతో ప్రవర్తిస్తాం అని మనకు మనమే తెలుసుకోగలాలి. అలా విమర్శించుకుంటూ మనల్ని మనం సరిదిద్దుకునే అవకాశం రావడమే అమ్మదయ!

అమ్మ దయతోనే చైతన్య స్వరూపిణియైన శ్రీ రాజ్యలక్ష్మీదేవిని వరలక్ష్మీ రూపంగా అలంకరించబడాలని భక్తితో సమర్పణ చేస్తున్నాను.



-సి. విజయలక్ష్మీ రాజు

ముగిసిన మాఘ అమావాస్య

విజయక్రాంతి, సంగారెడ్డి: మాఘ అమావాస్యను పురస్కరించుకొని పాపన్నపేట మండలం ఏడుపాయలలో శ్రీ వన దుర్గభవాని మాత ఆలయంలో భక్తులు పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. భక్తులు స్నానాల ఘట్ వద్ద పుణ్యస్నానాలు ముగించుకొని ఆలయంలోని అమ్మవారిని దర్శించుకోని ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి హైదరాబాద్, నిజామాబాద్, నల్గొండ, కర్ణాటక, మహారాష్టల నుంచి భక్తులు తరలివచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని వినతి



విజయక్రాంతి, మిర్యాలగూడ: అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో జగన్నాధరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలో వ్యవసాయ భూములు ప్లాట్లుగా మార్చి అక్రమ వెంచర్లు వేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. పచ్చని పొలాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అక్రమ వెంచర్లుగా మారిపోతున్నాయని, గుంటల నుంచి గజాల స్థాయికి పెరిగిపోయిందన్నారు. ఆయా ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, రామకృష్ణయాదవ్, రఘు, వెంకన్న, సంజీవ, సాయి పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



విజయక్రాంతి, నల్లగొండ: ఉచిత గుండె వైద్య శిబిరానికి ప్రజలు విశేషంగా తరలిరావడం అభినందనీయం అని ఐఎన్ఏ కన్వీనర్ డాక్టర్ పుల్లారావు అన్నారు. సోమవారం సాయిరక్ష మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో పేద, మధ్యతరగతి ప్రజలు శ్వాస, ఊపిరితుల వ్యాదులతో బాధపడుతున్న వారికి సాయి రక్ష హాస్పిటల్ ఎండి ప్రభాకర్ గౌడ్ హైద్రాబాద్ నుంచి గుండె స్పెషలిస్ట్ డాక్టర్లను పిలిపించి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం హర్షించదగ్గ విషయం అని ఆయన అన్నారు. సాయిరక్ష హాస్పిటల్ ఎండి ప్రభాకర్ మాట్లాడుతూ.. జిల్లాలోనే పేద మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సల శిబిరాన్ని నిర్వహించడానికి సహృదయంతో హైద్రబాద్ యశోధ హాల్పిటల్ ఫేమస్ డాక్టర్ శబరినాథ్, డాక్టర్ బి. అనిల్ ఈ ఉచిత శిబిరానికి హాజరై రోగులను పరీక్షించి తగిన సలహాలు ఇవ్వడం శుభపరిణామం అని పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సాయిరక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నాణ్యమైన వైద్యం అందిస్తూ తక్కువ ధరలకే వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నామని ఈ ఉచిత శిభిరంలో సుమారు 600 మంది పాల్గొని గుండె చెకప్‌లు చేయించుకున్నారని పేద ప్రజలకు సాయిరక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మెరుగైన వైద్య సహాయం అందిస్తుందని జిల్లా లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాగ్రామర్ విద్యాసంస్థల అధినేత వైద్యం వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సుదాకర్ లైన్స్ క్లబ్ ప్రతినిధులు, ఐఎంఏ ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో కళా నైపుణ్యాన్ని వెలికి తీయాలి

విజయక్రాంతి, ఇబ్రహీంపట్నం: విద్యార్థులలో కళా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వరంగల్‌లో ఫిబ్రవరి 9,10 తేదీల్లో సింగిడి–2019 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గొరిగె బీరప్ప తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో సింగిడి–2019 గోడపత్రికను ఏబీవీపీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా గొరిగె బీరప్ప మాట్లాడుతు విద్యార్థులలో కళా నైపుణ్యాన్ని వెలిసేందుకు వరంగల్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో సింగిడి–2019 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, నాటిక, చిత్రలేఖనం, యువ కవి సమ్మేళనం, శాస్త్రీయ గీతాలు, జానపద గీతాలు, రంగోలి, ఏక పాత్రాభినయం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నందిమల్ల రాజేష్, శాంతి కుమార్, విష్ణు వర్ధన్, శశిధర్, లింగం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శంషాబాద్ సిద్దులగుట్ట వద్ద సీసీ రోడ్డు పనులు ప్రారంభం

విజయక్రాంతి, రాజేంద్రనగర్: శంషాబాద్‌లోని శ్రీ వెండికొండ సిద్ధేశ్వరస్వామి (సిద్దులగుట్ట) ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరిచేలా ప్రయత్నం చేస్తున్నానని శంషాబాద్ సర్పంచ్ రాచమల్ల సిద్దేశ్వర్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వార్డు సభ్యులు, దేవాదాయశాఖ అధికారులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంతో ప్రతిష్టాత్మకమైన శ్రీ వెండకొండ సిద్ధేశ్వర ఆలయం వద్ద భక్తులకు కావాల్సిన సదుపాయాలు లేక గత 20 ఏళ్లుగా ఎంతో ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యను తీర్చేంకు దశలవారిగా ఒక్కోపనిని ఒక్కోసారి చేయటం జరుగుతుందన్నారు. అందులో భాగంగా నేడు సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వచ్చే శివరాత్రి పండునాటికి ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు. అంతర్జాతీయ స్థాయిలో శంషాబాద్ పేరున్నందున అదేస్థాయిలో శంషాబాద్ పట్టణ కేంద్రాన్ని ఊహించని విధంగా అభివద్ది చేస్తున్నామన్నారు. ఇక సిద్దేశ్వర ఆలయం వద్ద కూడా అన్ని ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, దేవాదాయశాఖ అధికారులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి మేం చేశాం.. బాబు అవకాశవాది

- చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారు
- బీజేపీ చీఫ్ అమిత్ షా
- విభజన హామీలు 14లో
- చంద్రబాబు లోకేశ్‌ను ఇచ్చాడు
- వైసీపీ అవినీతి పార్టీ



విజయక్రాంతి, విజయనగరం: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం పూర్తిగా సహకరించిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్ల కాలంలో రూ. 5.56 లక్షల కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ఇది యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన నిధుల కంటే నాలుగు రెట్లు ఎక్కువ అని తెలిపారు. లక్షల కోట్లు కేంద్రం ఇస్తుంటే.. ఇవ్వలేదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. విజయనగరంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశంలో మాట్లాడిన అనంతరం, శ్రీకాకుళంలోని పలాసలో పార్టీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ చేపట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్రను షా ప్రారంభించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మంచి ఫలితం వచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల తరువాత బీజేపీ సహకారంతోనే ప్రభుత్వం ఏర్పాటు జరిగే విధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

రాష్ట్ర అభివృద్ధికి లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంటే.. చంద్రబాబు మాత్రం ఏమీ ఇవ్వలేదన్నారు. కేవలం తన కొడుకు లోకేశ్‌ను ముఖ్యమంత్రి చేయాలన్న ఉద్దేశంతో ప్రజలకు చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్డీఏ కారణంగానే ఏపీ అభివృద్ధి చెందిందని, ఈ అభివృద్ధిలో చంద్రబాబుకు సంబంధమే లేదన్నారు. కానీ ఏపీలో జరుగుతున్న అవినీతితో మాత్రం బాబు సంబంధం ఉందని ఆరోపించారు. చంద్రబాబు అవకాశవాద రాజకీయాలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రాజకీయ జీవితం ప్రారంభించిన బాబు.. ఎన్టీఆర్ అధికారంలోకి రాగానే టీడీపీలో చేరారని చెప్పారు. రాజకీయ భవిష్యత్‌ను కల్పించిన ఎన్టీఆర్‌ను మోసం చేసి, చివరకు టీడీపీని హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. అటల్ బిహారీ వాజ్‌పేయ్ నేతృత్వంలో ఎన్డీఏ అధికారంలోకి రాగానే.. చంద్రబాబు చేరిన సంగతిని గుర్తు చేశారు. ఎన్డీఏ అధికారంలోకి పోగానే వాజ్‌పేయ్‌ను మోసం చేశారని ఆరోపించారు.

పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు.. బీజేపీ అధికారంలోకి వస్తుందని గమనించి తిరిగి ఎన్డీఏలో చేరారని తెలిపారు. రాజధాని నిర్మాణం, పోలవరం వివిధ పథకాల్లో జరుగుతున్న జరుగుతున్న అవినీతి కారణంగా చంద్రబాబుపై ప్రజల్లో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఇది గమనించే.. ప్రత్యేక హోదా పేరుతో బీజేపీపై బురదజల్లి కాంగ్రెస్ పంచన చేరారని తెలిపారు. ఏపీకి అన్యాయం చేసిన కాంగ్రెస్‌తో కలిసి తెలంగాణలో పోటీ చేసి ఓడి పోగానే.. ఇప్పుడు మహాఘట్బంధన్ పేరుతో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే.. బీజేపీ అధికారంలోకి రావడం, మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. ఆ వెంటనే చంద్రబాబు తిరిగి మాతో కలవడానికి ప్రయత్నిస్తారని తెలిపారు. అయితే మాతో చంద్రబాబు కలవకుండా తలుపులు మూసీవేశామని, భవిష్యత్‌లో చంద్రబాబుతో ఎలాంటి పొత్తు ఉండదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్రం చేపట్టిన సంక్షేమ పథకాలను, ప్రాజెక్టులను, తద్వారా ఏపీకి చేకూరిన ప్రయోజనాలను ఆయన వివరించారు. విభజన చట్టంలోని కీలకమైన 14అంశాల్లో పది పూర్తి చేశామన్నారు. గుంటూరుకు ఎయిమ్స్, వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేశామని వెల్లడించారు. విశాఖలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ ఎడ్యుకేషన్, పెట్రోలియం విశ్వవిద్యాలయం, గిరిజన విశ్వవిద్యాలయం వంటి కీలక విద్యా సంస్థలను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. జాతీయస్థాయిలో ఖ్యాతిగాంచిన 20 సంస్థలను రాష్ట్రానికి తీసుకొచ్చామని వెల్లడించారు. రెవెన్యూ, ఆర్థిక లోటును కూడా కేంద్రం తరపున భర్తీ చేసినట్లు అమితా షా తెలిపారు.

డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద రూ.6100 కోట్లు, ముద్ర యోజన కింద రూ.21వేల కోట్లు, భారత్మాల ప్రాజెక్టు కింద రూ.44వేల కోట్లు ఇలా మొత్తం అన్నీ కలిపి రూ.5,56,985 కోట్లు రాష్ట్రానికి సాయంగా అందజేశామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ చేసిన సాయాన్ని, ఇప్పుడు భాజపా చేసిన సాయాన్ని ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. చంద్రబాబుకు అభివృద్ధికి సంబంధంలేదని, ఆయనకు అవినీతికి మాత్రమే అవినాభావ సంబంధం ఉందని అమిత్ షా విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాయలసీమలో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా.? అని ప్రశ్నించారు. గతంలో మేం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీకి చంద్రబాబే స్వయంగా అంగీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ అంశంపై ఆయనే.. ఏపీ శాసనసభలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రూ.5 లక్షల వరకు ఆదాయమున్న వారందరికీ పన్ను రిబేట్ ఇచ్చామన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని 2019ఎన్నికల్లో ప్రతి కార్యకర్త భాజపా చేపట్టిన సంక్షేమపథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించి మరోసారి అధికారంలోకి వచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

వైసీపీ అవినీతి పార్టీ

ఏపీకి టీడీపీ, వైసీపీ రెండు పార్టీలు న్యాయం చేయలేవని ఆయన తెలిపారు. ప్రత్యామ్నాయంగా ప్రచారం చేసుకుంటున్న వైసీపీ కుటుంబ పార్టీ అని తెలిపారు. ఆ పార్టీ కూడా అవినీతిలో కూరుకొని పోయిందన్నారు. అవినీతిలో కూరుకొని పోవడంతో పాటు కుటుంబ పార్టీగా ఉన్న టీడీపీ కారణంగా ఏపీకి న్యాయం చేయలేదన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీజేపీ ద్వారానే ఏపీ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బీజేపీ భాగస్వామ్యం లేకుండా ఇక్కడ ప్రభుత్వం ఏర్పాటు కానీ విధంగా కార్యకర్తలు తీర్పు సాధించాలని పిలుపునిచ్చారు.

బాబు యూటర్న్ సీఎం
కన్నా లక్ష్మీనారాయణ

చంద్రబాబు యూ టర్న్ సీఎం అని బీజేపీ ఏపీ శాఖ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. తన సొంత అవసరాల కోసం ఎప్పటికపుడు టర్న్ తీసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీలో అవినీతి, కుటుంబ పాలన సాగుతోందని ఆరోపించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక దోపిడీ పెద్ద ఎత్తున సాగుతోందని తెలిపారు. వేల కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని చెప్పారు. ఈ దోపిడీని ఆపే శక్తి సీఎంకు లేదన్నారు. విశాఖలో జరిగిన భూ కుంభకోణంలో పచ్చపాములు ఎక్కడ బయటకు వస్తాయోనన్న భయంతోనే విచారణ జరగకుండా చేస్తున్నారని ఆరోపించారు.

షాకు నిరసన సెగ

అమిత్ షా పర్యటనపై టీడీపీ నిరసన వ్యక్తం చేసింది. ఆ పార్టీ ఎమ్మెల్యే గౌతు శ్యాంసుందర్ శివాజీ నేతృత్వంలో షా పర్యటనను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అమిత్ షా గ్యోబాక్ అంటూ నినదించారు.

షా దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించారు. వారి ప్రయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు కార్యకర్తలను అరెస్ట్ చేశారు.

వేసవి రద్దీని తట్టుకునేందుకు 108 సమ్మర్ స్పెషల్ ట్రైన్స్



విజయక్రాంతి, హైదరాబాదు: వేసవి కాలంలో రద్దీని తట్టుకునేందుకు వివిధ ప్రాంతాలకు 108 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. తిరుపతి – నాగర్‌సోల్, హెచ్.ఎస్.నాందేడ్ – తిరుపతి, తిరుపతి – కాకినాడ టౌన్ – రేణిగుంట, కాచిగూడ –కాకినాడ పోర్ట్‌ల మధ్య ఈ రైళ్లను నడుపనున్నారు. తిరుపతి –నాగర్‌సోల్–తిరుపతి మధ్య 28 వారాంతపు రైళ్లను నడుపనున్నారు. ఈ రైళ్లు మార్చి 1వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు ప్రతి శుక్రవారం తిరుపతిలో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.55 గంటలకు నాగర్‌సోల్ చేరుకుంటాయి. నాగర్‌సోల్ – తిరుపతి వారాంతపు ప్రత్యేక రైళ్లు మార్చి 2వతేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు ప్రతిశనివారం రాత్రి 10 గంటలకు నాగర్‌సోల్ నుంచి బయలుదేరి రెండవ రోజు ఉదయం 4 గంటలకు తిరుపతి చేరుకుంటాయి. మార్గమధ్యలో ఈ రైళ్లు నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి, సికింద్రాబాద్, బేగంపేట్, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్ తదితర స్టేషన్‌లోఆగుతాయి.

హెచ్.ఎస్.నాందేడ్:– తిరుపతి ప్రత్యేక రైళ్లు మార్చి5వ తేదీ నుండి మే 28వ తేదీ వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 6.45 గంటలకు హెచ్.ఎస్.నాందేడ్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి చేరుకుంటాయి. తిరుపతి – హెచ్.ఎస్.నాందేడ్ జన్‌సాధారణ్ ప్రత్యేక రైలు మార్చి 6వ తేదీ నుంచి మే 29వ తేదీ వరకు ప్రతి బుధవారమం తిరుపతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు నాందేడ్ చేరుకుంటాయి. మార్గమధ్యలో ఈ రైళ్లు బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, కాజీపేట్, వరంగల్, ఖమ్మం, విజయవాడ తదితర స్టేషన్లలో ఆగుతాయి.

తిరుపతి:– కాకినాడ టౌన్ జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు మార్చి 3వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 5.30 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటాయి. కాకినాడ టౌన్ – రేణిగుంట ప్రత్యేక రైలు మార్చి 4వ తేదీ నుంచి మే 27వ తేదీ వరకు ప్రతి సోమవారం రాత్రి 7 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు రేణిగుంట చేరుకుంటాయ.ఇ. మార్గమధ్యలో ఈ రైళ్లు విజయవాడ ఏలూరు, తాడేపల్లిగూడెం తదితర స్టేషన్‌లలో ఆగుతాయి.

కాచిగూడ:– కాకినాడ పోర్ట్ ప్రత్యేక రైలు మార్చి 1వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు కాకినాడ పోర్ట్‌కు ఉదయం 6 గంటలకు చేరుకుంటుంది. కాకినాడ పోర్ట్ నుంచి కాచిగూడ ప్రత్యేక రైలు మార్చి 2వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు ప్రతి శనివారం కాకినాడ పోర్ట్ నుంచి సాయంత్రం 5.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 5.10 గంటలకు కాచిగూడ చేరుకుంయాయి. మార్గమధ్యలో ఈ రైళ్లు మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల తదితర స్టేషన్‌లలో ఆగుతుంది.

రైళ్ల రద్దు

నిర్వహణా కారణాల రీత్యా నిజామాబాద్ – బోధన్ – నిజామాబాద్ ప్యాసెంజర్‌ను, మిర్జాపలి – బోధన్ – మిర్జాపలి ప్యాసెంజర్‌ను మార్చి 10వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు రద్దు చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విజయక్రాంతి, మిర్యాలగూడ: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని అవంతీపురం మార్కెట్‌యార్డులో 34 మంది రైతులకు ధాన్యం నిల్వ చేసుకునేందుకు గాను మంజూరైన రూ.54 లక్షల రుణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. రైతే రాజు నినాదంతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకూ పంట నిల్వ ఉంచుకోవాలని, దీని కోసం ప్రభుత్వం గిడ్డంగులు ఏర్పాటు చేసి రైతులకు రుణసౌకర్యం కల్పిస్తుందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానంచారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు తిప్పన విజయసింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, వైస్ చైర్మన్ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ నూకల సరళ హనుమంత రెడ్డి, టీఆర్ఎస్ మండలాధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, మార్కెట్ కార్యదర్శి ప్రసాద్‌రావు, డైరెక్టర్లు నాగిరెడ్డి, సైదులు, ఏడుకొండలు, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, రామశేఖర్, ఏచూరి నాగేశ్వర్‌రావు, అమృతమ్మ పాల్గొన్నారు.





ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎల్ఐసీ జోనల్ కార్యాలయం అధికారులు అవేర్‌నెస్ వాక్‌ను నిర్వహించారు. ఏవీ కళాశాల విద్యార్దులు, స్వస్ద క్యాన్సర్ సెంటర్ సభ్యులు ఎల్ఐసీ ఉద్యోగులు మొత్తం 500 మంది కార్యక్రమంలో పాల్గొన్నారని రీజినల్ మేనేజర్ (మార్కెటింగ్) ఎం.జగన్నాధ్ తెలిపారు. క్యాన్సర్ వ్యాధి నివారణ, చికిత్స కోసం ఎల్ఐసీ పలు పాలసీలు అందుబాటులో ఉంచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ హెల్త్ ఇన్సూరెన్స్ వి. సతీష్ కుమార్ కూడా పాల్గొన్నారు.



జగద్గురు శంకరాచార్య శ్రీ స్వరూపానంద సరస్వతీ మహారాజ్‌ను ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీ శ్రీ రవిశంకర్ కలిసారు. పలు అంశాలపై చర్చించారు.

అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తాం



- డీకే అరుణ, విజయశాంతి

విజయక్రాంతి, హైదరాబాద్: టీ కాంగ్రెస్ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ విజయశాంతితో కలసి మాజీ మంత్రి డికె అరుణ మీడియాతో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో క్యాంపెయినింగ్ కమిటీ కాంగ్రెస్ పార్టీని విజయం దిశగా నిడిపిస్తుందని చెప్పారు. మరో సారి అధికార దుర్వినియోగానికి పాల్పడైనా 16 ఎంపీ సీట్లు గెలవాలనుకుంటున్న టీఆర్ఎస్ కుట్రలను ప్రజలు తిప్పికొడతారని డీకేఅరుణ అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా అత్యధిక పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆమె తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన దేశాలే బ్యాలెట్ పేపర్లు వాడుతున్నాయని, అన్ని పార్టీల డిమాండ్‌ను ఎన్నికల కమీషన్ పరిగణలోకి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తానని డీకేఅరుణ చెప్పారు.

నెలాఖరికి లోక్‌సభ అభ్యర్థుల ప్రకటన


ఫిబ్రవరి నెలాఖరికి లోక్ సభ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షురాలు విజయశాంతి వెల్లడించారు. టీడీపీతో పోటీ వద్దనే అనుకుంటున్నట్లు విజయశాంతి వ్యాఖ్యానించారు. ఒంటరిగానే పోటీ చేయాలనే ఆలోచన అందరిలో ఉందని, అధిష్టానం ఏం చెపుతుందో చూడాలన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే తమ ఆలోచన అని అన్నారు. అధిష్టానం పోటీ చేయాలని ఆదేశిస్తే ఖచ్చితంగా పోటీ చేస్తానని విజయశాంతి ప్రకటించారు. కమిటీలో చర్చించి సమ్మక్క, సారలమ్మ నుంచి ప్రచారం మొదలు పెడతామని విజయశాంతి తెలిపారు. కేసీఆర్ యాగాలకే పరిమితమయ్యారన్న రాములమ్మ, మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుపు పరిపూర్ణం కాదని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆ సంగతి అందరికీ అర్థమవుతుందని విజయశాంతి స్పష్టం చేసారు.

ఆల్ఫోర్స్‌లో సహృదయ అవగాహన సదస్సు



విజయక్రాంతి, కరీంనగర్: నేటి సమాజంలో ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉన్నామని భావిస్తారని, ప్రమాదవశాత్తు ఘటనలు జరిపినపుడు తోటి వారికి సహాయ పడే విధంగా ప్రతీ ఒక్కరికి ప్రథమ చికిత్స పద్దతులు తెలిసి ఉండాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని స్థానిక వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో కళాశాలలో ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థ్యాలజిస్ట్స్ వారి ఆధ్వర్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నటువంటి వారిని కాపాడే పద్దతులను తెలిపేందుకు సోమవారం సహృదయ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే ప్రత్యక్ష పద్దతిలో విద్యను శాస్త్రీయంగా తెలపడం ద్వారా చాలా ఉపయోగకరంగా, సమాజానికి హితంగా ఉంటుందని అన్నారు. చాలా మందికి గాయాలైనప్పుడు సృహను కోల్పోవడం జరుగుతుందని, అటువంటి వారికి తగు ప్రథమ చికిత్స చేసే శ్వాసకు సంబంధించి పలు పద్ధతతులు చాలా సులభంగా ఉంటాయని వైద్యులు తెలిపిన పద్దతుల్లో వాటిని అవలంభించి పునర్జీవం అందించాలని అన్నారు.ఐఎన్ఐ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ మాట్లాడుతూ చాలా మందికి గుండెనొప్పి, శ్వాస ఆగిపోవడం, బ్రెయిన్‌డెడ్ వలన ప్రాణాపాయానికి గురైతాయని, అటువంటి అపాయాల నుండి విముక్తి కల్పించే పద్దతులను విధిగా తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ఓం ప్రసాద్, రత్నాకర్, వేణుగోపాల్, మునీష్, గంగాధర్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నం రవిచంద్ర డాక్యుమెంటరీకి ప్రత్యేక జ్యూరీ అవార్డు



విజయక్రాంతి, కరీంనగర్: దాదాసాహెబ్ ఫాల్కె అవార్డు గ్రహీత, బాలీవుడ్ నటుడు కరీంనగర్ జిల్లాకు చెందిన పైడి జైరాజ్‌పై సుపద క్రియేషన్స్‌పతాకంపై కత్తి చేతన్ దర్శకత్వంలో పొన్నం రవిచంద్ర రూపొందించిన ఇన్విన్సిబుల్ హీరో డాక్యుమెంటరీ 6వ నోయిడా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రత్యేక జ్యూరీ అవార్డు గెలుచుకుంది. అలాగే ఈ డాక్యుమెంటరీ ఇన్ షార్ట్ ఇంటర్‌నేషనల్ ఫిలిం ఫెస్టివల్–2019కు ఎంపిక కాగా కరీంనగర్ ఫిలింసొసైటీతో పాటు వివిధ సాంస్కృతిక, సాహితీ స్వచ్ఛంధ సంస్థలు సంయుక్తంగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు సమైక్య సాహితి అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్యుమెంటరీని రూపొందించిన పొన్నం రవిచంద్రను ఈ నెల 6వ తేదీన బుధవారం స్థానిక ఫిలింభవన్‌లో సత్కరించనున్నామని, ఈ కార్యక్రమానికి కరీంనగర్ జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. అతిథులుగా డాక్టర్ గంద్ర లక్ష్మణ్‌రావు, నరెడ్ల శ్రీనివాస్, వారాల ఆనంద్‌తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

తారకరత్నకు జీహెచ్ఎంసీ షాక్

విజయక్రాంతి, హైదరాబాద్: నందమూరి హీరో తారకరత్నకు గట్టి షాక్ తగిలింది. బంజారాహిల్స్ లోని రోడ్ నెం.12లో తారక రత్న నడుపు తున్న ఫ్రెండ్స్ డ్రైవ్ ఇన్ రెస్టారెంటు నిబంధనలకు విరుద్ధంగా ఉందన్న ఫిర్యాదుతో జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేసేందుకు ప్రయత్నించారు. దీంతో రెస్టారెంట్ నిర్వాహకులు, జీహెచ్ఎంసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఉద్రిక్తత పరిస్థితు లు నెలకొనడంతో హీరో తారక రత్న హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారన్న కారణంతోనే అధికారులు ఈ చర్యలు చేపట్టారని తెలుస్తోంది. రాత్రి వేళల్లో మద్యం అమ్మకాలు, సౌండ్స్ తో న్యూసెన్స్ చేస్తున్నారని సొసైటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు.

ఎంపీ కవితకు కేరళ అసెంబ్లీ ఆహ్వానం



- 23 నుంచి 25 వరకు కేరళ అసెంబ్లీ డైమండ్ జూబ్లీ
- కాన్స్ట్ అండ్ డిస్కంటెంట్స్ పై స్పీచ్ ఇవ్వనున్న కవిత

విజయక్రాంతి, హైదరాబాద్: దేశంలోని విశ్వవిద్యాలయాల విద్యార్థులతో కేరళ అసెంబ్లీ నిర్వహిస్తున్న సదస్సులో ప్రసంగించాల్సిందిగా నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను కేరళ అసెంబ్లీ స్పీకర్ పి. శ్రీరామకృష్ణన్ కోరారు. ఈ మేరకు ఆయన ఎంపీ కవితను ఆహ్వానిస్తూ లేఖ రాశారు. కేరళ అసెంబ్లీ డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న సదస్సును ఉప రాష్ట్ర పతి వెంకయ్యనాయుడు 23న ప్రారంభిస్తారు. అదే రోజు మధ్యాహ్నం తిరువనంతపురంలోని కేరళ అసెంబ్లీ కాంప్లెక్స్ లో జరిగే సదస్సులో 'కాన్స్టిట్యూషన్ అండ్ ఇట్స్ డిస్కంటెంట్స్'...అనే అంశంపై ప్రసంగించాల్సిందిగా ఎంపీ కవితను కేరళ స్పీకర్ కోరారు. కేరళ సీఎంతో పాటు దేశ నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా సదస్సుకు హాజరవుతారని, దేశవ్యాప్తంగా 2 వేల మంది సామాజికంగా, రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్న జాతీయ విద్యార్థులు సదస్సుకు హాజరవుతారని శ్రీరామ కృష్ణన్ లేఖలో పేర్కొన్నారు.కేరళ అసెంబ్లీ డైమండ్ జూబ్లీ ఉత్సవాలను గత ఏడాది ఆగస్టులో రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా అనేక సెమినార్లు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి సెమినార్ ను గత ఏడాది ఆగస్టు 68 వరకు ఎస్సీ, ఎస్టీల సాధికారత సవాళ్లు అంశంపై సదస్సుజరిగింది. ఇప్పుడు రెండో సెమినార్ ను ఈ నెల 2325 వరకు జరగనుంది. ఇందులో యువతలో ప్రజాస్వామిక విలువలు, జీవన విధానం, మరియు ప్రజాస్వామిక ఆలోచనా దృక్పథాన్ని పెంపోందించే లక్ష్యంతో సదస్సును నిర్వహిస్తున్నారు. కేరళ అసెంబ్లీ, ఆ రాష్ట్ర ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల శాఖలు సంయుక్తంగా ఎంఐటి వరల్ పీస్ యూనివర్శిటీ, పుణె సాంకేతిక సహకారంతో ప్రజాస్వామ్యం పై ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి.

అమ్మ అప్పుడే సంతోషించారు: ప్రధాని మోదీ

ఢిల్లీ: తాను ముఖ్యమంత్రి అయినప్పుడే అమ్మ ఎక్కువగా సంతోషించారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. 'హ్యూమన్ ఆఫ్ బాంబే' ఫేస్‌బుక్ ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 'నేను ఈ దేశానికి ప్రధానమంత్రి అయినప్పటికీ కంటే గుజరాత్‌కు ముఖ్యమంత్రిని అయినప్పుడే మా అమ్మ ఎక్కువగా సంతోషపడ్డారు' అని తెలిపారు. నన్ను కలిసిన చాలా మంది మీరు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మీ అమ్మగారు ఎలా ఫీలయ్యారని ప్రశ్నిస్తుంటారని అని తెలిపిన ఆయన.. పై విధంగా వ్యాఖ్యానించారు. ప్రధానిగా నా పేరు బయటకొచ్చినప్పుడు దేశ వ్యాప్తంగా నా ఫొటోలను ప్రచురించారని, అనేక మంది ఆనందించారని తెలిపారు. గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా కాకముందు తాను ఢిల్లీలో ఉండేవాడినని చెప్పారు. పార్టీ నన్ను ముఖ్యమంత్రిగా ప్రకటించిన తరువాత ముందుగా అమ్మను కలవడానికి అహ్మద్‌బాద్‌కు వెళ్లానని చెప్పారు. నేను అమ్మను కలవగానే... నన్ను కౌగలించుకొని ఆనందంగా మళ్లీ గుజరాత్‌కు వచ్చేశావు. ఇదే నాకు చాలంటూ చెప్పారని తెలిపారు. ఏ తల్లి అయినా పిల్లలు తనతోనే ఉండాలని కోరుకుంటుంది. మా అమ్మ కూడా అదే కోరుకుందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమ్మ నాకు ఒకటే చెప్పారు. 'నువ్వు ఏం చేస్తావో నాకు తెలియదు. ఎప్పుడూ లంచం తీసుకోనని నాకు మాటివ్వు. ఆ పాపాన్ని నువ్వు ఎన్నడూ చేయకు' అని మాట తీసుకున్నారని తెలిపారు. ఆనాడు అమ్మ మాట్లాడిన మాటలు నాపై ఎంతో ప్రభావం చూపాయని, ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా నేను అమ్మ మాటలే పాటిస్తున్నానన్నారు. దేశం పట్ల నిజాయతీగా ఉండాలన్న అమ్మ ఆకాంక్షమేరకే ముందుకు సాగుతున్నానని ఆయన తెలిపారు.

చేనేతకు చేయూత నివ్వాలి: రాపోలు ఆనంద్‌భాస్కర్



విజయక్రాంతి, మెహిదిపట్నం: చేనేత పరిశ్రమ కు చేయూత అందించి ఆదుకోవాలని మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద్‌భాస్కర్ అన్నారు. తెలంగాణా పద్మశాలీ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 2019 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ గందూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల గెలుపొందిన సర్పంచ్‌లను సత్కరించాలనీ తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సామాల సహదేవ్, ప్రొఫెసర్ వెంకట రాజయ్య, సహఅధ్యక్షులు తిరందాస్ శ్రీనివాస్, కోశాధికారి నామాల శ్రీనివాసులు, నరేందర్, రాజు, ఈగ శ్రీనివాస్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే తొలిసారి కంబైండ్ సర్జరీ



విజయక్రాంతి, హైదరాబాద్: సన్‌షైన్ హాస్పిటల్ వైద్యులు ప్రపంచంలోనే తొలిసారి కంబైండ్ (సిఎబిజి అండ్ హార్ట్ ట్యూమర్ రిమూవల్) సర్జరీ నిర్వహించారు. ఒక వైపు గుండెలో రెండు రక్తనాళాలు మూసుకుపోయి, మరో వైపు గుండెకు కణతి, వీటికితోడు వారంలో మూడు సార్లు డయాలసిస్, చుట్టుముట్టిన జబ్బులతో ఉన్న రోగికి ఈ అరుదైన చికిత్సను గచ్చిబౌలి సన్‌షైన్ హాస్పిటల్ వైద్యులు చేశారు. ఈ శస్త్రచికిత్స జరిగిన తీరును హాస్పిటల్ చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ ప్రతిక్ భట్నాగర్ వివరించారు. యమన్ దేశానికి చెందిన సలీం(54) జనవరి 21న ఆసుపత్రికి రాగా అతడికి నిర్వహించిన 2డి ఎకోలో గుండెకు ఎడమ వైపున కణతి ఉందని, యాంజియోగ్రాఫి చేయగా గుండెకు రక్త సరఫరా చేసే రెండు రక్తనాళాలు పూర్తిగా పూడుకుపోయినట్టు నిర్ధారణ అయింది. ఒకే సమయంలో కణతి తొలగించి, రక్తనాళాలకు బైపాస్ చేయాల్సి రావడంతో కంబైండ్ సిఎబిజి, హార్ట్ ట్యూమర్ రిమూవల్ సర్జరీ చేశారు. ప్రపంచంలో తొలిసారిగా కంబైండ్ సర్జరీ నిర్వహించామని తెలిపారు.

కారు ఢీ ఒకరి మృతి

విజయక్రాంతి, రాజేంద్రనగర్: కాటేదాన్‌లోని ఓ హోటల్‌లో పనిచేసే అశోక్ రాత్రి తన విధులు ముగించుకొని శ్రీరాంనగర్ కాలనీలోకి తన ఇంటికి వెలుతుండగా కాటేదాన్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో అశోక్ తలకు తీవ్ర గాయం కావడంతో పాటు కాలు విరిగింది. ఈ ప్రమాదాన్ని గమనించిన హోటల్ సిబ్బంది వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున అశోక్ ప్రాణాలు విడిచాడు. కాగా అశోక్ కర్నాటక నుంచి కుటుంబ సమేతంగా గత కొన్నేళ్ల క్రితం బ్రతుకు దెరువుకోసం నగరానికి వచ్చి కుటుంబ సమేతంగా శ్రీరామ్ నగర్ కాలనీలో నివాసముంటున్నాడు. ఇతనికి బార్య ఇత్తరు పిల్లలు ఉన్నారు.

దీదీ వర్సెస్ మోదీ

(మొదటిపేజీ తరువాయి) వచ్చిన తర్వాత ఇంటికి క్షేమంగా వస్తామని మన పోలీసులు కుటుంబసభ్యులకు హామీ కూడా ఇవ్వలేరు. విధుల్లో ప్రాణాలు కోల్పోతే.. వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి వెంటనే ఉద్యోగం ఇస్తున్నాం. అటువంటి పోలీసులు తమ జీవితం మొత్తం పని చేస్తూనే ఉంటారు. వాళ్లకు గౌరవం ఇవ్వకపోతే.. మేం ఎంతమాత్రం అంగీకరించం' అని ఆమె స్పష్టం చేశారు. 'తృణమూల్ కాంగ్రెస్ నేతలను పట్టుకున్నా నేను వీధుల్లోకి రాలేదు. కానీ కోల్‌కతా పోలీస్ కమినషర్‌ను అవమానపరిచేందుకు వాళ్లు ప్రయత్నించడం నాకు కోపం తెప్పించింది. ఆయన ఒక ఆర్గనైజేషన్‌ను డిపిస్తున్న వ్యక్తి. అటువంటి వ్యక్తిని అవమానిస్తే వదిలిపెట్టేది లేదు' అంటూ ధర్నా చేయడాన్ని మమత సమర్థించుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులను స్వీకరించం

కేంద్రం నుంచి వచ్చే నిధులను స్వీకరించబోమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. సీబీఐ తీరుకు నిరసనగా చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా తరలి వచ్చిన ప్రజలను ఉద్దేశిస్తూ ఆమె మాట్లాడారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి వచ్చే నిధుల్ని తీసుకునే ప్రసక్తే లేదని తెలిపారు. "ప్రధాని నరేంద్ర మోదీ రైతుల హక్కులను కాలరాస్తున్నారు. అనేక మంది వ్యవసాయ భూముల్ని లాక్కున్నారు. ఇప్పటి వరకు దాదాపు 12 వేల మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు" అంటూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. "రైతుల కోసం మా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. కృషి బంధు పేరిట రైతులకు సంవత్సరానికి రూ.5000 అందిస్తున్నాం. బీమా యోజన కింద 80శాతం ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. కృషి ఫించన్ పథకంతో ప్రతి నెల రూ.1000 రైతులకు అందజేస్తున్నాం" అని మమతా వివరించారు. ఇటీవల ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ ఒక అంకెల గారడీ అని ఆమె విమర్శించారు.

దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేంతవరకు సత్యాగ్రహ ధర్నా కొనసాగిస్తా

సోమవారం ఉదయం మమత మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మీడియాతో మాట్లాడుతూ.. ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేంతవరకు నేను ఈ సత్యాగ్రహాన్ని కొనసాగిస్తానని, ధర్నా వేదిక నుంచి కదిలేది లేదన్నారు. ధర్నా వేదక నుంచే ప్రభుత్వాన్ని నడుపుతామని మమత తెలిపారు. ప్రభుత్వ సంస్థలను రాష్ట్ర ప్రభుత్వాలపై ఉసిగొలుపుతూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్న కేంద్ర ప్రభుత్వ వేధింపులకు వ్యతిరేకంగా మడం తిప్పని పోరాటం కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేశారు. తమ పోరాటం ఏ ఏజెన్సీ మీద కాదని సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం దురాగతాలకు వ్యతిరేకంగా తాము ఈ ధర్నా చేపట్టినట్లు ఆమె వివరించారు. కేంద్ర సంస్థల బాధితురాలిగా రాష్ట్రం మారుతోందంటూ మండిపడ్డారు. ప్రజలను భయపట్టేందుకు కేంద్రం ప్రయత్నాలు సాగిస్తోందని మండిపడ్డారు. బీజేపీని ఎవరైనా వ్యతిరేకిస్తే, వాళ్లను జైలుకు పంపించడం వారిపై జాతివిద్రోహి అనే ముద్ర వేయడం చేస్తారని ఆరోపించారు. తాను చేపట్టిన ఈ అతిపెద్ద పోరాటానికి దేశం మొత్తం నుంచి మద్దతు లభిస్తోందని ఆమె వెల్లడించారు. ధర్నా జరిగే ప్రదేశంలో ఎటువంటి మైకులు ఉపయోగించొద్దని అధికారులకు సూచించారు.

పరీక్షలు జరుగుతోన్న నేపథ్యంలో మైకులు వల్ల విద్యార్థులు ఇబ్బంది పడతారని మమత పేర్కొన్నారు. ఓవైపు ధర్నా చేస్తూనే మరోవైపు సీఎంగా రోజూ నిర్వర్తించే విధులను ధర్నా వేదికపై నుంచే చక్కబెట్టారు. అధికారులు సమర్పించిన డాక్యుమెంట్లను పరిశీలిస్తూ పాలనాపరమైన విధులను మరువకుండా మమతా బెనర్జీ వ్యవహరించారు. ఈనెల 8వ తేదీ వరకూ ధర్నా కొనసాగించాలని మమత యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా సోమవారం ఉదయం భారీ సంఖ్యలో తృణమూల్ నేతలు, కార్యకర్తలు దీక్షా వేదిక వద్దకు చేరుకుని మమతాబెనర్జీకి మద్దతు పలికారు. తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఆందోళనకు సిద్ధంకాగా, ఆ పార్టీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలిపారు.

స్కామ్‌లు, స్కీమ్‌ల వివాదం ఏమిటీ?

శారదా చిట్ ఫండ్ , రోజ్ వాలీ పోంజి స్కీముల కుంభకోణాల్లో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఆమె అనుచరులకు సంబంధం ఉందన్నది ఆరోపణ. మమతా బెనర్జీపై ఆరోపణలు రావడానికి శారదా స్కీమ్‌కు చెందిన రెండు కార్యాలయాలను ఆమె స్వయంగా ప్రారంభించడం కారణం. కాగా టీఎంసీకి చెందిన ఓ ఎంపీ శారదా చిట్ ఫండ్ కంపెనీ మీడియా డివిజన్‌కు అధిపతిగా ఉండడం మరో కారణం. మమతా బెనర్జీ కార్యాలయాలను ప్రారంభించడం వల్లనే శారదా చిట్ ఫండ్ కంపెనీని ప్రజలు ఎక్కువగా నమ్మారు. 'మీరు చెల్లించే ప్రతి వందరూపాయలకు యాభై శాతం అంటే, నూటికి 150 రూపాయలను ఏడాదికి చెల్లిస్తాం' అంటూ శారదా కంపెనీ ప్రజల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసింది. ఏడాది తిరగ్గానే ముందుగా పెట్టుబడులు పెట్టిన వారికి, ఆ తర్వాత పెట్టుబడులు పెట్టిన వారి డబ్బును చెల్లిస్తూ వచ్చింది. ఆ తర్వాత పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోవడంతో ముందుగా పెట్టుబడి పెట్టిన వారికి డబ్బులు ఇవ్వలేకపోయింది. వెంటనే ఈ కంపెనీ కార్యకలాపాలను నిలిపేయాల్సిందిగా 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా' 2013లో ఆదేశాలు జారీ చేసింది. నాడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసుపై సీబీఐ విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. చిట్ ఫండ్ లాగే ప్రజల నుంచి పెట్టుబడులు వసూలు చేసిన 'రోజ్ వాలీ' బెంగాలీ సినిమాల్లో భారీగా పెట్టుబడులు పెట్టింది. ఐపీఎల్ లీగ్ క్రికెట్‌లో 'కోల్కతా నైట్ రైడర్స్'కు స్పాన్సర్ చేసి నిండా మునిగింది. దీంతో 2015లో చేతులు ఎత్తేసింది. శారదా చిట్ ఫండ్ నుంచి రుణాలు తీసుకున్న 'ఈ సమయ్' వార్తా పత్రిక ఎడిటర్ సుమన్ ఛటోపాధ్యాయ్‌ను గత డిసెంబర్ నెలలో సీబీఐ అరెస్ట్ చేసింది. ఇక రోజ్ వాలీ స్కామ్‌కు సంబంధించి ఆ కంపెనీ నుంచి రుణం తీసుకున్న బెంగాలీ సినిమా నిర్మాత శ్రీకాంత్ మెహతాను జనవరి 24వ తేదిన సీబీఐ అరెస్ట్ చేసింది. కాగా ఈ రెండు కేసుల్లో ఆరోపణలకు సంబంధించిన సాక్ష్యాధారాలను కనుమరుగు చేస్తున్నారన్న ఆరోపణలపై కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌పై సీబీఐ అధికారులు ఆదివారం దాడులు జరపడం తీవ్ర కలకలం రేపింది.

సీబీఐ నేరుగా దర్యాప్తుపై.. బెంగాల్ ప్రభుత్వం ఆగ్రహం

ఏ కేసు విషయంలోనైనా ఓ రాష్ట్రంలోకి సీబీఐ నేరుగా ప్రవేశించి దర్యాప్తు జరపడానికి, దాడులు నిర్వహించేందుకు వీల్లేదు. అలాంటి సందర్భాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ముందస్తు అనుమతి తప్పనిసరి. కోర్టు అనుమతి లేదా ఆదేశాలతో దాడులు చేయవచ్చు. ప్రతి కేసు విషయంలో సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రాల ముందస్తు అనుమతి తలనొప్పి వ్యవహారం. దీంతో ఏడాదికోసారే సీబీఐ అన్ని కేసులకు సంబంధించి రాష్ట్రాల నుంచి ఒకేసారి అనుమతి తీసుకుంటుంది. అలా అనుమతి ఇవ్వడం కూడా రాష్ట్రాలకు పరిపాటే. అయితే గత నవంబర్ నెలలోనే అలా అనుమతి ఇచ్చేందుకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ముందస్తు అనుమతి లేకుండా కోల్‌కతా పోలీసు కమిషనర్ నివాసంపై దాడులు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని, దీనికి కేంద్రమే కారణమని మమతా ప్రభుత్వం ఆరోపిస్తోంది. అయితే ఈ దాడుల వెనక తమ ప్రమేయం లేదని కోర్టు ఆదేశాల మేరకే సీబీఐ దాడులు నిర్వహించిందనీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వాదిస్తోంది. కాగా యూపీలో మాయావతి, అఖిలేష్ యాదవ్‌పై పాత కేసులను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని సీబీఐ, ఈడీ సంస్థలు తిరగతోడడం, తాజాగా బెంగాల్ ప్రభుత్వం అనుమతి లేకుండా కోల్‌కతా పోలీస్ కమిషనర్ నివాసంపై సీబీఐ దాడులు నిర్వహించడం వంటి పరిణామాలు దేశ రాజకీయాల్లో తీవ్ర సంక్షోభ పరిస్థితులకు దారితీయవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.

కోల్‌కతాలో బీజేపీ కార్యాలయం ధ్వంసం

పశ్చిమ బెంగాల్‌లో అధికార టీఎంసీ, బీజేపీ నేతలు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఈనేపథ్యంలో సోమవారం కొందరు ఆందోళనకారులు కోల్‌కతాలోని బీజేపీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. అయితే అధికార తృణమూల్ కార్యకర్తలే తమ కార్యాలయంపై దాడికి తెగబడ్డారని బీజేపీ నేతలు ఆందోళనకు దిగారు.

ఈసీని కలిసిన బీజేపీ నేతలు

మరోవైపు బెంగాల్లో శాంతి భద్రతలు క్షీణించాయని ఆరోపిస్తూ బీజేపీ ప్రతినిధి బృందం సోమవారం ఈసీని కలిసింది. ఆ రాష్ట్రంలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని విజ్ఞప్తి చేసింది. ఈసీని కలిసిన బీజేపీ ప్రతినిధి బృందంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ముక్తార్ అబ్బాస్ నక్వీ, అహ్లూవాలియా పార్టీ సీనియర్ నేతలు, బీజేపీ బెంగాల్ ఇన్చార్జ్ కైలాష్ విజయవర్గీయ తదితరులున్నారు. రాష్ట్రంలో బీజేపీ నేతల ర్యాలీలను మమతా బెనర్జీ నేతృత్వంలోని బెంగాల్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని బీజేపీ నేతలు ఆరోపించారు.

సీబీఐ వివాదం నేపథ్యంలో విపక్షాలు మమతా బెనర్జీకి బాసటగా నిలవడంపైనా వారు మండిపడ్డారు. అవినీతిని ప్రతిపక్షాలు సమర్థిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులను తొలగించాలని తాము ఈసీని కోరామని భేటీ అనంతరం కేంద్ర మంత్రి నక్వీ తెలిపారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికల నిర్వహణ చేపట్టేందుకు కేంద్ర బలగాలను నియోగించాలని కోరామన్నారు. పశ్చిమ బెంగాల్లో నెలకొన్న దారుణ పరిస్థితులను ఈసీకి వివరించామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ, అకారణంగా నిర్బంధిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ నేతల ర్యాలీలకు అనుమతి నిరాకరిస్తూ వేధింపులకు గురిచేస్తున్న విషయాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

ప్రహసనంగా ఓటర్ల నమోదు కార్యక్రమం

- అధికారుల మధ్య అవగాహనాలోపం
- పలు విమర్శలు ఎదుర్కొంటున్న ఎన్నికల కమీషన్




విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఒక ప్రసహనంగా సాగుతోంది.ఎన్నికల కమిషన్ అధికారులు చేస్తున్న ప్రకటనలకు,క్షేత్ర స్థాయిలో జరుగుతున్న నమోదు కార్యక్రమానికి పొంతన లేకుండా పోతోందని పలువురు విమర్శిస్తున్నారు.దానితో పాటు అనేకమంది ఉన్నతాధికారుల ఓట్లు గల్లంతు అవుతుండటం,కేంద్ర ఎన్నికల అధికారి,రాష్ట్ర ఎన్నికల అధికారులు పేర్లతో రెండు, మూడు చోట్ల ఓట్లుగా నమోదు అవుతుండటం,ఈఆర్ఓ నెట్ లో కూడా లోపాలు తలెత్తుండటం వంటి చర్యలు గందరగోళం గా తయారు అయ్యాయనే విమర్శలు వస్తున్నాయి.దాయి సమస్యలన్నిటికీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులకు,జిల్లాల ఎన్నికల అధికారులు అయిన కలెక్టర్లకు మధ్య అవగాహన లోపం కూడా పలు సమస్యలకు కారణమని తెలుస్తోంది.దీనిపర్యవాసానమే కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా వికారా బాద్ జిల్లాలో కోర్టు తీర్పునకు వ్యతిరేకం గా జిల్లా కలెక్టర్ ఓటింగ్ యంత్రాలను తెరిపించారని తెలుస్తోంది 2019సంవత్సరం జనవరి ఒకటవ తేదీనాటికి 18సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లగా నమోదు చేసుకోవటానికి పోలింగ్ బూత్ స్థాయిలో ఏర్పాట్లు చేశామని అధికారులు దినపత్రికల్లో ప్రకటనలు చేస్తున్నా,అక్కడ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని అనేకమంది వాపోతున్నారు.కొత్తగా ఓటరుగా నమోదు కావటానికి,ఓటర్ల జాబితాలో పేరు గల్లంతు అయినా ,చిరునామాలో మార్పు వచ్చినా సంబంధిత సమాచారాన్ని ఎన్నికల సంఘం కు నివేదించటానికి ఈనెల నాలుగో తేదీ ని తుదిగడువుగా నిర్ణయించారు.ఎన్నికల సంఘం వెబ్ సైట్ లో నమోదు చేసుకోవటం తో పాటు పోలింగ్ కేంద్రాల స్థాయిలో ధరకాస్తులు అందచేయ వచ్చు అని,గ్రామ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకూ దీనిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశామని,ప్రతి పోలింగ్ కేంద్రంలోను పోలింగ్ బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని ఎన్నికల కమిషన్ అధికారులు అన్ని దినపత్రికలలో ప్రకటనలు ఇచ్చింది.దానికి తగ్గట్టు ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక టెంట్లు వేసి ఓటర్లను చైతన్య పరచటానికి బ్యానర్లు కూడా కట్టారు.అయితే ఈ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారులకు బదులు దినసరి వేతనం పై పనిచేసే ఇతర సిబ్బందిఈ విధులలో పాల్గొనటం తో సరిఅయిన విధంగా సమాచారాన్ని అందించలేక పోయారని పలువురు విమర్శిస్తున్నారు.దీనితో పాటు చాలా కేంద్రాలలో కేవలం ఒక గంట వ్యవధిలోనే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారని పలువురు ఎన్నికల కమిషన్ కు పిర్యాదు చేశారు.

అవగాహనా లోపం

రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం అధికారులకు,జిల్లా స్థాయి ఎన్నికల అధికారులకు,బూత్ స్థాయి అధికారులకు మధ్య సరియన అవగాహన లేకపోవటం కూడా కొంతమేర గందరగోళానికి కారణం అవుతోందని పలువురు విమర్శిస్తున్నారు.కేంద్రఎన్నికల సంఘం రూపొందించిన ఈఆర్ఓ నెట్ ద్వారా ఓటర్ల వివరాలు నమోదుకు పలు సమస్యలు తలెత్తినట్లు తెల్సస్తోంది.పేరులోకాని చిరునామాలో కానీ కేవలం ఒక్క అక్షరం తప్పు దొర్లినా నెట్ లో నమోదు కావటం లేదని సిబ్బంది వాపోతున్నారు.ఎన్నికలకమిషన్ అధికారులు జారీ చేస్తున్న ఉత్తర్వులు క్షత్ర స్థాయి లో సక్రంగా అమలు కావటం లేదని,చివరికి తుది జా బితా తయారీలో సమస్యలు తలెత్తుతున్నాయని ఎ న్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వాపోతున్నా రు.అదేవిధం రాష్ట్రానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు పేర్లు జాబితాలో గల్లంతు కావటం కూడా అనేక విమర్శలకు దారితీస్తోంది.హైదరాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన నమోదు ప్రక్రియలో సీనియర్ ఐఎఎస్ ,ఐపీఎస్ అధికారుల పేర్లు గాలం టూ అవటం,దానికి ఎన్నికల విధులు కో సం నియమి ంచిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు అవగాహన లేకపోవటం కారణమని అధికారులు పేర్కొంటున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపం కూడా ప్రధాన కారణమని పలువురు విమర్శిస్తున్నారు.

హెచ్ఎండీఏలో అతీగతీ లేని అడ్వర్టైజ్‌మెంట్ విభాగం

- ఖజానాకు గండికొడుతున్న ఏజెన్సీలు
- ఏజెన్సీల వద్ద 30 కోట్లు బకాయిలు
- గతంలో అందినంత దండుకున్న అధికారులు



విజయక్రాంతి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)లో అడ్వర్టైజ్‌మెంట్ విభాగం అతీగతీ లేకుండా తయారైంది. కోట్ల రూపాయల ఆధాయం వచ్చే డిపార్ట్ మెంట్ ను పట్టించుకునే వారే కరువయ్యారు. గతంలో ఈ విభాగాన్ని మూడు ముక్కలు చేసి పరిపాలించిన అధికారులు, ఇప్పుడు మాత్రం ఎవరు అటువైపు కన్నెత్తి చేడడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆదాయవనరుగా ఉన్న హెచ్ఎండీఏలోని అడ్వర్టైజ్‌మెంట్ విభాగం ఆలనా పాలనా లేక ఆగమైపోయింది. ప్రతి యేటా కోట్ల రూపాయలు వచ్చే అవకాశమున్నా వసూల్ చేసేవారే కరువయ్యారు. ఇదే అదునుగా చేసుకొని ఏజెన్సీలు, సంస్థ ఖజానాకు గండికొడుతున్నారు.

పంచుకొని పబ్బం

హెచ్ఎండీఏ అంటేనే వందల కోట్ల రూపాయల ప్రాజెక్టులు, అంతేకాదు లేఅవుట్ల పర్మిషన్లు, నిర్మాణాల అనుమతులు, భూసేకరణలు, ప్లాట్ల వేలం ఇలా ప్రతి యేటా వివిధ మార్గాల ద్వారా వేల కోట్ల రూపాయలను గడిస్తోంది. కానీ కోట్ల రూపాయల రెవెన్యూ వచ్చే అడ్వర్టైజ్‌మెంట్ విభాగం మాత్రం కొన్నేళ్లుగా ఆగమైపోయింది. మొన్నటి వరకు పబ్లిసిటీ విభాగాన్ని మూడు ముక్కలు చేసి చూసేవారు అధికారులు. అందులో అర్బన్ ఫారెస్ట్ వింగ్, బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు (బీపీపీ), రిసర్చ్ అండ్ డెవలప్ మెంట్ (ఆర్ అండ్ డీ) విభాగాలకు చెందిన అధికారులు ఏరియాలుగా పంచుకొని పనిచేసేవారు. అయిన హెచ్ఎం డీఏకు మాత్రం ఒక్కరూపాయి కూడా వసూల్ చేసిన సందర్భాలు లేవు. ఏవరికి వారే యమున తీరే అన్నట్లు ఏజెన్సీలతో చేతులు కలిపి దండుకున్నారు. ఫలితంగా 2010 నుండి హెచ్ఎండీఏకు 30 కోట్లకు పైగా ఏజెన్సీలు బకాయిలు పడ్డాయి. అయిన ఇప్పటి వరకు హెచ్ఎండీఏకు మాత్రం ఒక్క రూపాయి కూడా వసూల్ చేయడం లేదు.

పుట్టగొడుగుల్లా అక్రమ హోర్డింగ్‌లు

హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సిటీలో విచ్చల విడిగా అక్రమ హోర్డింగ్ లు వెలుస్తున్నాయి. అంతేకాదు యాడ్ ఏజెన్సీల టెండర్ గడువు ముగిసిన పట్టించుకునే వారే లేకపోవడంతో.. ఇంకా కొనసాగుతునే వున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో 20 వరకు ఏజెన్సీలు కొనసాగుతున్నాయి. దాదాపు అన్ని ఏజెన్సీలు కోట్లల్లో బకాయిలు చెల్లించాల్సి వుంది. అయిన బకాయిలు చెల్లించకుండానే హోర్డింగ్ లు పెట్టుకొని బిజినెస్ కొనసాగిస్తున్నాయి. హెచ్ఎండీఏకు చెందిన లుంబిని పార్క్, ఎన్టీఆర్ పార్క్, సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్ మార్గాల్లో కుప్పలు కుప్పలుగా లాలీ పప్స్, డస్ట్ బిన్ పోల్స్ వేలిశాయి. ఇవేకాకుండా పీవీఎన్ఆర్ ఎక్స్ ప్రెస్ హైవే కింద పిల్లర్లకు కూడా హోర్డింగ్ లు పెట్టి దండుకుంటున్నారు. ఈ మార్గంలో హెచ్ఎండీఏ నుండి ఎలాంటి అనుమతి లేకుండానే ఓ సంస్థ కోటి రూపాయలు ఇన్వేస్ట్ చేసి.. వందల సంఖ్యలో పిల్లర్లకు రెండు వైపుల హోర్డింగ్స్ పెట్టేసింది. అయిన పట్టించుకునే వారే కరువయ్యారు. అలాగే శిల్పారామం, హైటెక్ సిటీ ఏరియాల్లో సైతం టూ సైడ్, త్రిసైడ్ హోర్డింగ్ లు వున్నాయి. 2016 లో కేబీఆర్ పార్క్ వద్ద వున్న యూనిక్ పోల్, భారీ హోర్డింగ్ లను జీహెచ్ఎంసీకి అప్పగించారు. ఇకనైనా ప్రభుత్వంఈ పరిస్దితిని చక్కదిద్దాలి.

బీజేపీ x ప్రతిపక్షాలు

(మొదటిపేజీ తరువాయి) బయట ఉన్నవాళ్లు. అలాంటి వాళ్లు ఆమెకు అండగా నిలుస్తున్నారు. ఇది మహాకూటమి కాదు. అవినీతిపరులంతా కలిసి నిలబడుతున్నారు. ఇది పశ్చిమ బెంగాల్‌లో మమతా విధించిన అత్యవసర పరిస్థితి. కేంద్రంలో కాదు' అని ఆయన విమర్శించారు.

మమత ధర్నాలో సీపీ.. దేశం ఎక్కడికిపోతోంది?: రవిశంకర్ ప్రసాద్

ధర్నాకి కూర్చోవడం ద్వారా కేజ్రీవాల్ బాటనే మమతా బెనర్జీ ఎంచుకున్నారని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. 'ఒక పోలీస్ కమిషనర్ రాజకీయనాయకులతో కలిసి ధర్నాలో కూర్చుకున్నారు. దీని అర్థం ఏమిటి? కమిషనర్ స్థాయి ప్రభుత్వ ఉద్యోగి ధర్నాలో కూర్చోవడం అసాధారణ పరిణామం. దేశంలో అసలు ఏం జరుగుతోంది? అవినీతిని విచారించడం నేరమా?' అని ఆయన ప్రశ్నించారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పరిమితులను దాటారని మండిపడ్డారు. దీకి విపక్ష పార్టీలు మద్దతు ప్రకటించిన క్రమంలో ప్రతిపక్షాలు అవినీతిని సమర్థిస్తున్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిలో ప్రమేయం ఉందన్న వ్యక్తులను విచారించడం నేరమన్నట్టు విపక్షాలు వ్యవహరించడం బాధాకరమన్నారు. పశ్చిమబెంగాల్‌లో చోటుచేసుకున్న చిట్‌ఫండ్ కుంభకోణంలో 20 లక్షల మంది ప్రజలు డబ్బులు పోగొట్టుకున్నారని 2014లో రాహుల్ గాంధీ చేసిన ప్రకటనను కాంగ్రెస్ ట్వీట్ చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

తాము అదే ఏడాది మే 26న ప్రమాణస్వీకారానంతరం నారద, శారదా కుంభకోణాలపై దర్యాప్తులు జరిపించామన్నారు. ఈ కుంభకోణాలపై దర్యాప్తు జరపడం నేరమా? అని రవిశంర్ ప్రసాద్ ప్రశ్నించారు. మమత సారథ్యంలో మహాకూటమి ఏర్పాటు ప్రయత్నాలపైనా విమర్శలు గుప్పించారు. అదొక అవకాశవాదుల కూటమి అని ఆయన అభివర్ణించారు.

రాహుల్ జీ.. త్వరగా కోలుకోండి

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేపట్టిన సత్యాగ్రహ ధర్నాకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించడంపై బీజేపీ వ్యంగాస్త్రాలను సంధించింది. గతంలో శారదా కుంభకోణం విషయంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఆ పార్టీ ఓ ట్వీట్ చేసింది. 'మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్‌తో బాధపడుతున్న రాహుల్ జీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం' అని అందులో పేర్కొంది. దేశంలోని వ్యవస్థలపై మోదీ, బీజేపీ చేస్తున్న దాడుల్లో ఇది భాగమని రాహుల్ నిన్న ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. అయితే 2016లో పలు ప్రచార కార్యక్రమాల్లో రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ట్వీట్లను బీజేపీ పోస్టు చేసింది. అందులో 'శారద చిట్ ఫండ్ కుంభకోణం కారణంగా దాదాపు 20 లక్షల మంది ప్రజలు తమ నగదును పోగొట్టుకున్నారు.

అవినీతిని రూపుమాపుతానని మమతా జీ అన్నారు. కానీ దానికి బదులుగా ఆమె బెంగాల్‌ను దోచుకుంటున్న వారిని కాపాడుతున్నారు. శారదా కుంభకోణం దేశంలోనే అతిపెద్ద కుంభకోణాల్లో ఒకటి. పశ్చిమ బెంగాల్లో సిండికేట్ రాజ్, మాఫియా రాజ్ నడుస్తుంది' అంటూ రాహుల్ గతంలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ట్వీట్ల ఫొటోను బీజేపీ పోస్టు చేసింది. ఈ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రాహుల్ మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్‌తో బాధపడు తున్నారంటూ వ్యంగాస్త్రాలు సంధించింది. 'ఇటువంటి వ్యాధితో బాధపడే వాళ్లు గతంలో జరిగిన విషయాలను గుర్తు చేసుకోవడంలో ఇబ్బంది పడతారు. వాటిని మరిచిపోతారు. రాహుల్ జీ.. త్వరగా కోలుకోండి' అంటూ బీజేపీ ట్వీట్ చేసింది.

దీదీకి విపక్షాల దన్ను

(మొదటిపేజీ తరువాయి) హక్కుల కోసం రాజీపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఇతర పార్టీలు ఉండొద్దన్న ఆలోచన సరికాదని సూచించారు. ఎక్కడికక్కడ తిరుగుబాటు చేస్తేనే వెనక్కి తగ్గుతారని చంద్రబాబు అన్నారు. రాజకీయాల్లో ఇంత అహంభావం ఉండొద్దని హెచ్చరించారు. బడ్జెట్ తర్వాత కోల్కతా వెళ్లి మమతకు సంఘీభావం తెలుపుతామని తెలిపారు. ఏపీకి కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని చంద్రబాబు మండిపడ్డారు.

సమాఖ్య స్ఫూర్తిపై దాడి : కుమారస్వామి

కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి సైతం మమతకు తన సంఘీభావం ప్రకటించారు. "బెంగాల్ ఘటన రాజ్యాంగంలో పేర్కొన్న సమాఖ్య స్ఫూర్తిపై దాడి చేయడమే. మేం మమతా బెనర్జీకి మద్దతుగా నిలుస్తున్నాం" అని వ్యాఖ్యానించారు.

సీబీఐని దుర్వినియోగం చేస్తున్న కేంద్రం: అఖిలేశ్ యాదవ్

సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. 'ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్రం సీబీఐని దుర్వినియోగపరుస్తోంది. ఈ విషయంలో ఎస్పీతో పాటు దేశం మొత్తం ఇదే చెబుతోంది. కొంతకాలం క్రితం సీబీఐ డైరెక్టరు వివాదంతో ఆందోళనకు గురైన కేంద్రం ఇప్పుడు సీబీఐని అడ్డం పెట్టుకుని విపక్షాలను బెదిరించాలని చూస్తోంది' అంటూ ఘాటుగా విమర్శించారు.

డీసీఎం ఢీకొని మహిళా హోంగార్డు మృతి

విజయక్రాంతి, రాజేంద్రనగర్: డీసీఎం ఢీకొని ఓ మహిళా హోంగార్డు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్ పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతబస్తీలోని అలియాబాద్‌లో నివాసముంటున్న కె. సుజాత (45), పేట్లబురుజులోని పోలీస్‌హెడ్‌క్వార్టర్స్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తుంది. సోమవారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుజాత తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు కలిగి ఉండాలి



విజయక్రాంతి, ముషీరాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటును కలిగి ఉండాలని, సరైనా నాయకుడిని ఎన్నుకుని దేశ అభివృద్ధికి పాటుపడాలని మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. సోమవారం సికింద్రాబాద్ నామాలగుండు బీజేపీ పార్టీ కార్యాలయం ఆవరణలో హైదరాబాద్ నగర బీజేవైఎం అధ్యక్షుడు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రామచంద్ర రావు, బీజేపీ సీనియర్ నాయకులు బండపల్లి సతీష్ గౌడ్, వెంకటరెడ్డి హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా వివరాలు సేకరించి, ఏ ఒక్కరి ఓటు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వేల సంఖ్యలో ఓట్లు గల్లంతయ్యాయని దీంతో ఓటర్లు నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. భారత్ నరేంద్ర మోదీ పాలనతో అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రవి ప్రసాద్‌గౌడ్, సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకటేష్ గౌడ్, సికింద్రాబాద్ ఇంచార్జ్ కన్వీనర్ హరి, కౌశిక్, శశి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలను పటిష్టం చేయాలి

విజయక్రాంతి, ముషీరాబాద్: ప్రస్తుతం ఉన్న మహిళా సంఘాలను పటిష్టం చేయడం చాలా అవసరమని ముషీరాబాద్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో షహరీ సమృద్ధి ఉత్సవ కార్యక్రమంలో భాగంగా జవహర్‌నగర్ కమిటీ హాల్ నుండి సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ హాజరై ర్యాలీలో పొదుపు సంఘాల మహిళలతో కలిసి ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ అశోక్ నగర్ చౌరస్తా నుండి ముషీరాబాద్ వరకు ర్యాలీగా బయలుదేరి షహరీ సమృద్ధి ఉత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ రత్న రాణి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధితో ప్రకృతి సురక్షితం

- ప్రతి జీవరాశిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి
- పేదరికం నిర్మూలన కోసం కృషి చేయాలి
- డైరెక్టర్ జనరల్ కళ్యాణ్ చక్రవర్తి



విజయక్రాంతి, హైదరాబాద్: ప్రకృతి సురక్షితంగా ఉండాలంటే సుస్థిర అభివృద్ధి చేయాల్సిన అవసరముందని పర్యావరణం రక్షణ మరియు శిక్షణ సంస్థ డైరెక్టర్ జనరల్ బీ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో సుస్థిర అభివృద్ధి– ప్రకృతి నుంచి నేర్చుకోవడం అనే అంశంపై ఇంజనీర్ తిరుపతిరెడ్డి ఎండోమెంట్ ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రకృతి రక్షణతోనే ప్రపంచడం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందన్నారు. ప్రకృతిలో పర్యవరణాన్ని సమతుల్యం చేయాలని, దీని కోసం ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు రాంకీ డైరెక్టర్, కేంద్ర నది జలాల మాజీ ఛైర్మన్ డాక్టర్ పీ శాస్త్రీ సుస్థిర అభివృద్ధి– ప్రకృతి నుంచి నేర్చుకోవడం అనే అంశంపై సుదీర్ఘంగా ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్రకృతిలో మానవుడు తన అవసరాల కన్నా ఇష్టాలను విపరీతంగా వినియోగిస్తున్నారని, దీని వల్ల ప్రకృతిలో సమతుల్యత దెబ్బతింటుందన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై 2015 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి ఒక విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. ఈ లక్ష్యాలను 2030వ సంవత్సరానికి పూర్తి చేయాలని పేర్కొన్నదని గుర్తు చేశారు.

పేదరికం నిర్మూలన కోసం కృషి చేయాలి

వీటిలో ప్రధానంగా ప్రపంచంలో పేదరికం చాలా పెరిగిపోతుందని గుర్తు చేశారు. పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ఆయా ప్రభుత్వాలు కృషి చేయాలని పేర్కొన్నారు. వీటితో పాటు నాణ్యమైన విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. లింగ వివక్ష లేకుండా సమాజాన్ని నిర్మించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు శాంతి భద్రతలను కాపాడడం, వాటితో పాటు ప్రతి ఒక్కరూ సంతోషమైన జీవితాన్ని గడిపేందుకు కృషి చేయాలని ఐక్యరాజ్యసమితి లక్ష్యాలను నిర్దేశించాలని పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధికి ఇంధన ఉత్పత్తి ప్రధాన కారణమని అన్నారు. దీన్ని సూర్య మండలం నుంచి తీసుకోవాలన్నారు. నాణ్యమైన ఇంధన ఉత్పత్తితో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చునని తెలిపారు. ప్రకృతిలో సుస్థిర అభివృద్ధి చేస్తేనే జీవరాశులకు మనుగడ ఉంటుందని డాక్టర్ శాస్త్రీ తన పవర్‌పాయింట్ ప్రజేంటేషన్‌లో వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.



వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకొని ముషీరాబాద్‌లో కాన్సర్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, కార్యక్రమంలో డాక్టర్ భారతి, దివ్య, కాల కోట అరుణ్‌కుమార్, శివాజీ, శంకర్, మంగళ రామారావు, పల్లవి భగవత్ తదితరులు పాల్గొన్నారు. –విజయక్రాంతి, ముషీరాబాద్

యాదవుల సంక్షేమానికి కృషి




విజయక్రాంతి, మెహిదిపట్నం: తెలంగాణలోని యాదవుల సంక్షేమం కోసం తెలంగాణ యాదవ్ అఫిషల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఎప్పుడూ కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్ తెలిపారు. చండూర్ మండలం తాస్కానీగూడెంకు చెందిన సర్పంచ్‌గా గెలుపొందిన లింగయ్య యాదవ్‌ను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగయ్యయాదవ్ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం చేసిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడని, యాదవుల సంక్షేమానికి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చోళ ఓంప్రకాశ్‌యాదవ్,అంజయ్యయాదవ్, సత్యనారాయణయాదవ్, నాగరాజ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకట్‌యాదవ్, నర్సింహయాదవ్, హరికృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు

- అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

విజయక్రాంతి, కూకట్‌పల్లి: అభివృద్ధి పనులపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్, ఆల్విన్ కాలనీ కాలనీ, హైదర్‌నగర్ డివిజన్, కూకట్‌పల్లి (పార్ట్) డివిజన్ పరిధిల్లోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మరియు కార్పొరేటర్ దొడ్లవెంకటేష్‌గౌడ్‌తో కలిసి సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఆయా డివిజన్‌లలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని, పలు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను తీర్చే విధంగా పలు సూచనలు ఇచ్చారు. అలాగే పీపీఎం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన పనులలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. పైప్ లైన్ల ఏర్పాటులో జరుగుతున్న జాప్యం వల్ల రోడ్డు నిర్మాణాలు చేపట్టలేక పోతున్నారని, ఆల్విన్ కాలనీ, ఆస్బెస్టాస్ కాలనీలో వాటర్ పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి కాబట్టి వెంటనే రోడ్ల పనులు చేపట్టాలని అన్నారు. డ్రైనేజీ, రోడ్లు ఇతరత్రా పనులు పెండింగ్‌లో ఉన్నవాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అన్నారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు సూచించారు. యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించడం జరిగింది. పనులలో జాప్యాన్ని సహించే ప్రసక్తే లేదని, పనులు తీసుకొని జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూడాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జీహెచ్ ఎంసీ అధికారులు, ఈఈ శ్రీధర్, డీఈలు కృష్ణ, శ్రీరాములు, ఈఎలు సుభాష్, రాజీవ్, వర్క్ ఇనస్పెక్టర్ మహాదేవ్ పాల్గొన్నారు.

నేడు నితిన్ గడ్కరీ రాక



విజయక్రాంతి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి బీజేపీ క్లస్టర్ సమావేశాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి క్లస్టర్ సమావేశం నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని సిక్ విలేజ్‌లో నిర్వహించే ఈ సమావేశానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హాజరవుతున్నారు. శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించే ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఆయన దిశా నిర్దేశం చేయనున్నారు.

ఫిబ్రవరి 15 నుంచి నాగోల్–హైటెక్‌సిటీల మధ్య మెట్రో

- విజయవంతమైన ట్రయల్ రన్స్



విజయక్రాంతి, హైదరాబాద్: మెట్రో రైలు సర్వీసుల్లో 3 వ దశ ప్రారంభం కానుంది. జంట నగరాల ప్రజలు ఎదురు చూస్తున్న హైటెక్ సిటీ మెట్రో సర్వీసులను ఈ నెల 15తేదిన ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు నెలలుగా అమీర్‌పేట –హైటెక్‌సిటీ మార్గంలో ట్రయల్ రన్స్ విజయవంతం కావడంతో తుది అనుమతి కోసం కమిషనర్ ఆఫ్ మెట్రో రైల్ సేఫ్టీ(సీఎంఆర్)ని మెట్రో అధికారులు సంప్రదించినట్లు సమాచారం. హైదరాబాద్ మెట్రో రైళ్ల నిర్వహణలో ప్రపంచంలోనే అత్యుత్తమ సాంకేతిక టెక్నాలజీ అయిన కమ్యూనికేషన్ బేస్డ్ ట్రెయిన్ కంట్రోల్ (సీబీటీసీ)ని వినియోగిస్తుండడంతో దీనికి సంబంధించిన రెండు సంస్థల నుంచి భద్రతా పరంగా సంతృప్తి వ్యక్తం చేయడంతో తుది పరీక్షగా కేంద్ర రైల్వే శాఖ నుంచి సీఎంఆర్‌ఎస్ ప్రతినిధుల బృందం అమీర్‌పేట నుంచి హైటెక్‌సిటీ మార్గంలో పరిశీలన చేస్తోంది. ఇది పూర్తి కావడానికి మరో వారం పడుతుందని, తర్వాత ప్రారంభోత్సవం తేదీ, ముహూర్తాన్ని ప్రభుత్వమే ఖరారు చేస్తుందని తెలిసింది. 15వ తేదీలోగా అన్ని పరీక్షలు, అనుమతులు వచ్చే అవకాశం ఉందని కాబట్టి ఫిబ్రవరి 15 న మెట్రో ప్రారంభించే అవకాశం ఉంది.

మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగాలి



విజయక్రాంతి, రాజేంద్రనగర్: మహిళా సాధికారతతో పాటు సామాజిక, సేవా కార్యక్రమాల్లో మహిళలు కీలక పాత్ర వహించాల్సిన అవసరముందని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అదే విధంగా పొదుపు సంఘాల్లో లేని మహిళలల్ని సంఘాలుగా చేయటంతో పాటు వారికి రుణాలు ఇప్పించడం, తిరిగి సక్రమంగా చెల్లించేలా వారిని చైతన్య పరచాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్ మహానగరాన్ని మొదటి స్థానంలో ఉంచేందుకు పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారిణి రోజారాణి, యూసీడీ సీఓలు, టీఎల్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



శిల్పా రామంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకూ 'ఉమెన్ ఆఫ్ ఇండియా' ఆర్గానిక్ ఫెస్టివల్ జరగనుంది. సేంద్రియ రంగంలో ఉన్న మహిళా రైతులను ప్రోత్సహించేందుకు మహిళా శిశు సంక్షేమాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు.



వణికిస్తున్న మంకీ ఫీవర్

బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ తర్వాత ప్రస్తుతం మంకీ ఫీవర్ కర్ణాటక ప్రజలను వణికిస్తోంది. కోతుల నుంచి జంతువులకు, వాటి నుంచి మానవులకు వ్యాపించే వైరస్ వలన వచ్చే జ్వరం ప్రాణాంతకంగా మారుతోంది. కర్ణాటక రాష్ట్రంలో పలు జిల్లాల్లో మంకీ ఫీవర్ (కోతి జ్వరం) వ్యాపిస్తోంది. గతేడాది డిసెంబర్ నెలలో శివమొగ్గ జిల్లాలో ఈ మంకీ ఫీవర్ వెలుగులోకి వచ్చింది. తొలుత 1957లో ఒక కోతిలో ఈ వైరస్‌ను గుర్తించారు. శివమొగ్గ జిల్లా సొరబ తాలూకాలోని క్యాసనూరు గ్రామంలో తొలుత మంకీ ఫీవర్‌కు కారణమైన వైరస్‌ను గుర్తించారు. దీంతో ఆ వైరస్‌కు క్యాసనూర్ అని పేరు పెట్టారు. ఈ వైరస్ సోకిన కోతి నుంచి మానవులకు అంటుకుంటోంది. కోతుల్లోని ఈ వైరస్ గాలి ద్వారా పశువులకు, మనుషులకు సోకుతుంది. కానీ మనిషి నుంచి మనిషికి ఈ వైరస్ సోకదని నిపుణులు అంటున్నారు. వైరస్ సోకిన తర్వాత ఒక వారం వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. వారం తర్వాత విపరీతమైన జ్వరం, తలనొప్పి, నరాల బలహీనత, కండరాల తిమ్మిరి, వాంతులు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రతరమయ్యాక నోరు, చిగుళ్లు, ముక్కు నుంచి రక్తం కారుతుంది. బీపీ, ఎర్ర రక్తకణాలు బాగా తగ్గిపోతాయి. రోగ నిరోధక శక్తి క్షీణిస్తుంది. వ్యాధి ముదిరితే మతిస్థిమితం కోల్పోవచ్చు. ఈ వ్యాధి వస్తే మరణించే అవకాశాలు 3 నుంచి 5 శాతం ఉంటాయి. కర్ణాటకలోని చిక్కమగళూరు, శివమొగ్గ, ఉత్తర కన్నడ తదితర మల్నాడు జిల్లాల్లో విస్తరిస్తున్న ఈ వ్యాధి ఒక విదేశీ పర్యాటక మహిళకు సోకింది. ఇప్పటికే పదిమందిని బలి తీసుకున్న మంకీ ఫీవర్ ఉత్తర కన్నడ జిల్లా పర్యాటకానికి వచ్చిన నేపాల్ మహిళకు వ్యాపించింది. ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో కుమాటాలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ మంకీ ఫీవర్ లక్షణాలు కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం మణిపాల్‌లోని కేఎంసీ ఆస్పత్రికి తరలించారు .ఈపై జిల్లాల్లో ఇప్పటివరకు 150 మందికి పైగా వైరస్ సోకింది. మంకీ ఫీవర్ విస్తరించకుండా చిక్కమగళూరు జిల్లాలో పర్యాటకుల రాకపోకలను నిషేధించారు.

అధికారికి మద్దతుగానా..!

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా దీదీ ప్రవర్తన చాలా విచిత్రంగా ఉంది. బెంగాల్ భారతదేశంలో భాగం కాదన్నట్టు, అదేదో తన సొంత సొత్తు అయినట్టు ఆమె ప్రవర్తిస్తున్న తీరు ఏ రకంగా చూపినా సమర్థనీయం కాదు. 2009 తరువాత ఆమె తొలి సారి తన రాజకీయాలను ధర్నాల దారికి మళ్లించింది. గతంలో ఆమె ధర్నాలు కమ్యూనిస్టుల నియంతృత్వానికి వ్యతిరేకంగా, బెంగాల్ ప్రయోజనాలకు మద్దతుగా, పేదల పక్షాన జరిగాయి. ఈ సారి ధర్నా ప్రజా సమస్యపై చేయడం లేదు. నియంతృత్వానికి వ్యతిరేకంగా అంతకన్నా కాదు. ఆమె తన పార్టీతో సంబంధం లేని ఒక పోలీసు అధికారికి మద్దతుగా ఉద్యమబాట పట్టారు. సార్దా (శారదా అని పొరబాటున చాలా మంది రాస్తున్నారు. వాస్తవానికి ఇది సార్దా) కుంభకోణం, రోజ్ వ్యాలీ కుంభకోణాల్లో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కోల్‌కతా పోలీస్ కమీషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించేందుకు వెళ్లిన సీబీఐ సిబ్బందిని అరెస్టు చేయించడమే కాదు, మొగుడిని కొట్టి మొగసాలకెక్కినట్టు ధర్నాలో కూర్చున్నారు మమతా దీదీ. ఆమె సీబీఐని, కేంద్ర ప్రభుత్వాన్నే కాదు, సర్వోచ్చ న్యాయస్థానం నిర్ణయాన్నీ తూ నా బొడ్డు అనేశారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే ఇవే కుంభకోణాల్లో తన ఇద్దరు ఎంపీలు అరెస్టయినప్పుడు మమతా దీదీ రోడ్డెక్కలేదు. ధర్నాలు చేయలేదు. ఒక పోలీసు అదికారి అరెస్టు కాగానే ఆమె ధర్నా ఎందుకు చేస్తున్నట్టు? ఇంత ఉలికిపాటును ఆమె ఎందుకు ప్రదర్శిస్తున్నారు? గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు ఎందుకు తడుముకుంటున్నారు? ఏం దాచాలని, ఏది ఆపాలని ఆమె ఈ ప్రయత్నాలు చేస్తున్నట్టు? ఆమె గీసిన పెయింటింగ్‌లను అతి భారీ ధరకు కొనుగోలు చేసిన వారిలో సార్దా కుంభకోణం నిందితులు అధిక సంఖ్యలో ఉన్నందువల్లేనా? లేక ఇప్పటికే ఆమె పార్టీ కే చెందిన ఒక మంత్రి, ఇద్దరు ఎంపీలు అరెస్టయినందుకా? చివరికి ఈ కుంభకోణం తాలూకు పగ్గాలు ఆమె ఇంటి ముందుకు వచ్చి ఆగుతాయన్న భయమా?

అంతే కాదు. తన ధర్నాకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా హింసా దౌర్జన్యాల దుష్టకాండకు ఆమె ఎందుకు తెరతీస్తున్నట్టు? భవానీపూర్ సహా పలు చోట్ల బీజేపీ కార్యాలయాలపై దాడి ఎందుకు చేస్తున్నట్టు? దాదాపు పది లక్షల మంది పేద, మధ్యతరగతి మదుపరుల ప్రయోజనాలను పక్కన బెట్టి మరీ ఆమె కుంభకోణాల ఆరోపితులను ఎందుకు వెనకేసుకొస్తున్నట్టు?

మమతా దీదీకి దేశ వ్యాప్తంగా కొన్ని రాజకీయ శక్తులు వంత పాడుతున్న విధానం చూస్తే 'ఉష్ట్రానాం వివాహేషు గీతం గాయంతి గర్దభః' అన్న నానుడి గుర్తు కురాక మానదు. ఇదేదో రాష్ట్ర ప్రభుత్వంపై దాడిగా చూపించేందుకు ఈ వర్గాలు చేస్తున్న ప్రయత్నాలు విదూషకత్వానికి ఎక్కువ, విషాదనాయకత్వానికి తక్కువగా ఉన్నాయి. అవినీతి ఆరోపణ విషయంలో 'సబ్ బికే హువే హై జీష (అందరూ అమ్ముడు పోయారండీ) అని అందరినీ ఆక్షేపించే 'సుద్ద పూస' అరవింద కేజరీవాల్ కూడా కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి పక్షాన మాట్లాడటం చాలా విచిత్రంగా ఉంది. దీని కన్నా విడ్డూరం ఏమిటంటే సివిల్ సర్వీస్ నియమాలన్నిటినీ తుంగలో తొక్కి పోలీస్ కమీషనర్ రాజీవ్ కుమార్ కూడా ధర్నాలో కూర్చోవడం. ఉద్యోగ నియమాలను గడ్డిపోచగా పరిగణించి, రాజకీయ ఆందోళనలో పాల్గొన్న ఆ అధికారిని తక్షణం ఉద్యోగం నుంచి తొలగించాల్సిన అవసరం ఉంది. అవినీతి ఆరోపణలను అణచివేసేందుకు కేంద్ర రాష్ట్ర సంబంధాలను అడ్డం పెట్టుకోవడాన్ని తక్షణం మానివేయాలి. నిజానికి సార్దా, రోజ్ వ్యాలీ కుంభకోణాలలో నిజానిజాలు నిగ్గు తేలాలి. మమతా బెనర్జీ ఈ దర్యాప్తును సజావుగా కొనసాగించేందుకు సీబీఐకి అన్ని విధాలా సహకరించి తన నిజాయితీని,నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి. ఈ సందర్భంగా గుజరాత్ అల్లర్లు, ఇష్రత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసుల్లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ వ్యవహరించిన తీరును గుర్తుకు తెచ్చుకోవాలి. ఆయన ఏనాడూ కేంద్రం రాష్ట్రాన్ని అణచివేయచూస్తోందని ఆరోపించలేదు. సీబీఐకి సహకరించబోమని ప్రకటించలేదు. వాస్తవానికి ఆయన, ఆయన ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరించడమే కాదు, స్వయంగా నరేంద్ర మోదీ దాదాపు 12 గంటల పాటు ఏకబిగిన సీబీఐ విచారణలో పాల్గొన్నారు. ఆయన సీబీఐని, న్యాయస్థానాలను, వ్యవస్థలను ఏనాడూ ప్రశ్నించలేదు. ధర్నాలకు, ర్యాలీలకు పాల్పడలేదు. అన్ని రకాల దర్యాప్తులు, విచారణలు పూర్తయి, నిర్దోషిగా ఆయన బయటపడ్డారు. మమతా బెనర్జీ కూడా నాటకీయ రాజకీయాలను పక్కన బెట్టి ఇదే పంథాను అవలంబించి నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటే బాగుంటుంది.

అత్యవసర విభాగాలు అపరిశుభ్రం

మంతెన

రోగాన్ని నయం చేసుకోవాటానికి నిమ్స్ ఆస్పత్రికి వస్తే అపరిశుభ్ర వాతావరణం వలన ఇతర వ్యాధులకు గురవుతున్నామని రోగులు వాపోతున్నారు. సాధారణ వార్డులతో పోలిస్తే అత్యవసర విభాగం కొంత భిన్నమైనా అలాంటి అత్యవసర విభాగాల్లోనే విచ్చలవిడిగా ఎలుకలు తిరుగుతున్నాయి. ఆక్సిజన్ పైప్‌లైన్‌లపై స్వైరవిహారం చేస్తూ రోగులకు సంబంధించిన కీలక కేస్‌షీట్లు, మెడికల్ రిపోర్టులను కూడ నాశనం చేస్తున్నాయి. రోగుల మధ్యే ఎలుకలు, బొద్దింకలు, ఇతర కీటకాలు తిరుగుతున్నా నిర్మూలించాల్సిన పారిశుద్ధ్య విభాగం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. నిమ్స్ అత్యవసర విభాగంలో నిత్యం దాదాపు వంద మందికిపైగా చికిత్స పొందుతుంటారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యం, పెస్ట్ కంట్రోల్ పనుల కోసం నెలకు దాదాపు రూ.రెండు కోట్ల వరకు ఖర్చు చేస్తున్నా పరిశుభ్రంగా ఉండటం లేదు. ఎలుకలు, పరుపుల కింద నల్లులు, గోడలపై బల్లులు, బొద్దింకలు, ఇతర కీటకాలు యథేచ్ఛగా సంచరిస్తూనే ఉన్నాయి.వాటి ద్వారా బ్యాక్టీరియా, వైరస్‌లు వ్యాపించి ఇతర రుగ్మతలకు కారణమవుతున్నాయి. ఫలితంగా వారం రోజుల్లో కోలుకోవాల్సిన రోగులు ఎక్కువ రోజులు ఆస్పత్రిలోనే మగ్గాల్సి వస్తోంది. అంతేగాక ఆ ఇన్ఫెక్షన్ల బారి నుంచి బయటపడేందుకు ఖరీదైన మందులను వాడాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు, ప్రభుత్వం ఆస్పత్రి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

–వసంతకుమార్, హైదరాబాద్


జోరుగా ఆహార పదార్థాల కల్తీ

అంతా కల్తీమయం. పాలు, పండ్లు నూనె, తేనె, ఉప్పు, పప్పు, కారం, పసుపు, టీ పొడి, ఆఖరికి తాగే మంచి నీరు. కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లు మారింది పరిస్థితి. కల్తీ పదార్థాలు అని తెలిసినా కట్టడి చేయలేని పరిస్థితి అధికారుల దుస్థితికి నిదర్శనం. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మిల్క్‌పార్లర్‌లు పుట్టుకు వస్తున్నాయి. రకరకాల ప్యాకేజ్‌లతో చిక్కదనం, రుచికి మారుపేరు తమ పాల ఉత్పత్తులు అని గోడలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. పాలలో నీళ్ళతో పాటు చిక్కదనం కోసం పిండి పదార్థాలను కలుపు తున్నారని వార్తలు వస్తున్నాయి. టీ పొడితో రంపపు పొట్టును వాడుతున్నారని, పిల్లలు ఇష్టంగా తినే ఐస్‌క్రీములలో ప్రమాదకరమైన రంగులు వాడుతున్నారు. ఇక బేకరీ, ఫాస్టుఫుడ్ సెంటర్ల పరిస్థితి మరింత అధ్వాన్నం. మార్కెట్‌లో దొరికే ప్రతీ వస్తువు రెండవ, మూడవ రకం అమ్మడం పరిపాటిగా మారింది. ఆఫర్ల పేరుతో నకిలీ వస్తువులను అంటగడుతున్నారు. వివిధ హోటళ్ళ ముందు తినుబండారాలను బయట పెట్టడం, వాటిమీద దుమ్ము, ధూళి పడటం, కల్తీ నూనెలతో పదార్థాలు చేయడం సర్వసాధారణమైపోయింది. చాలా దుకాణాలలో గడువు ముగిసిన ప్యాకేజ్డ్ ఫుడ్ పదార్థాలు అమ్ముతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల కొరత, అధికారుల దాడులు లేక వ్యాపారాలు సామాన్యజనానికి కల్తీ వస్తువులు, పదార్థాలు అంటగడుతున్నారు. కల్తీ నిరోధానికి అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

–కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, జయశంకర్ భూపాల్ జిల్లా

బాలబాలికల నిష్పత్తిలో పెరుగుతున్న అంతరం

జనాభాలో ప్రతి వెయ్యి మంది పురుషులకు ఎంత మంది స్త్రీలు ఉన్నారో తెలిపేదే లింగ నిష్పత్తి. సమాజంలో, ఒక నిర్దిష్ట కాలంలో సమానత్వం ఎంత ఉందో తెలుసుకోవడానికి ముఖ్యమైన సామాజిక సూచికగా లింగ నిష్పత్తి ఉపయోగపడుతుంది. భారత దేశంలో పురుషుల కంటే ఎప్పుడూ స్త్రీల సంఖ్య తక్కువగానే ఉంది. ఇటీవల విడుదల చేసిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో బాలబాలికల నిష్పత్తిలో అంతులేని అంతరం ఉన్నట్లు తెలుస్తోంది. 2007 నుంచి 2016కి ఆంధ్రప్రదేశ్ బాలబాలికల నిష్పత్తి దేశంలోకెల్లా అత్యంత దారుణంగా పడిపోవడం సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో బాలబాలికల నిష్పత్తి 2007 నుంచి 2016కి 168 పాయింట్లు పడిపోయి ప్రతి వెయ్యి మంది మగ పిల్లలకు కేవలం 806 మంది మాత్రమే ఆడపిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది.



2007లో 974 మంది ఆడపిల్లలంటే ఆ సంఖ్య తీవ్రంగా పడిపోవడం ఆందోళన కలిగించే విషయం. తెలంగాణ ఆవిర్భావం తర్వాత బాలబాలికల నిష్పత్తి ప్రతి వెయ్యి మంది బాలురకు 954 మంది బాలికలు ఉంటే, 2016 నాటికి 73 పాయింట్లు పడిపోయి బాలికల సంఖ్య మరింత క్షీణించి 881 చేరింది. ఈ స్త్రీ పురుష నిష్పత్తి లేదా లింగ నిష్పత్తి నేడు ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే ఈ నిష్పత్తిని బట్టి స్త్రీల పట్ల వివక్షత ఎంత తీవ్రంగా ఉందో వెల్లడవుతోంది. బాలికలకు విద్య, అభివృద్ధిలో సమాన అవకాశాలు లభించడం లేదు. అత్యంత మౌలికమైన పోషకాహారం, శిశు సంరక్షణ, వైద్యం వంటి వాటిల్లో కూడా స్త్రీలు వివక్షకు గురవుతున్నారు. అంటే మగ పిల్లలకు ఇవి అందినంతగా ఆడపిల్లల అందడం లేదు. వివక్షత ఉందని తెలిసినా ఎవరు ఒప్పుకోరు. మొత్తం జనాభాలో ఈ వివక్షత జరుగుతోందని కొన్ని సూచికల ద్వారా అర్థం అవుతుంది. ఒకే పరిస్థితులు ఉంటే మగపిల్లల కన్నా ఆడపిల్లలు ఎక్కువగా మనగలుగుతారుని వైద్య పరిశోధనలు చెబుతున్నాయి.

అంటే వివక్షత లేకపోతే మగపిల్లల కంటే ఆడపిల్ల సంఖ్య ఎక్కువ గాని లేదా సమానంగా గాని ఉండాలి. కానీ దీనికి విరుద్ధంగా సర్వేల, సైన్సెస్‌ల నివేదికలు ఉంటున్నాయి. వీటి ద్వారా ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆడపిల్లలు బతకడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నప్పటికీ వారి జనాభా శాతం తగ్గుతోందంటే వారి పోషణ, సంరక్షణలో వివక్షత ఉన్నట్లు తెల్లతేటం అవుతుంది. మహిళలకు సమానత్వం, సమాన అవకాశాలు కల్పించిన సమాజాలను లేదా ప్రాంతాలను గమనించినట్లయితే లింగ నిష్పత్తి వేరేగా ఉంటుంది. అంటే అభివృద్ధి చెందిన దేశాల్లో స్త్రీల జనాభా పురుషుల కన్నా అధికంగా ఉంటుంది. స్త్రీ పురుషుల మధ్య అసమానతలు ఉండి పురుషులకు అనుకూలంగా స్త్రీల పట్ల వివక్షతతో వ్యవహరించే ప్రాంతాలలో లింగ నిష్పత్తి అసమానంగా ఉంటుంది. ఆయా ప్రాంతాలలో అధిక ఆదాయ మార్గాలు ఉన్నప్పటికీ ఇలానే జరుగుతున్నది. ఆడపిల్ల కంటే మగ పిల్లవాడు పుట్టాలని కోరుకునే లింగ వివక్షత గల భారతదేశంలో ఇది రోజురోజుకూ పెరుగుతూనే ఉంది కాని తగ్గేలా లేదు. మగ పిల్లలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఆడపిల్లల మరణాల శాతం అధికంగా ఉంటోంది, మగ పిల్లలకిచ్చే సంరక్షణ, శ్రద్ధలతో పోలిస్తే ఆడపిల్లల ఆరోగ్యం గురించి, జబ్బుల గురించి పట్టించుకోకపోవడం వల్ల ఇలా జరుగుతోంది. మగ పిల్లవాడిని కావాలనుకోవడం వల్ల గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలుసుకొని భ్రూణ హత్యలకు కూడ పాల్పడుతున్నారు. మనదేశంలో ఆడపిల్లల పట్ల వివక్షత కొనసాగినంతకాలం ఈ లింగ నిష్పత్తిలో గల తేడాలను సరి చేయలేము.

లింగ నిష్పత్తిలో గల తేడాలు రూపుమాపాలంటే స్త్రీల పట్ల వివక్షత తగ్గాలి. ఆడైనా మగైనా ఒక్కటిగా చూడగలగాలి, వారిని ఆరోగ్యంగా పెంచడం, మంచి విద్యను అందించడం జరిగినప్పుడే దేశానికి, కుటుంబానికి మేలు జరుగుతుంది. ప్రధానంగా బాలికావిద్యపై శ్రద్ధ పెట్టి ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. మహిళల పట్ల వివక్షత తగ్గించడానికి మహిళల చదువు మాత్రమే బలమైన శక్తిగా ఉపయోగపడుతుంది. ఆడపిల్లల పట్ల వివక్షతను రూపుమాపడానికి తగిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్గాలను అన్వేషించాలి. ఏ రూపంలో అయినా వరకట్నం తీసుకోవడాన్ని నిషేధించాలి. లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ అబార్షన్లు వాటికి సంబంధించిన నిబంధనలను కఠినతరం చేయాలి, కఠినంగా అమలు చేయాలి. ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు వేయాలి. అన్ని రంగాలలో అమ్మాయిలకి అబ్బాయిలతో సమానంగా హక్కులు, అవకాశాలు కల్పించాలి.

– వాసిలి సురేష్
9494615360

'సిక్స్ పాయింట్ ఫార్ములా' తెలంగాణ ప్రయోజనానికి గొడ్డలిపెట్టు

(నిన్నటి తరువాయి)

అయినా అటు ఆంధ్రలోనూ ఇటు తెలంగాణాలోనూ రాష్ట్ర విభజన కొరకు ఆందోళన ప్రారంభించి, ప్రత్యేక రాష్ట్ర స్థాపనకై తుదివరకు పోరాడి తీరుతామని భీషణ ప్రతిజ్ఞలు చేసిన కాంగ్రెస్ నాయకాగ్రేసరులందరూ కాంగ్రెస్‌లోనూ, ప్రభుత్వంలోనూ తమ తమ పదవుల్ని నిలబెట్టుకోవడానికి ఇందిరమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేసి కిక్కురుమనకుండా ఆరు సూత్రాల ప్రణాళికను ఆమోదించటమే కాక అదొక్కటే దేశానికి శరణ్యమంటూ చచ్చుకూతలు కూయడంలో ఒకరిని మించి మరొకరు పోటీపడుతున్నారు. వందలాది వీర యువకులు తమ రక్తాన్ని అర్పించడం ద్వారా కొనసాగించిన మహోద్యమం యొక్క ఫలితాన్ని తమ స్వప్రయోజనాల కొరకు అప్పనంగా ఉపయోగించుకోవడానికి సిద్ధమై సిగ్గులేకుండా ఈ కాంగ్రెస్ నాయకులందరూ ఆంధ్రప్రజల పట్ల తీరని విద్రోహానికి తలపడ్డారు.

మంత్రి పదవులలో చేరడానికి ఆంధ్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు, 'ప్రత్యేక ఆంధ్ర ఉద్యమానికి ఏదో ఒక పరిష్కారం' కొరకు వెలిబుచ్చిన తపనపట్ల, చిత్తశుద్ధితో ఉద్యమంలో పాల్గొన్న సగటు మనిషి అభిప్రాయం దిగువన ఉదహరించడం జరిగింది. 'ప్రజల కోర్కెలను ప్రతిబించడానికీ, వాటి సాధనకు ముందు నిలబడి పోరాడటానికీ అందరితో పాటు కాంగ్రెసు నాయకులకు కూడా అధికారం ఉంది. అయితే ప్రభుత్వ యంత్రాంగంలో పదవుల్నీ, కాంగ్రెసు సంస్థల్లో హోదాల్నీ, సమాజంలో తమ స్థానాన్నీ నిలబెట్టుకోవడానికి నాల్గుకోట్ల ఆంధ్ర ప్రజల ఏకైక వాంఛను బలివ్వడానికి మాత్రం కాంగ్రెసు నాయలకులకెలాంటి అధికారమూ లేదు. ఆంధ్రప్రదేశమంతటా పోలీసు క్యాంపుగా మార్చి వందలాది ఆంధ్రవీరుల రక్తాన్ని బలిగొన్న కాంగ్రెసు ప్రభుత్వ రాక్షసకృత్యాల్ని ప్రతిఘటించడంలో, ఆ ఉద్యమాని కంతటికీ ప్రాణంగా నిలబడ్డ ఆంధ్ర విద్యార్థులకూ, యువకులకూ, తదితర మధ్యతరగతి ఉద్యోగులకూ, మేధావులకూ ద్రోహంచేసే హక్కుకాంగ్రెస్ నాయకులకు లేదు' 'వేలాదిమంది ప్రభుత్వోద్యోగులు కడుపు గట్టుకొని, కుటుంబాలు ఆకలి మంటలతో మాడి చస్తున్నా లెక్కచేయక నెలల తరబడి అపూర్వమైన పోరాటాన్ని కొనసాగించారు. కేవలం మంత్రివర్గంలో విభిన్న గ్రూపుల వాటాలు ఎవరికివారు తమకనుకూలంగా పదిలపర్చుకోవడానికి ఎంతమాత్రమూ కాదు. వేలాదిమంది విద్యార్థులు తమ భవిష్యత్తునూ, చదువు సంధ్యల్నీ ఖాతరు చేయకుండా కాంగ్రెసు ప్రభుత్వపు పోలీసు మూకలతో ప్రాణాలొడ్డి పోరాడింది, ఉద్యమం జరిపింది కూడా కాంగ్రెసు నాయకులలో ఎవరు గద్దె దిగి ఎవరు గద్దెనెక్కాలనే విషయాన్ని తేల్చుకోవటానికి ఎంతమాత్రమూ కాదు'.

హామీలు: కన్నీటి తుడుపుగా, తెలంగాణ ప్రాంతానికి మేలు చేసే కొన్ని చర్యల గైకొనేందుకు ఆంధ్రప్రాంత నాయకులు, కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్టు కనిపించే విధంగా షట్సూత్ర కార్యక్రమం రూపొందినా, ముల్కీ నియమాలు అమలు, ప్రాంతీయసంఘం కొనసాగుదల రద్దయిపోయాయి. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమ నాయకులు అక్టోబర్ మొదటి తేదీన, రక్షణల రద్దు, పి.వి. ఉద్వాసన సాధించి విజయం పొంది ఉద్యమాన్ని పరి సమాప్తం చేశారు. అయితే, ఆంధ్ర ఉద్యమ నాయకులు తాము కోరుకున్నదానికంటే ఎక్కువ డిమాండ్ చేసి, కావలసినది సాధించుకున్నారు. అయితే శాసనసభా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నుండి పి.వి. ని తొలగించి, సాధారణ పరిస్థితి నెలకొల్పి, 'అధికులకు ఆమోద యోగ్యుడైన' నాయకుడిని ముఖ్యమంత్రి పదవి కొరకు ఎంపిక చేయటానికి కాంగ్రెస్ అధిష్ఠాన వర్గానికి కొంత సమయం పట్టింది.

1973 డిసెంబర్ 10వ తేదీన శ్రీ జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేశారు. వల్లూరి బసవరాజువలెనే శ్రీ వెంగళరావు కూడ ఆంధ్ర ప్రాంతంలో పుట్టి పెరిగి తెలంగాణలో స్థిరపడి రాజకీయాలలో చేరినందున, ఆయనకు ఫలానా ప్రాంతంవారు అనే ముద్రలేకుండా పోయింది. అంతేకాక, ఆంధ్ర తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలలో ప్రధాన భూమికను నిర్వహించిన పారిశ్రామికులు, సంపన్నులు ముఖ్యంగా కమ్మ కులానికి చెందిన వారు నాయకుడిగా ఆయన ఎంపికకు అహోరాత్రులు కష్టించి, అవసరమైన పెట్టుబడి పెట్టి ఆయన కొమ్ము కాచారు. అలసి సొలసి అనేక కష్టనష్టాలు చవిచూసిన ఉద్యోగులు, విద్యార్థులు ఇతర వర్గాల వారు నోరు మెదిపే స్థితిలో లేరు. కేంద్రం నుండి గణనీయమైన మొత్తంలో నిధులు లభించడం వలన, అంతకు ముందు, పన్ను బకాయిలు వసూలు కావడం వలన, రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తలేదు. సమర్థులు, నిజాయితీపరులు అని పేరు తెచ్చుకున్న అధికారులనే శ్రీ జె. వెంగళరావు కీలక పదవులలోను తనకు సహాయకులుగా ఉండవలసిన సున్నిత పదవులలోను నియమించుకున్నారు.

అంతకుముందు ముఖ్యమంత్రివలె నిర్ణయాలు నానపెట్టకుండా, శరవేగంతో నిర్ణయాలు గైకొని, క్షణాలలో ఫైళ్ళు తిరిగి పంపుతూ, ఎవరితోనైనా క్లుప్తంగానే మాట్లాడుతూ వెంగళరావు పాలనాధ్యక్షుడు అనిపించుకున్నారు. పెద్ద కుమారుడికి తప్ప మరెవరికీ పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకునే అవకాశం ఆయన ఇవ్వలేదు. ఏ పార్టీ, వర్గానికి చెందిన వారైనా తన కులస్తులు వెలమ వారికి సహాయం చేస్తూ బ్రాహ్మణ, కాపుకులస్తులను కూడా మచ్చిక చేసుకొనడం వల్ల దాదాపు అగ్రకులాలు అన్నింటితో ఆయన సత్సంబంధాలు పెంచుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాలవైపు ప్రజల దృష్టి మళ్ళించడంలో కృతకృత్యుడైన వెంగళరావు 1975 ఏప్రిల్‌లో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా నిర్వహించి కళాకారులు, సాహితీవేత్తలు, తదితరులను ఆ కార్యక్రమాలలో తలమునకుల చేసారు. ఈ సభలతో ఆంధ్ర, తెలంగాణ ప్రస్తావన చాల వరకు మరుగున పడింది.

కాంగ్రెస్ పార్టీలో అసమ్మతీయులు కూడపలుకుకొని ఏడాది తరువాత శ్రీ వెంగళరావు నాయకత్వాన్ని సవాలు చేసే ప్రయత్నం మొదలు పెట్టే సమయానికి జూన్ 1975లో దేశంలో ఆంతరంగిక అత్యవసర పరిస్థితి ప్రకటితమైనది. 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెంగళరావు నేతృత్వంలో పోటీ చేసి ఒక స్థానం మినహా అన్ని స్థానాలు గెలుచుకున్నది. ప్రతిపక్షాలకు చెందిన నీలం సంజీవ రెడ్డి మాత్రం నంద్యాల స్థానం కైవసం చేసుకున్నారు. కేంద్రంలో జనతా ప్రభుత్వం ఏర్పడింది.

ఎన్నికలలో పరాజయం పొందిన శ్రీమతి గాంధీ తన పార్టీలో నాటి రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అప్పటివరకూ ఉత్తరధృవం, దక్షిణ ధృవంగా ఉంటున్న వెంగళరావు, కొత్త రఘురామయ్య, బ్రహ్మానందరెడ్డి వర్గాల మధ్య సయోధ్య కుదిర్చింది. ఈ సయోధ్యను సమర్థించుకుంటూ దానికి గల కారణాలు శ్రీ వెంగళరావు తన అనుయాయులకు వివరించడంలో నిమగ్నమై ఉన్న తరుణంలో, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ మళ్ళీ చీలిపోయింది. నాటి పరిణామాలు బ్రహ్మానందరెడ్డిని శ్రీమతి గాంధీకి బద్ధ శత్రువును చేసాయి. ఈ దశలో వెంగళరావు, బ్రహ్మానందరెడ్డి పార్టీ కొమ్ముకాచి, ఇందిరాగాంధీకి శత్రువు అయినారు.

ప్రభుత్వాధినేత తెలంగాణ నాయకుడైనా తెలంగాణకు లాభం జరుగలేదు

1978 జనవరిలో శ్రీమతి గాంధీ, డా॥చెన్నారెడ్డిని తన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా నియమించింది. అంతకు ముందే చెన్నారెడ్డి, ఉత్తర ప్రదేశ్ గవర్నర్ పదవికి రాజీనామా చేసి రాష్ట్రానికి తిరిగి వచ్చారు. ఇందిరా కాంగ్రెస్ అధ్యక్షపదవికి ఆశించిన జి. రాజారామ్ వెనుకబడిన ఇతర వర్గాల నాయకులు జగన్నాథరావు, మదన్‌మోహన్, శివశంకర్, కేశవరావు మొదలైన వారు డా॥చెన్నారెడ్డి నాయకత్వాన్ని ఆమోదించారు. తరువాత కొన్ని వారాలకే జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో శ్రీ బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్ వెంగళరావు నేతృత్వంలో, శ్రీమతి ఇందిరా కాంగ్రెస్ చెన్నారెడ్డి నేతృత్వంలో, బరిలోకి దిగాయి. దళితవర్గాల సహాయంతో శ్రీమతి గాంధీ కాంగ్రెస్ విజయం సాధించింది.

డాక్టర్ చెన్నారెడ్డి పలువురు యువకులతో సహ అనేక మంది కొత్త వారికి ప్రథమ పర్యాయం శాసనసభకు పోటీ చేసే అవకాశం కల్పించారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజక వర్గం నుంచి ప్రప్రథమ పర్యాయం పోటీ చేసి గెలిచిన నారా చంద్రబాబుగారు కూడా వీరిలో ఉన్నారు. చిత్తూరు నుండి పార్టీ టికెట్ కోరిన అభ్యర్థులు అధిక సంఖ్యాకులు రెడ్డి కలుస్థులే అయినందున, కమ్మ కులస్తుల కోసం డా॥చెన్నారెడ్డి చేసిన ప్రయత్నంలో భాగంగా యువ కాంగ్రెస్ నేత చంద్రబాబు పేరు పరిశీలనకు వచ్చి యుండెను. చంద్రబాబుకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులను డా॥చెన్నారెడ్డి దురుద్దేశ్యంతో కూడినవిగా త్రోసిపుచ్చి ఆయనకు ధన సహాయం చేసి పార్టీ టికెట్ ఇవ్వడం జరిగింది.

1973–78 మధ్యకాలంలో తెలంగాణ అన్యాయాల గురించి ప్రముఖులు ఎవరూ అంతగా మాట్లాడలేదు. దీని తాత్పర్యం 1974 తరువాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం గురించి ఎవరూ మాట్లాడలేదని కాదు ఆ లక్ష్య సాధన మార్గంలో ఎవరూ ఏమీ చేయలేదనీ కాదు. ఆది నుండి రాష్ట్ర విభజన కోరుతున్న కొందరు ప్రత్యేక రాష్ట్రం కొరకు నినదించడం కొనసాగించగా, మరికొందరు నాయకులు ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలు వేలెత్తి చూపారు. 1978లో చెన్నారెడ్డి గారు ప్రభుత్వాన్ని స్థాపించిన అనంతరం, తెలంగాణ నాయకుడు ముఖ్యమంత్రి అవడం కొందరు ఆంధ్ర నాయకులకు మింగుడు పడని వ్యవహారం అయిపోయింది. ప్రభుత్వ అధికారం లేకుండా కేవలం పార్టీ అధ్యక్షురాలుగా కొనసాగిన శ్రీమతి గాంధీ చెన్నారెడ్డిపై ఆయన ప్రత్యర్థులు చేసే ఆరోపణలు ఒకవైపు వింటూనే మరొకవైపు ముఖ్యమంత్రి నుండి అన్ని రకాల సహాయం పొందారు.

డా॥చెన్నారెడ్డి తప్ప ఆనాడు ఆర్థికంగా సహాయం చేసేవారు ఎవరూ లేకపోయారు. ఈ సహాయంతో సంతృప్తి చెందని సంజయ్‌గాంధీ, నాదెండ్ల భాస్కర రావు వంటి కొందరు ఆంధ్రమంత్రులతో చెలిమి (సంధానకర్తలలో ఈ రచయిత ముఖ్యులు) చేసి వారి నుండి ధన సహాయం పొందారు. ఆ పరిస్థితులలో చెన్నారెడ్డి రాజకీయ ప్రత్యర్థులు మరి కొందరు సంజయగాంధితో స్నేహ సంబంధాలు ఏర్పరుచుకోవటం, ఆయనకు రెడ్డిగారికి మధ్య స్పర్థలు తల ఎత్తేందుకు, చరిత్ర కొత్త మలుపు తిరగటానికి కారణాలు అయాయి. 1950 దశకం ఆరంభంలోనే హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవీ బాధ్యతలు నిర్వహించి, జవహర్‌లాల్, గోవింద వల్లభపంత్ కనుసన్నలలో రాజకీయం చేసిన చెన్నారెడ్డి సీనియర్ నాయకుడు. అందువలన ఆయన శ్రీమతి గాంధీని సూపర్ లీడర్‌గా పరిగణించలేదు. ఆమె కూడా రెడ్డి గారి సీనియారిటి గుర్తించి తగిన గౌరవం ఇచ్చారు. సంజయ్‌గాంధీ విషయం వేరు. దేశంలో నాయకులంతా తనకు బ్రహరధం పడుతుంటే, రెడ్డిగారు అలా చేయకపోవటం సంజయగాంధీకి నచ్చలేదు. కానీ, ఆనాడు తాను చెన్నారెడ్డిని తలక్రిందులు చేయగల స్థితిలో లేడు.1980లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో మెదక్ నియోజకవర్గం నుండి పోటీ చేయవలసినదిగా శ్రీమతి గాంధీని ఒప్పించి, గెలిపించారు రెడ్డిగారు. ఆమె, పార్టీకి మెజారిటీ లభించడంతో కేంద్రంలో ప్రభుత్వం స్థాపించారు. (సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

అడవిలో వికసించిన 'పద్మం'


కేంద్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం రోజున ప్రకటించిన 2019 సంవత్సరపు పద్మశ్రీ పురస్కారాలలో అడవుల పరిరక్షణ కోసం కృషి చేసిన ఆదివాసీ పర్యావరణ ఉద్యమకారిణి జమున తుడు 'పద్మశ్రీ' వరించడం అంటే అడవిలో ఒక పద్మం వికసించిందని చెప్పవచ్చు. ఈ సంవత్సరం పద్మశ్రీ పురస్కారాలు పొందిన 13 మంది మహిళలలో ఆదివాసీకి చెందిన జమున తుడు ఒకరు. జన్మాంతం ప్రకృతిని ప్రేమించే ఆమెకు అడవంటే ఆరోప్రాణం. 'జార్ఖండ్ లేడి టార్జాన్'గా పేరొందిన జమున తుడు అడవులను అక్రమంగా నరికి రవాణా చేసే ముఠాలు, దుండగులపై దాడిచేసి, అడవులను నరకకుండా అడ్డుపడి పర్యావరణాన్ని పరిరక్షించే ఆమె సాహసం గొప్పది. ఆమె ఒంటరిగా పోరాడకుండా రక్షణ దళాలను ఏర్పాటు చేసి సామూహిక ఉద్యమాన్ని నడిపించారు. కలప మాఫియాలను అడ్డుకున్నందుకుగాను దేశంలోనే నాలుగవ అత్యున్నత పౌరసన్మాన అవార్డును అందుకున్నారు.

జమున తుడు పుట్టింది ఒడిషాలోనైనా పెళ్ళైన తర్వాత జార్ఖండు రాష్ట్రంలోని ఈస్ట్ సింగ్భమ్ జిల్లా ముతుర్ ఖామ్ గ్రామంలో స్థిరపడింది. అడవులను రక్షించడం పర్యావరణంలో ఒక భాగమని గ్రహించిన ఆమె సుమారు 300 దాకా మహిళా గ్రూపులను తయారుచేసి అడవులను సంరక్షిస్తున్నారు. ఒక్కో గ్రూపులో 30 మంది చొప్పున మహిళలుంటారు. ఆ గ్రూపులన్నీ మూడు విభాగాలుగా ఏర్పడి బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళలలో వారు బాణాలు, కర్రలు పట్టుకొని అడవిని కాపాలా కాస్తున్నారు. ఆ మహిళల ధైర్యసాహసాలను గుర్తించిన కలప మాఫియా దొంగలు తోక ముడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జమున తుడు పుట్టింది గిరిజన ఏజెన్సీ గ్రామమైనా అడవుల వలన కలిగే లాభాలేమిటో తెలుసుకున్నారు. ముతుర్‌ఖామ్ గ్రామ పరిసర అడవుల్లో కలపను అక్రమంగా తరలించే దారుణాలను కళ్ళారా చూసిన ఆమె అడవులు అంతరించి పోకుండా చూడాల్సిన బాధ్యతను తను భుజాలపై వేసుకున్నారు. ఆడపిల్ల పుడితే పద్దెనిమిది చెట్లు, పెళ్ళయిన నాటికి పది చెట్లను నాటాలనే పద్ధతిని అమలులోకి తీసుకువచ్చారు. ఇలా పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని మొదలుపెట్టి రెండు దశాబ్దాలవుతోంది.

దీని కోసమే ఆమె 'వన సురక్షాసమితి'ని 1998లో ఐదుగురు మహిళలతో ప్రారంభించారు. ఆమె చేపట్టిన ఈ పనికి ఎన్నో బెదిరింపులు వచ్చాయి. అయినా వాటికి భయపడలేదు. కలప మాఫియా దుండగులు ఆమె ఇంటిని దోచుకున్నారు.

ఒకసారి జరిగిన దాడిలో ఆమె ప్రాణాలు కూడా కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా చెట్ల రక్షణ కోసం పని చేస్తానని మనోధైర్యంతో ముందుకెళుతున్న జమున తుడు అభినందనీయురాలు.


జమున తుడు

– గుమ్మడి లక్ష్మీనారాయణ
ఆదివాసీ రచయితల సంఘం
7989134271

ఫెడరల్ స్ఫూర్తికి ఇది విరుద్ధం

- పశ్చిమ బెంగాల్‌లో కేంద్రం చర్య దుర్మార్గం
- రాష్ట్రాల హక్కులు కాలరాస్తున్న ప్రధాని
- ఐక్యంగా పోరాడతాం : ఏపీ సీఎం చంద్రబాబు

విజయక్రాంతి, అమరావతి : పశ్చిమ బెంగాల్‌లో కేంద్రం చర్య దుర్మార్గమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. రాష్ట్రాల్ని తమ నియంత్రణలో ఉంచుకోవాలనే కేంద్రం తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. ఫెడరల్ స్ఫూర్తికి ఇది విరుద్ధమని, దీనిపై అంతా ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు. పార్టీ నేతలతో చంద్రబాబు ఈ ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

సహకార సమాఖ్య వ్యవస్థ అన్న మోదీ ఇప్పుడు రాష్ట్రాల హక్కులు కాలరాస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి లొంగిపోయిన వారిపై కేసులు ఎత్తివేస్తున్నారు, బీజేపీని ఎదిరిస్తే పాతకేసులు బయటకు తీస్తున్నారన్నారు. మొన్న అఖిలేశ్, మాయావతిని లక్ష్యంగా చేసుకున్నారని, ఇప్పుడు మమతా బెనర్జీపై కక్ష సాధింపునకు దిగారని చంద్రబాబు నిప్పులు చెరిగారు. ప్రతిపక్ష నేతలందరిపై కేసులు పెట్టి బీజేపీ ఆనందపడుతోందని విమర్శించారు. దేశస్థాయిలో ఉద్యమానికి యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని, అన్నిపార్టీలను సమన్వయం చేస్తూ జాతీయపార్టీల నేతలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ రోజు ఢిల్లీ పర్యటనలో కూడా దీనిపైనే చర్చిస్తామని ముఖ్యమంత్రి నేతలకు వివరించారు. తిత్లీ తుపాను బీభత్సం సృష్టిస్తే బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా రాలేదు కానీ, 4 నెలల తర్వాత ఇప్పుడు వచ్చి ఏం చేస్తారని ప్రశ్నించారు. అమిత్ షా పలాస పర్యటన రాజకీయస్వార్థం కోసమేనని, ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారంటూ ప్రశ్నించారు. ప్రజల నిరసనల తీవ్రతను మోదీ, షా లు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.



సైకో పార్టీగా మారిన వైఎస్సార్‌సీపీ

బీజేపీయేతర పక్షాలు ఈవీఎంలపై ఇవాళ ఈసీకి ఫిర్యాదు చేయాలని ముందుగా నిర్ణయించాయని, ఇది తెలిసి వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ హడావుడిగాఢిల్లీ వెళ్ళారని చంద్రబాబు నాయుడు విమర్శించారు. మోదీ కనుసన్నల్లో జగన్ ఈసీని కలిసి ఏదో ఫిర్యాదు అని నాటకమాడుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ సైకో పార్టీగా మారిందని మండిపడ్డారు. వచ్చే పరిశ్రమలను అడ్డుకుంటూ, పెట్టుబడులు రాకుండా కుట్రలు చేస్తున్నారని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కష్టాల్లో ఉండాలన్నదే సైకో వైఎస్సార్‌సీపీ ధోరణి అని విమర్శించారు. పించన్ల సభలు, పసుపుకుంకుమ కార్యక్రమాలను భగ్నం చేయడం జగన్ శాడిజానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

ఏపీలో 59.18 లక్షల నకిలీ ఓట్లు

- అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం
- కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి సునీల్ అరోరాకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫిర్యాదు



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో లక్షల్లో నకిలీ ఓట్లను సృష్టించారని, ప్రస్తుతం 59.18 లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయని ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మరోవైపు రకరకాల సర్వేల పేరుతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారని, ఎన్నికలు సజావుగా జరగాలంటే డీజీపీ ఠాకుర్, ఇంటెలిజెన్స్ ఐజీ వెంకటేశ్వర రావు, డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్‌రావులను వెంటనే బదిలీ చేయాలని ఆయన కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. సోమవారం వైఎస్ జగన్ బృందం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) సునీల్ అరోరాను కలిసి అధికార తెలుగుదేశం పార్టీ ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతుండడం, అధికార యంత్రాంగాన్ని, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న తీరుపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసింది.

అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఎంత దారుణంగా ధిక్కరిస్తోందో ఈసీ దృష్టికి తీసుకెళ్లాం. ఎన్నికల ప్రక్రియను ఓ ప్రహసనంగా మార్చారు. ఓటర్ల లిస్టును ఎలా తారుమారు చేస్తున్నారో ఈసీకి వివరించాం. సెప్టెంబర్ 2018 నాటికి 52 లక్షల 67వేల నకిలీ ఓట్లు చేర్చారు. ప్రస్తుతం నకిలీ ఓట్ల సంఖ్య 59.18 లక్షలకు చేరింది. మొత్తం 3 కోట్ల 69 లక్షల ఓట్లలో 59 లక్షల మంది నకిలీ ఓటర్లున్నారు. దాదాపు 60 లక్షల ఓట్లలో 20 లక్షల ఓట్లు ఏపీ, తెలంగాణలో డబుల్‌గా నమోదయ్యాయి. ప్రజా సాధికార సర్వే, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) డేటాబేస్, పరిష్కార వేదిక, పిరియాడిక్ సర్వేల పేరుతో వివరాలు తెలుసుకుని ఓట్లను తొలగిస్తున్నారు. ఇప్పటికే 4 లక్షల వైఎస్సార్సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించారు. ఈ తొలిగింపు ప్రక్రియకు ఒక యాప్‌ను కూడా క్రియేట్ చేశారు. ఆధార్ కార్డ్, ఓటర్ కార్డులను లింక్ చేస్తూ ఓట్లను తొలగిస్తున్నారు. ఈ విషయాలన్నిటినీ ఆధారాలతో సహా ఈసీ దృష్టికి తీసుకెళ్లాం. నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ తన అధికారిక వెబ్‌సైట్లలో ఫొటోలతో కూడిన మొత్తం ఓటర్లిస్టును ఉంచింది. రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం ఇచ్చే అధికారిక ఓటర్ జాబితాలో కూడా ఓటర్ల ఫొటోలు ఉండవు. కానీ టీడీపీ మాత్రం అనైతికంగా ఫొటోలతో సహా ఓటరు జాబితాను వెబ్‌సైట్లో పెట్టి ఓటర్ల వ్యక్తిగత సమాచారానికి భంగం కలిగిస్తోందన్నారు.

చంద్రబాబు నాయడు పోలీస్ వ్యవస్థను ఎంతలా దుర్వినియోగం చేస్తున్నాడంటే. 37 మందిలో సొంత సామాజిక వర్గానికి చెందిన 35 మందికి సీఐ నుంచి డీఎస్పీగా ప్రమోషన్లు ఇచ్చారు. ఎప్పుడూ లేని విధంగా డీఐజీ లా అండ్ ఆర్డర్ పోస్ట్ క్రియేట్ చేసి చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన ఘట్టమనేని శ్రీనివాస్‌రావును నియమించారు. తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను కీలక పోస్టుల్లో ఉంచి ఎన్నికలకు వెళ్లాలని చంద్రబాబు చూస్తున్నారు. ఈ విషయాలన్నిటిని ఎన్నికల కమిషన్‌కు వివరించాం. రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరగాలంటే డీజీపీ ఠాకుర్, ఇంటెలిజెన్స్ ఐజీ వెంకటేశ్వరరావు, డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్ రావును బదిలీ చేయాలని ఈసీని కోరాం. చంద్రాబాబు నాలుగున్నరేళ్ల పాలన అవినీతిని కూడా వివరించాం. ఇలా పోగు చేసిన రూ.4వేల కోట్లుకు పైగా డబ్బును ఇప్పటికే నియోజకవర్గాలకు చేర్చారు. ఆ డబ్బును పోలీసుల ద్వారానే పంచాలని చూస్తున్నారు. మేం చేసిన ఈ ఆరోపణలన్నింటి ఆధారాలను ఈసీకి సమర్పించాం. ఇదే విషయంపై కేంద్ర హోంశాఖకు, రాష్ట్ర గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తాం. ప్రజాస్వామ్య పద్ధతిలో మేం చంద్రబాబు అవినీతిపై పోరాటం చేస్తున్నాం.

ట్యాంపరింగ్‌తోనే గెలిచారా?

ఈవీఎంలతో ఏదో జరిగిపోతోందని చంద్రబాబు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు. ఒక్కటే అడుగుతున్నా, చంద్రబాబు 2014 ఎన్నికల్లో కేవలం 1 శాతం ఓట్లతో మాపై గెలిచాడు. అప్పుడు కూడా ఈవీఎంలు ట్యాంపర్ జరిగాయా? మేం అలా అనుకోవాలా? మొన్న నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కూడా మూడింట్లో బీజేపీ ఓడిపోయింది. నిజంగా ట్యాంపరింగ్ అవకాశం ఉంటే అక్కడ బీజేపీ అధికారం చేజిక్కించుకోకపోవునా? ఎలాగు ఓడిపోతాం కదా అనీ చంద్రబాబు లాజిక్ లేకుండా మాట్లాడుతున్నారని వైఎస్ జగన్ తెలిపారు. సీఈసీని కలిసిన వారిలో ఆయన వెంట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రత్యేక హోదా కోసం ఎంపీ పదవికి రాజీనామా చేసిన మేకపాటి రాజమోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, వరప్రసాద్‌లతో పాటు ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్ర ప్రసాద్ పార్టీ సీనియర్ నేతలు ఉన్నారు.

విజయవాడ టు దుబాయి



- నెల రోజుల్లో విమాన సర్వీసుకు అవకాశం
- అభిప్రాయ సేకరణకు భారీ స్పందన
- బిడ్లను స్వీకరించిన ఏపీఏడీసీఎల్

విజయక్రాంతి, విజయవాడ : విజయవాడ నుంచి దుబాయికు విమాన సర్వీసు ప్రక్రియ ఊపందుకుంది. మరో నెల రోజుల్లో దుబాయి సర్వీసు ప్రారంభమయ్యే అవకాశం కన్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) ఆధ్వర్యంలో బిడ్లను ఆహ్వానిస్తూ జనవరి 23న నోటిఫికేషన్‌ను విడుదల చేసి ఫిబ్రవరి 02 వరకూ స్వీకరించారు. అతి తక్కువకు బిడ్‌ను దాఖలు చేసిన విమానయాన సంస్థకు అవకాశం కల్పించనున్నారు. ఫిబ్రవరి 11న విమానయాన సంస్థల ప్రతినిధుల సమక్షంలోనే బిడ్లను తెరిచి తక్కువకు కోట్ చేసిన సంస్థను ఎంపిక చేస్తారు. అనంతరం నెల రోజుల వ్యవధిలో దుబాయికి సర్వీసు ఆరంభమయ్యే అవకాశం ఉంది. గతంలో సింగపూర్‌కు సర్వీసును నడిపినప్పుడు కూడా ఇలాగే తొలుత బిడ్లను ఆహ్వానించి అనంతరం ఇండిగోను ఎంపిక చేశారు. దుబాయికి సర్వీసును ఏర్పాటు చేస్తే సింగపూర్ కంటే రద్దీ రెట్టింపు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

దుబాయికి సర్వీసులను నడిపేందుకు ప్రజాభిప్రాయ సేకరణను ఏపీఏడీసీఎల్ చేపట్టింది. గతంలో సింగపూర్‌కు సర్వీసును ఆరంభించే ముందు కూడా ఇలాగే సర్వే చేపట్టారు. తాజాగా దుబాయికి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు మంచి స్పందన వచ్చింది. ఏపీఏడీసీఎల్ వెబ్‌సైట్‌తో పాటూ ఈమెయిల్, వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా సర్వేను చేపట్టారు. కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు విదేశాలలో ఉండే ప్రవాసాంధ్రుల నుంచి మద్దతుగా పెద్దఎత్తున స్పందన వచ్చింది. ఏపీఏడీసీఎల్ వెబ్‌సైట్‌లోనే 2,42,594 మంది దుబాయి సర్వీసుకు ఓటేశారు. 950 మంది ఈమెయిళ్ల ద్వారా తమ సమ్మతిని తెలిపారు. మరో 25 మంది వాట్సాప్, 30 మంది ఎస్ఎంఎస్‌ల ద్వారా ఆసక్తిని తెలియజేశారు. జనవరి 23 వరకూ వచ్చిన ఈ స్పందనను చూసిన రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ వెంటనే బిడ్లను ఆహ్వానించింది. బిడ్లను దాఖలు చేసిన విమానయాన సంస్థల్లో వయబులిటీ గ్యాప్ ఫండింగ్‌ను అత్యంత తక్కువకు కోట్ చేసిన వారిని ఎంపిక చేయనున్నారు.

దుబాయి సర్వీసును బుధ, శుక్రవారాల్లో వారంలో రెండు రోజులు నడపాలని భావిస్తున్నారు. ప్రస్తుతం సింగపూర్‌కు నడుస్తున్న అంతర్జాతీయ సర్వీసులు మంగళ, గురువారాల్లో గన్నవరం నుంచి నడుస్తున్నాయి. అందుకే.. బుధ, శుక్రవారాల్లో నడపాలని భావిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి దుబాయికి సర్వీసును ఆరంభిస్తే.. స్పందన భారీగా ఉండబోతోంది. సింగపూర్‌కు వీసాల సమస్య ఎదురవుతోంది. దీంతో ఆరంభంలో సర్వీసులు సగం వరకూ నిండేవి. ప్రస్తుతం 70శాతం పైగా నిండుతున్నాయి. దుబాయికి సింగపూర్ మాదిరిగా వీసా సమస్య లేదు. అమెరికా వీసా ఉన్న ప్రతి ఒక్కరూ దుబాయికి నేరుగా వెళ్లిపోవచ్చు. అమెరికా వీసా ముద్ర ఉంటే దుబాయికి ప్రత్యేకంగా అవసరం లేదు. దానితోనే వెళ్లిపోవచ్చు. కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధికులకు అమెరికా వీసాలున్నాయి. దీనికితోడు కొత్తగా వీసా అవసరమైన వారికి అత్యంత తేలికగా దుబాయి అందిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద వాణిజ్య కేంద్రమైన దుబాయికి వెళ్లి వచ్చేవారు ఈ ప్రాంతం నుంచి భారీగా ఉంటారు. ప్రపంచంలోని ఏ దేశానికైనా అత్యంత తేలికగా దుబాయి నుంచి వెళ్లిపోయేందుకు వీలుంటుందని, అందుకే ఆరంభం నుంచే రద్దీ ఉండబోతోందని గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి మండలి సభ్యులు ముత్తవరపు మురళీకృష్ణ వెల్లడించారు. గన్నవరం నుంచి దుబాయి సర్వీసును ఆరంభించాలంటూ ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ తరపున చాలాకాలంగా కోరుతున్నామని, ఇన్నాళ్లకు ఆ కల నెరవేరుతుండటంతో ఈ ప్రాంత వాసులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

అందరూ కుమ్మక్కు అవటంతోనే..
అమ్మవారి ఆదాయానికి గండి

- టికెట్ల కుంభకోణంపై ఈవో సమగ్ర విచారణ

విజయక్రాంతి, విజయవాడ : దుర్గగుడిలో ఆదివారం వెలుగుచూసిన దర్శనం టికెట్ల కుంభకోణంలో అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. టికెట్ల భాగోతం బయట పడటం ఇదే ప్రథమం కాదని, గతంలో పలుమార్లు టికెట్ల కుంభకోణాన్ని గుర్తించినా పూర్వపు ఈవోలు చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి.

తాజా ఉదంతంలో కేవలం కౌంటర్‌లో టికెట్లను విక్రయించిన సిబ్బందే కాకుండా, టికెట్లను స్కానింగ్ చేసే సిబ్బందితో పాటు త్రిలోక్ సంస్థకు చెందిన ఐటీ టెక్నీషియన్ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. తాజా ఘటనపై దుర్గగుడి ఈవో వి. కోటేశ్వరమ్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టినట్లు సమాచారం.

దుర్గగుడి ఘాట్ రోడ్డుతో పాటు మహా మండపం వద్ద రూ. 300, రూ.100 టికెట్లు విక్రయించే కౌంటర్లను త్రిలోక్ సంస్థ నిర్వహిస్తోంది. శనివారం మధ్యాహ్నం ఘాట్ రోడ్డులోని కౌంటర్ నుంచే టికెట్లను విక్రయించినట్లు ఆలయ ఈవో విచారణలో బయటపడినట్లు తెలుస్తోంది. కేవలం ఘాట్ రోడ్డులోని కౌంటర్లోనే ఈ తరహా అక్రమాలకు పాల్పడ్డారా, లేక మిగిలిన కౌంటర్లలోనూ ఈ తరహా అక్రమాలు జరిగాయా అనే దిశగా విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

తాజా ఘటనలో కేవలం కౌంటర్‌లో టికెట్లు విక్రయించిన సిబ్బంది పాత్ర మాత్రమే ఉందనుకునే వీలులేదని పలువులు వ్యాఖ్యానిస్తున్నారు. కౌంటర్‌లో విక్రయించిన టికెట్లను అమ్మవారి ఆలయం చిన్న గాలి గోపురం వద్ద ఉన్న స్కానింగ్ కౌంటర్ వద్ద స్కాన్ చేశారు. ప్రతి కార్డుకు ఇచ్చిన బార్‌కోడ్ స్కాన్ చేసినప్పుడు కంప్యూటర్లో ఆ కార్డు వివరాలు పోలుస్తాయి. అయితే స్కానింగ్‌లోని సిబ్బంది ఈ విషయాన్ని గమనించలేదా, లేక స్కానింగ్ కౌంటర్‌లో సిబ్బంది టికెట్ల విషయం తెలిసి కావాలని తప్పించారా? అనేది తేలాల్సి ఉంది. కౌంటర్‌లో పని చేసే సిబ్బంది, టికెట్లు స్కానింగ్ చేసే సిబ్బంది ఇద్దరు త్రిలోక్ వారు నియమించిన వారు కావడంతో ఇటువంటి అక్రమాలు బయటకు రావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



స్పష్టంగా లేని సీరియల్ నంబర్లు

రూ. 100, రూ.300 టికెట్ల యాక్సిస్ కార్డులపై ముద్రించే బార్ కోడ్ కింద సీరియల్ నంబర్ స్పష్టంగా లేకపోవడమే అక్రమాలకు ఆస్కారం కల్పించిందన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి యాక్సెస్ కార్డుకు ఒక గుర్తింపు నంబర్ ఉంటుంది. యాక్సెస్ కార్డుపై ముద్రించే బార్ కోడ్ కింద ఆ రోజు విక్రయించిన టికెట్ల సీరియల్ నంబర్‌ను ముద్రిస్తారు. అయితే టికెట్లను కొనుగోలు చేసిన భక్తులు యాక్సిస్ కార్డుపై ఉన్న నంబర్‌ను మాత్రమే గమనిస్తుంటారు. అయితే ఇదే చీటిపై చిన్నవిగా ఉన్న సీరియల్ నంబర్ కింద మరో మారు తేదీ, నెల, ఏడాదిని కూడా ముద్రిస్తున్నారు. ఈ సీరియల్ నంబర్లను గుర్తించ వీలు లేకపోవడంతో అక్రమాలను అటు భక్తులు కానీ, ఆలయ అధికారులు గానీ గుర్తించే అవకాశం లేకుండా పోతోంది.

రూ. 100, రూ. 300 టికెట్ల కౌంటర్లను నిర్వహించే బాధ్యత ఇక దేవస్థానం తీసుకోనున్నట్లు సమాచారం. టికెట్ల కుంభకోణం బయట పడిన వెంటనే ఆలయ ఈవో వి. కోటేశ్వరమ్మ త్రిలోక్ అధికారులతో సమావేశమై వెంటనే కౌంటర్ల నిర్వహణ నిలిపివేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉండటంతో ఒకటి రెండు రోజులలో నగదు లెక్కల వివరాలను దేవస్థానానికి అప్పగించిన తర్వాత కౌంటర్లలో వ్యవహారం తేలే అవకాశాలు ఉన్నాయి.

అర్ధాకలితో చదువు సాగేదెలా..

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

విజయక్రాంతి, గుంటూరు : పదోతరగతి విద్యార్థులు అర్ధాకలితో అల్లాడుతున్నారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం బడికి బయల్దేరే పిల్లలు స్కూలులో మధ్యాహ్నం భోజనం మాత్రమే చేస్తున్నారు. సాయంత్రం వదలగానే అర్ధాకలితో ప్రత్యేక తరగతుల్లో కూర్చుంటున్నారు. మళ్లీ ఇంటికి వెళితేనే ఏదైనా తినేది వారికి ఆహార విషయమై విద్యాశాఖ నుంచి నేటి వరకు ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు. ఏటా జిల్లా పరిషత్ నుంచి కేటాయింపులు చేసేవారు. ప్రస్తుతం అంతా ఎన్నికల హడావుడిలో పట్టించుకోక పోవడంతో జిల్లాలోని టెన్త్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 59 వేల మంది టెన్త్ విద్యార్థులు ఉంటే వీరిలో సగం మంది జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన వారే.

ప్రభుత్వ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులు మంచి గ్రేడ్లతో ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో విద్యా శాఖ ఉదయం, సాయంత్రం వేళల్లో గత 45 రోజులుగా గంట చొప్పున ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. విద్యార్థుల సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. సాయంత్రం వేళ అల్పాహారం లేక చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు కూడా ఏర్పాట్లు చేయడం లేదు. ఆయా మండలాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే దాతలు ఎంతో మంది ఉన్నారు. వీరితో పాటు ప్రతి గ్రామంలో గ్రామాభివృద్ధి, ఎస్ఎంసీ, జన్మభూమి కమిటీలు ఉన్నాయి. విద్యార్థుల సమస్యలపై వారంతా స్పందించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

మార్చి 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయుల సహకారం, విద్యాశాఖ ప్రణాళికలు బాగానే ఉన్నా, అల్పాహార విషయంలో మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన దూర ప్రాం తాల విద్యార్థుల్లో కొందరు ఉదయం భోజనం చేయకుండానే తరగతులకు హాజరవు తున్నారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు.

ఆర్థిక కారణాలతోనే
జయరాం హత్య

- ఏపీ డీజీపీ

విజయక్రాంతి, అమరావతి: జయరాం హత్య కేసు విచారణకు ఆరు బృందాలను ఏర్పాటు చేశామని ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ తెలిపారు. ఈ కేసులో చాలా వరకు ఆధారాలను సేకరించామని, వాటిపై స్పష్టత కూడా వచ్చిందని చెప్పారు. ఆర్థిక కారణాలతో హత్య జరిగినట్లు కనిపిస్తోందన్నారు. హైదరాబాద్‌లోనే జనవరి 31న రాత్రి 11 నుంచి 12 గంటల మధ్యలో హత్య జరిగిందని, మృతదేహాన్ని కారులో తీసుకొచ్చి కృష్ణాజిల్లా కీసర సమీపంలో వదిలిపెట్టారని డీజీపీ చెప్పారు.

బంధువులపై అనుమానాలు

కాగా, జయరాం బంధువులపైనే అనుమానాలున్నాయని అతని భార్య పద్మశ్రీ ఆరోపించారు. కేసు విచారణలో భాగంగా ఆమె వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేసినట్లు సమాచారం. 2016 నుంచి ప్రాణాపాయం ఉందని జయరాం తనతో చెప్పేవారని, అమెరికా నుంచి భారత్‌కు వచ్చాక ఇంత ఘోరంగా చంపుతారని ఊహించలేదని పద్మశ్రీ పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. సమావేశాల కోసమే జయరాం అమెరికా నుంచి భారత్ వచ్చారని ఆమె చెప్పారు. సొంత అక్కతోనే ప్రాణహాని ఉందని జయరాం చెప్పేవారని పద్మశ్రీ వెల్లడించారు. మేనకోడలు శిఖా చౌదరి ప్రమేయం ఎక్కువ కావడంతోనే ఆమెను ఓ ఛానల్ బాధ్యతల నుంచి తప్పించినట్లు పోలీసులకు పద్మశ్రీ వివరించినట్లు సమాచారం. మరోవైపు ఈ కేసులో నిందితుడిగా ఉన్న రాకేశ్రెడ్డిని పోలీసులు విచారిస్తున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాకేశ్ నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు
న్యాయం చేయాలి

విజయక్రాంతి, విజయవాడ: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలంటూ విజయవాడలో వైఎస్సార్ సీపీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పదమూడు జిల్లాల నుంచి అగ్రిగోల్డ్ బాధితులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, జోగిరమేష్, అడపా శేషు తదితరులు పాల్గొన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులపై ఆంధ్రప్రదశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు కన్నేశారని వైఎస్సార్ సీపీ నేత కే పార్థసారధి వ్యాఖ్యానించారు. అందుకే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగటం లేదన్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్ధరాత్రి ఎస్సెల్ సంస్థ ప్రతినిధులతో చంద్రబాబు భేటీ అయ్యారని, ఆ తరువాత సదరు సంస్థ వెనక్కి వెళ్ళిపోయిందని తెలిపారు. వెంటనే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంచుకొండలకు ముంచుకొస్తున్న ముప్పు


న్యూఢిల్లీ: హిమాలయాలకు కాలుష్యం ముప్పు తెస్తున్నది. భూతాపం పెరిగి కొండల మీది మంచు కరిగే రోజు ఎంతో దూరంలో లేదు. ఇప్పటికిప్పుడు జాగ్రత్తపడి భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేసినా 2100 సంవత్సరం నాటికి మూడోవంతు మంచు మాయమవడం ఖాయమని ఓ తాజా నివేదిక హెచ్చరిస్తున్నది. ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెయిన్ డెవలప్మెంట్ అనే సంస్థ ఈ నివేదికను రూపొందించింది. అలాకాకుండా ఇప్పటి భూతాప ధోరణి యథావిధిగా కొనసాగితే మూడింట రెండొంతుల మంచు అంతర్థానం అవుతుంది. ఇది మామూలు విషయమేమీ కాదు. సుమారుగా 200 కోట్ల మంది ప్రజల జీవితాల్లో ఇది ప్రభావం చూపుతుంది. వాతావరణ మార్పుల వల్ల ప్రభావితమయ్యే ప్రాంతంలో జరిపిన ఈ అధ్యయనం మంచుకొండలకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని హెచ్చరిస్తున్నది.

ఏనుగుకు ఊరట!




తమిళనాడు: ఆ ఏనుగును అందరూ ముద్దుగా చిన్నతంబి అని పిలుచుకుంటారు. తమిళనాడులోని తాడగం లోయ లేదా ఆనైకట్టి దాని నివాస ప్రాంతం. కానీ మనుషుల దురాక్రమణ వల్ల అది తన నివాసప్రాంతాన్ని కోల్పోయి జనావాసాల మీదకు వచ్చిపడుతున్నది. అది సాకుగా చూపి ఏనుగును పట్టుకున్నారు. ఇప్పుడు దానిని కఠినమైన పద్ధతుల్లో మచ్చిక చేసి వాడుకోవాలని అటవీ అధికారులు ప్లాన్ వేశారు. కానీ ఈ నిర్ణయంపై జనం మండిపడుతున్నారు. దాంతో తమిళనాడు ప్రభుత్వం దిగివచ్చింది. సోమవారం హైకోర్టులో ఈ అంశంపై దాఖలైన పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు ఏనుగును మచ్చిక చేసుకునే ఆలోచన ఏదీ లేదని, అటువంటిది ఏదీ జరుగదని స్పష్టమైన హామీ ఇచ్చింది. దాంతో చిన్నతంబికి ఊరట లభించినట్టయింది. ఇటుక బట్టీలు, గనులు అంటూ ఏనుగు నివాసప్రాంతంలోకి చొచ్చుకు వెళ్లింది మనుషులు. ఇప్పుడు అది బతికేందుకు చోటులేక ఊళ్లమీద పడితే పట్టుకుని శిక్షిస్తారా? తాగ్ వీల్లేదు అని కోయంబత్తూరు ప్రాంత ప్రజలు ఆందోళనకు దిగారు. ఆ ఆందోళనకే సేవ్ చిన్నతంబి అని పేరు స్థిరపడింది. అడవిలో హాయిగా తిరిగే ఏనుగును రాటకు కట్టేసి హింసించడం భావ్యం కాదని ఆందోళనకారులు అంటున్నారు. ఇళ్ల మీద పడ్డా అది తనవల్ల విధ్వంసం జరుగకుండా జాగ్రత్త పడుతున్నదని ప్రజలు అంటున్నారు. కిటికీలో నుంచి తొండాన్ని వంటింటిలోకి పంపి అన్నం గిన్నెను వెదకి కేవలం అన్నాన్ని మాత్రమే తినేసి వెళ్లిపోతున్నదని చెప్తున్నారు. అలాంటి ఏనుగును కిరాతకంగా హింసించి మచ్చిక చేసుకోవడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రస్తుతం ఏనుగుకు అధికారులు రేడియో కాలర్ తగిలించి వదిలిపెట్టారు. దానిని తిరిగి పట్టుకుని అడవిలో వదిలిపెట్టాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం సుమారు 60 మంది సామాజిక, పర్యావరణ కార్యకర్తలు, జంతుప్రేమికులు కోయంబత్తూరు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి మహజరు సమర్పించారు. చిన్నతంబిని కుమకీ (మచ్చిక పశువు)గా మార్చే ప్రక్రియ నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో పలుచోట్ల సేవ్ చిన్నతంబి ఆందోళనకారులు ప్రదర్శనలు నిర్వహించారు. అదేరోజు కోర్టులో ప్రభుత్వం మచ్చిక నిర్ణయం లేదని ప్రకటించడంతో ఆందోళన విజయం సాధించినట్టయింది.

ఉగ్రబాట పట్టిన 191 మంది యువకులు



జమ్మూకశ్మీర్: జమ్మూకశ్మీర్ లోని వివిధ ప్రాంతాలకు చెందిన 191 మంది యువత తీవ్రవాదంలో చేరారని ఆర్మీ సీనియర్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 2018 ఒక్క ఏడాదే ఈ సంఖ్య నమోదైందని తెలిపారు. వీరిలో ఎక్కువ మంది దక్షిణ కశ్మీర్ ప్రాంతానికి చెందిన యువతను హిజ్బుల్ ముజాహిదీన్, లష్కరే యీ తాయిబాతోపాటు ఇతర ఉగ్రవాద సంస్థలు నియమించుకున్నాయని అన్నారు. 2017లో తీవ్రవాదంలో చేరిన యువకుల సంఖ్య 126గా ఉందని చెప్పారు. ప్రధానంగా పుల్వామా, షోపియాన్, కుల్గామ్, అనంత్ నాగ్ జిల్లాల నుంచే ఎక్కువ మంది ఉన్నారని వెల్లడించారు. యువత ఉగ్రబాట పట్టకుండా చర్యలు తీసుకుంటున్నా.. ఆయా గ్రామాల్లోని యువతకు ఉగ్రనేతలు తెలివిగా మాయమాటలు చెప్పి తప్పుదోవపట్టేలా చేస్తున్నారన్నారు. కాగా, అలా ఉగ్రబాట పట్టిన కొంతమంది యువకులను ఇటీవలే పోలీసులు తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి ఉద్యోగాలు కూడా కల్పించిన విషయం విదితమే.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కిడ్నాప్, దోపిడీ



బెంగళూరు: చెన్నై ఇన్ఫోసిస్‌కు చెందిన ఉద్యోగిని కిడ్నాప్ చేసి రూ. 45 వేలు దోచుకెళ్లిన సంఘటన బెంగళూరులోని హోసూరు ప్రధాన రహదారిలో జనవరి 31వ తేదీన చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. చెన్నైకి చెందిన అనురాగ్ శర్మ(25) ఆఫీసు పని నిమిత్తం జనవరి 31న బెంగళూరుకు వచ్చాడు. పని ముగించుకున్న శర్మ.. ఆ రోజు రాత్రి చెన్నైకి బయల్దేరేందుకు రాత్రి పన్నెండు గంటల సమయంలో హోసూరు ప్రధాన రహదారిపైకి వచ్చి నిలబడ్డాడు. అంతలోపే ఓ ఎక్కాల్సిన బస్సు వెళ్లిపోయింది. ఇక మరుసటి ఓమ్నిలో వచ్చిన నలుగురు వ్యక్తులు.. శర్మను కారులోకి లాగారు. కళ్లకు బట్టలు కట్టి, చేతులు, కాళ్లు కట్టేశారు. ఆ తర్వాత ఎనిమిది గంటల పాటు అనురాగ్ శర్మను వేధించి, బెదిరించి ఏటీఎం, క్రెడిట్ కార్డులను లాక్కున్నారు. పిన్ నంబర్లను బలవంతంగా చెప్పించుకొని రూ. 45 వేలను డ్రా చేశారు. తిరిగి ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 8:30 గంటలకు చందాపుర వద్ద అనురాగ్‌ను వదిలేశారు. మొత్తానికి అనురాగ్.. సమీపంలో ఉన్న నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. తనను దోపిడీ చేసిన వ్యక్తులపై పోలీసులకు అనురాగ్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నలుగురు సభ్యుల ముఠా కోసం గాలిస్తున్నారు. అనురాగ్ చెన్నైకి బదిలీ అయ్యే కంటే ముందు మైసూరులోని ఇన్ఫోసిస్‌లో పని చేసేవాడు. ప్రస్తుతం ఇన్ఫోసిస్ అనురాగ్ సీనియర్ సిస్టమ్స్ మేనేజర్‌గా పని చేస్తున్నారు.

హరిద్వార్, ప్రయాగ్‌రాజ్‌ల్లో నాగా దీక్షలు



హరిద్వార్: ప్రస్తుత కుంభమేళా సందర్భంగా పదివేల మంది నాగా సాధువులుగా దీక్ష తీసుకున్నారు. అందులో ఇంజినీర్లు, ఎంబీఏలు కూడా ఉన్నారు. వారందరికీ తలనీలాలు తీసి కేవలం పిలక ఉంచి దీక్షలు ఇచ్చారు. ఎవరైనా నాగా సాధువుగా మారాలంటే ఈ తంతు తప్పనిసరి. తిరుక్షవరం తర్వాత గోచిపెట్టుకుని తమకు తామే పిండప్రదానం చేసుకోవాలి. బతికున్న ఇతర కుటుంబ సభ్యులకూ పిండం సమర్పించాలి. దాంతో పాత అస్తిత్వం పూర్తిగా అంతరించిపోతుంది. కొత్తపేరుతో నాగా సాధువుగా జీవితం ప్రారంభించాల్సి ఉంటుంది. హరిద్వార్, ప్రయాగ్‌రాజ్‌లో ప్రస్తుతం ఈ దీక్షలు జోరుగా సాగుతున్నాయి. అయితే దీక్ష తీసుకోగానే సంపూర్ణంగా నాగా సాధువుగా మారినట్టు కాదు. తర్వాత కఠినమైన పరీక్షలుంటాయి. వాటన్నిటిని దాటిన తర్వాతనే పూర్తిగా నాగా సాధువుగా మారినట్టు భావించాలి. అంతిమ దీక్ష వేరే ఉంటుంది. నిరంజనీ, మహానిర్వాణి వంటి వేరువేరు పేర్లు గల సుమారు 13 అఖారాలు ఉన్నాయి. వీటి అధిపతులు దీక్షా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కేవలం కుంభమేలా సందర్భంగానే ఈ దీక్షలు ఇస్తారు. ఏదో క్షణికావేశంలో చేరారా? లేక జీవితంలో సంక్షోభం వచ్చి చేరారా? అనేది పరీక్షిస్తారు. నిజంగా వైరాగ్యం కలిగిందా? అనేది కఠిన పరీక్షల ద్వారా నిగ్గు తేల్చుకుంటారు. అన్నిరకాలుగా సంతృప్తి కలిగిన తర్వాతనే నాగా సాధువుగా స్వీకరిస్తారు.

51 మంది కాదు.. ఇద్దరే!

శబరిమలలోకి ప్రవేశించిన మహిళల సంఖ్య



తిరువనంతపురం: అన్నివయస్కుల మహిళల ప్రవేశానికి అనుమతిస్తూ సుప్రీం తీర్పు వెలువరించిన తర్వాత శబరిమల ఆలయంలోకి ప్రవేశించింది ఇద్దరు మహిళలేనని అసెంబ్లీలో కేరళ ప్రభుత్వం వెల్లడించింది. సోమవారం ఆ ప్రభుత్వం గతంలో వెల్లడించిన లెక్కలను సవరించుకుంది. నిషేధం ఎత్తివేత అనంతరం 51 మంది మహిళలు ఆలయంలోకి ప్రవేశించారంటూ జనవరి 18న సుప్రీంకు జాబితాను అందించిన సంగతి తెలిసిందే. అయితే దానిపై అనేక విమర్శలు చెలరేగాయి. 50 సంవత్సరాలు దాటిన మహిళల పేర్లు, మగవారి పేర్లు కూడా అందులో చేర్చారని ప్రతిపక్షాలు ప్రభు త్వం మీద ఆగ్రహం వ్యక్తం చేశాయి. అసెంబ్లీలో సోమవారం ప్రతిపక్షాలు ఆ జాబితాపై అనేక ప్రశ్నలు లేవనెత్తడంతో దేవసం మంత్రి కె. సురేంద్రన్ దాన్ని సవరించారు. ఆలయాన్ని సందర్శించే మహిళల కోసం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని సుప్రీం ఎటువంటి సూచనలు చేయలేదని ఆయన అసెంబ్లీకి వెల్లడించారు. 50 సంవత్సరాల లోపు వయస్సున్న బిందు, కనకదుర్గ జనవరి 2న తెల్లవారుజామున ఆలయంలోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. దానిపై భక్తులు, పలు సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో భద్రత కల్పించాలంటూ వారు సుప్రీంను ఆశ్రయించారు. ఆ సందర్భంలోనే కేరళ ప్రభుత్వం 51 మంది పేర్లతో ఓ జాబితాను సుప్రీంకు సమర్పించింది.

సరిహద్దు రేఖలపై
ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ సమీక్ష



ఈటానగర్: భారతీయ సరిహద్దు నియంత్రణ రేఖలపై ఆర్మీచీఫ్ బిపిన్‌రావత్ సోమవారం సమీక్షించారు. నాగాలాండ్, అరుణ్‌చల్‌ప్రదేశ్‌లో ఆయన రెండు రోజుల పర్యటనలో ఉన్నారు. అరుణ్‌చల్‌ప్రదేశ్ సరిహద్దులు మూడు దేశాలతో తాకుతాయి. సరిహద్దు పొడవు 1080 కిలోమీటర్లు చైనా సరిహద్దు కాగా, 520 కిలోమీటర్లు మయన్మార్, 217 కిలోమీటర్ల భూటాన్ సరిహద్దు ప్రాంతాలున్నాయి.

నాగాలాండ్‌లోని దీమాపూర్‌లో గల రంగాపహార్ మిలట్రీ క్యాంప్‌ను బిపిన్ రావత్ తొలుత సందర్శించారు. ఎల్‌వోసీ దళాలు నిర్వరిస్తున్న విధులను ఇక్కడ తెలుసుకొని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు, చొరబాటుదారుల ఆటకట్టించేందుకు ఆర్మీ చేస్తున్న ప్రయత్నాలతో బిపిన్ రావత్ సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఆర్మీ చేస్తున్న ప్రయత్నాలు బాగున్నాయన్నాయన్నారు. చైనా సరిహద్దు నియంత్రణ రేఖ వద్ద కూడా ఆర్మీ దళాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారన్నారు.

అరుణ్‌చల్ ప్రదేశ్ ఆర్మీ చీఫ్ బి.డి. మిశ్రాతో రాజ్‌భవన్‌లో భద్రతా అంశాలపై బిపిన్ రావత్ చర్చించారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఎంతోమంది యువత ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారని దేశం కోసం వీరి చేస్తున్న కృషి గర్వించదగ్గదన్నారు.

కిసాన్ సమ్మాన్‌కు ఆధార్ ఉండాల్సిందే

ఢిల్లీ: రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పథకం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధి చేకూరాలంటే ఆధార్ తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు. చిన్న, మధ్య తరహా రైతులకు ఆర్థిక సహకారం అందజేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. దీనికి కింద రైతులకు ఏడాదికి రూ.6వేలు అందజేస్తారు. మూడు విడతల్లో లబ్ధిదారులకు ఈ నగదు అందనుంది. ఈ లబ్ధి చేకూరాలంటే రైతులు ఆధార్‌ను తప్పనిసరిగా ఉండాలి.

గుర్తింపు నిరూపణ కోసం..

గుర్తింపు నిరూపించుకునేందుకు రైతులు ఆధార్ నెంబరును ఇవ్వాల్సి ఉంది. డిసెంబరు 2018మార్చి 2019 వరకు తొలి విడత కింద రూ.2వేలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఆధార్ నెంబరును ఆప్షన్‌లాగా ఇచ్చారు. కానీ రెండో విడత నగదు బ్యాంకు ఖాతాల్లో వేయాలంటే అందుకు ఆధార్ నెంబరు తప్పనిసరి అని కేంద్ర వ్యవసాయమంత్రిత్వ శాఖ వెల్లడించింది. మొదట విడత నగదు పొందేందుకు ఆధార్కు బదులుగా డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ కార్డు, ఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డులు ఏమైనా ఉన్న సరిపోతుంది. రెండో విడత నగదు పొందాలంటే మాత్రం తప్పనిసరిగా ఆధార్ నెంబరును అధికారులు తీసుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించింది. అర్హులైన రైతులకు నేరుగా లబ్ధి చేకూరేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఈవీఎంలపై ఫిర్యాదు

ఢిల్లీ: ఈవీఎంలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి ఎన్డీయేతర పార్టీలు.. ఢిల్లీలో సెంట్రల్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను కలిసిన నేతలు.. ఈవీఎంల బదులు బ్యాలెట్ పేపర్ ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈవీఎంలతో పాటు ఎన్నికల కమిషన్ తెచ్చిన వీవీ ప్యాట్ల స్లిప్పులనైనా పూర్తిగా లెక్కించాలని కోరారు. ఈవీఎంలపై ఉన్న ఆరోపణలు తదితరాల నేపథ్యంలో సీఈసీని కలిసిన విపక్ష నేతల బృందంలో కాంగ్రెస్ నేతలు గులాంనబీ అజాద్, ఆనంద్ శర్మ, ఏకే ఆంటోనీ, మల్లికార్జున ఖర్గే, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, టీడీపీ ఎంపీలు సుజనాచౌదరి, కనకమేడల రవీంద్రకుమార్, సీపీఐ నేత, రాజా, ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్, ఎస్పీ నేత రాంగోపాల్ యాదవ్, ఆర్జేడీ ఎంపీ ప్రొఫెసర్ నీరజ్ కుమార్ ఉన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన డీకే




బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ జేడీఎస్ పార్టీల సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం అయిన భారీ నీటి పారుదల శాఖా మంత్రి, ట్రబుల్ షూటర్ డీకే. శివకుమార్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అరెస్టు భయంతో ఈడీ అధికారులు జారీ చేసిన ఈసీఐఆర్ ను రద్దు చెయ్యాలని మంత్రి డీకే. శివకుమార్ హైకోర్టులో మనవి చేశారు.

ఈడీ అధికారులు మంత్రి డీకే. శివకుమార్ కు విరుద్దంగా ఎన్ ఫోర్స్ మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) జారీ చేశారు. ఫిబ్రవరి 8వ తేదీన విచారణకు కచ్చితంగా హాజరుకావాలని ఈడీ అధికారులు మంత్రి డీకే. శివకుమార్ కు ఆదేశాలు జారీ చేశారు.

గుజరాత్ కాంగ్రెస్ శాసన సభ్యులను డీకే. శివకుమార్ బెంగళూరు రిసార్టులో పెట్టి బీజేపీ నాయకులకు నిద్రలేకుండా చేశారు. కర్ణాటకలో బీజేపీ అధిక శాసన సభ స్థానాల్లో విజయం సాధించినా ఆ పార్టీ అధికారంలోకి రాకుండా డీకే. శివకుమార్ పావులు కదిపారు.

ఇదే సమయంలో ఐటీ శాఖ అధికారులు డీకే. శివకుమార్ ఇళ్లు, కార్యాలయాల్లో సోదలు చేశారు. ఆ సందర్భంలో లెక్కల్లోలేని నగదును అధికారులు గుర్తించి ఈడీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఐటీ శాఖ అధికారులు సమాచారంతో మంత్రి డీకే. శివకుమార్ కు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయను: ఉపేంద్ర



బెంగళూరు: స్యాండిల్ వుడ్ ప్రముఖ హీరో, ఉత్తమ ప్రజాకీయ పార్టీ (యూపీపీ)వ్యవస్థాపకుడు ఉపేంద్ర వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కర్ణాటకలోని 28 లోక్‌సభ నియోజక వర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని అన్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో తాను మాత్రం పోటీ చెయ్యనని, మా పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేస్తానని హీరో ఉపేంద్ర క్లారిటీ ఇచ్చారు. దావణగెరెలో హీరో ఉపేంద్ర మీడియాతో మాట్లాడారు. తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చెయ్యకూడదని నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. 28 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక జరుగుతోందని, ఆ విషయంపై తాము కసరత్తులు చేస్తున్నామని హీరో ఉపేంద్ర అన్నారు. జాతీయ రాజకీయాల కంటే కర్ణాటక రాజకీయాల మీద హీరో ఉపేంద్ర ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. వచ్చే శాసన సభ ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేస్తానని హీరో ఉపేంద్ర అన్నారు. తనను సినిమా రంగంలో గుర్తించి ఈ స్థాయికి తీసుకువచ్చిన అభిమానులను నిరాశపరచనని హీరో ఉపేంద్ర తెలిపారు. కర్ణాటకకు ఒక శక్తివంతమైన పార్టీ అవసరం ఉందని, ఆ విషయంలో తాను రాజకీయ పార్టీ స్థాపించానని హీరో ఉపేంద్ర వివరణ ఇచ్చారు. శాసన సభ ఎన్నికల్లో పోటీ చెయ్యాలని చాల ఆసక్తిగా ఉందని, ఎమ్మెల్యే అయిన తరువాత తాను సినిమా రంగాకి దూరం అయ్యి ప్రజాసేవ చేస్తానని హీరో ఉపేంద్ర అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో ఎవరు పోటీ చెయ్యాలనే విషయం తన అభిమానులు, ప్రజలకు విడిచిపెట్టామని, తమ పార్టీ అభ్యర్థుల విజయం తనకు ముఖ్యమని హీరో ఉపేంద్ర వివరించారు. ప్రజల అభిప్రాయం మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి లోక్ సభ ఎన్నికలలో పోటీ చేస్తామని హీరో ఉపేంద్ర అన్నారు. అయితే 28 లోక్ సభ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు ఎంత మంది విజయం సాధిస్తారు అనే విషయం ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదని ఉపేంద్ర వివరించారు. తమ పార్టీ ఎవ్వరితో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తుందని హీరో ఉపేంద్ర స్పష్టం చేశారు.

పాలిటిక్స్‌కి నో: మోహన్‌లాల్



తమిళనాడు: తాను రాజకీయాల్లోకి రానున్నట్లు వస్తున్న వార్తలను ఖండించాడు మళయాల సూపర్‌స్టార్ మోహన్‌లాల్. తనకు రాజకీయాలంటే అసలు పడదని అతడు తేల్చి చెప్పాడు. ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశంగానీ, అసలు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశంగానీ లేదని స్పష్టం చేశాడు. రాజకీయాలు నాకు సరిపడవు. నేను ఎప్పటికీ ఓ నటుడిగానే ఉండాలని అనుకుంటున్నా. ఈ వృత్తిలో ఉన్న స్వేచ్ఛను నేను ఆస్వాదిస్తున్నాను. రాజకీయాల్లో మనపై ఎంతో మంది ఆధారపడతారు. అది అంత సులువు కాదు. అంతేకాదు ఈ రాజకీయాల గురించి నాకు ఎక్కువగా తెలియదు. అసలు నాకు ఆ ఉద్దేశమే లేదు అని మోహన్లాల్ చెప్పాడు. ఈ సూపర్స్టార్ని తిరువనంతపురం స్థానం నుంచి బరిలోకి దింపాలని భావిస్తున్నట్లు ఈ మధ్య బీజేపీ నేత రాజగోపాల చెప్పిన విషయం తెలిసిందే.

దీంతో మోహన్‌లాల్ బీజేపీలో చేరబోతున్నాడన్న ప్రచారం జరిగింది. మొన్న కేంద్ర ప్రభుత్వం కూడా అతనికి పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించింది. మరోవైపు రాజకీయాల్లోకి రాకూడదనన్న మోహన్లాల్ నిర్ణయాన్ని సమర్థించాడు డైరెక్టర్ మేజర్ రవి. ఇవి కేవలం పుకార్లే. ఇది విని మోహన్‌లాల్ గట్టిగా నవ్వాడు. అతడు ఎప్పటికీ రాజకీయాల్లోకి రాడు. అతనికి నటనే సూటవుతుంది అని రవి అన్నాడు. గతేడాది మోహన్లాల్ ప్రధాని మోదీని కలిశాడు. ఆ తర్వాత మోదీపై ప్రశంసలు కురిపించాడు. దీంతో అప్పుడే అతడు బీజేపీలో చేరబోతున్నాడన్న పుకార్లు వచ్చాయి.

అన్నాడీఎంకే చర్చలు రహస్యం



చెన్నై: లోక్‌సభ ఎన్నికల పొత్తుపై జాతీయ, ప్రాంతీయ పార్టీలతో అన్నాడీఎంకే కమిటీ చర్చలు జరుపుతోందని, అయితే ఎవరెవరితో చర్చలు జరుపుతున్నామన్నది రహస్యమని ఆ పార్టీ సమన్వయకర్త, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై వర్ధంతి సందర్భంగా తిరువాన్మియూరు మరుదీశ్వరర్ ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం సహపంక్తి భోజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పన్నీర్‌సెల్వం విలేఖరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని పార్టీల కన్నా అన్నాడీఎంకే బలంగా ఉందని, కనుకనే లోక్సభ ఎన్నికల పొత్తు కోసం జాతీయ, ప్రాంతీయ పార్టీలు పోటీపడుతున్నాయని అన్నారు.

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలను తొలి విడతలోనే నిర్వహించాలని అన్నాడీఎంకే ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేయనుంది. ఈ మేరకు ఆ పార్టీ సమన్వయకర్త, ఉప సమన్వయకర్తలుగా ఉన్న ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, ముఖ్యమంత్రి పళనిస్వామి సమాలోచన జరిపినట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఏప్రిల్ అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని, అప్పుడే ఒకే విడతగా ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఓ వినతిపత్రాన్ని సమర్పించాలని వారిద్దరూ భావిస్తున్నారట.

2014 లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు తొమ్మిది విడతలుగా జరిగాయి. ఈ సారి కూడా అదే రీతిలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని తెలుస్తోంది. తొలి విడత ఎన్నికల్లో ఏప్రిల్ తొలి రెండు వారాల్లో ఏదైనా ఒక రోజున నిర్వహించే అవకాశముంది కనుక తొలి విడతలోనే రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలను నిర్వహించాలని అన్నాడీఎంకే కోరనుంది. ఈ మేరకు పదిమంది ఎంపీల సంతకాలతో వినతిపత్రాన్ని తయారు చేసి రెండు మూడు రోజుల్లో ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధి కారి సునీల్ అరోరాకు అన్నాడీఎంకే సమర్పించనుంది.

అన్నా హజారేను కాపాడాలి: శివసేన



ముంబయి: లోక్‌పాల్, లోకాయుక్తాల నియామకాలు చేపట్టాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తన సొంత గ్రామం రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్షకు దిగిన సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే ప్రాణాలను కాపాడాలని శివసేన పార్టీ.. కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆయన దీక్ష ఆరో రోజుకి చేరిన నేపథ్యంలో దీనిపై తమ పార్టీ పత్రిక సామ్నాలో ఓ కథనాన్ని ప్రచురించింది. 'మొదట అన్నాహజారే ప్రాణాలను కాపాడండి. ఆ తర్వాతే ఇతర విషయాల గురించి ఆలోచించండి. ఈ పోరాటంలో ఆయన ప్రాణాలు పోవాలనే ప్రభుత్వం భావిస్తే, మన సంస్కృతి వ్యాధిగ్రస్తమైందని భావించాలి. ఆయన లోక్‌పాల్, లోకాయుక్తా, రైతుల సమస్యల పరిష్కారం కోసం దీక్ష చేస్తున్నారు. ప్రధానమంత్రి నుంచి ఆయనకు ఓ లేఖ వచ్చింది. ఆయన అమరుడయ్యేవరకు దీక్ష కొనసాగించాలని తాము కోరుకుంటున్నట్లుగా అందులో ఉంది' అని పేర్కొంది. హజారే దీక్షకు మీడియా ద్వారా ప్రచారం జరగకుండా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని శివసేన ఆరోపించింది.

'గతంలోలా హజారే దీక్షపై ప్రచారం జరిగితే, దేశ వ్యాప్తంగా ప్రజల్లో కదలికలు వచ్చేవి. ఆయన దీక్షపై ప్రచారం జరగకుండా ప్రభు త్వం ప్రయత్నిస్తోంది' అని పేర్కొంది.

హజారేను కలిసిన రాజ్ థాక్రే

అన్నాహజారేను మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎమ్ఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ థాక్రే, సామాజిక కార్యకర్త రాజేంద్ర సింగ్ సోమవారం కలిశారు. ఆయన పోరాటానికి తాను పూర్తి మద్దతు తెలుపుతున్నానని, నిరుపయోగ బీజేపీ ప్రభుత్వం సమస్యలను పట్టించుకోవట్లేదని థాక్రే అన్నారు. హజారే ప్రాణాన్ని త్యాగం చేయొద్దని, దీక్ష విరమించి తమతో కలిసి రాష్ట్ర వ్యాప్త పర్యటన చేయాలని భాజపా ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన కోరారు. ప్రధానమంత్రి నరంద్ర మోదీ తమ ఎన్నికల మేనిఫెస్టోను కూడా అమలు చేయట్లేదని ఆయన విమర్శించారు. 'ఎన్నికలకు ముందు హజారేపై నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన చాలా నిజాయతీ పరుడని, ఉన్నత విలువలు గల వ్యక్తని అన్నారు. ఆయన ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లయినప్పటికీ ఇప్పటికీ హజారే డిమాండ్లను నెరవేర్చలేదు. హజారే 2013లో చేసిన దీక్ష కారణంగానే భాజపా 2014 ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చింది. మరోవైపు ఆయన దీక్షకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మద్దతు తెలపకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. హజారే వల్లే కేజ్రీవాల్ ఎవరో దేశానికి తెలిసింది. ఆయన కనీసం ఇక్కడకు వచ్చి హజారే ఆరోగ్య పరిస్థితి గురించి కూడా తెలుసుకోవట్లేదు' అని ఆయన విమర్శించారు.

ఫేస్‌బుక్‌కు పదిహేనేళ్లు

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా 230 కోట్ల మంది యూజర్లను అక్కున చేర్చుకున్న సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ నెట్టింట అడుగుపెట్టి 15 సంవత్సరాలైంది. 2004, ఫిబ్రవరి 4న ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ ఎఫ్‌బీని ఆన్‌లైన్‌లో పరిచయం చేయడంతో సోషల్ మీడియా దిగ్గజం ప్రస్థానం ప్రారంభమైంది.
ఆరంభంలో అంకుర సంస్థగా బుడిబుడి అడుగులు వేసిన ఫేస్బుక్ ఒకటిన్నర దశాబ్దంలో కోట్లాది మందికి చేరువైంది. ప్రపంచ జనాభాలో మూడోవంతు ప్రజల దైనందిన జీవితాల్లో ఈ సోషల్ మీడియా దిగ్గజం భాగమైంది. స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫేస్‌బుక్ విలువ 500 బిలియన్ డాలర్లు కాగా, ఏటా 22 బిలియన్ డాలర్ల నికర లాభాన్ని ఆర్జిస్తోంది. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగత సంపద 62 బిలియన్ డాలర్లకు ఎగబాకిందని ఫోర్బ్స్ మ్యాగజీన్ వెల్లడించింది.

యుఏఇలో తొలి రోజు పోప్

కలుసుకున్న తూర్పు, పశ్చిమ ప్రాంతాలు



అబుదాభి: చరిత్రలో తొలిసారిగా పోప్ ఫ్రాన్సిస్ ఇస్లామిక్ దేశాల్లో అడుగుపెట్టారు. పర్యటన కోసం వచ్చిన పోప్‌కు జోర్డాన్ రాజు అమ్మాన్ ఘనస్వాగతం పలికారు. టర్కీలోని బ్లూ మాస్క్, పవిత్రస్థలంలోని అల్ అక్సా మసీదును పోప్ సందర్శించారు.

శాంతిని కాంక్షిస్తూ ఆయన అల్బేనియా, అజెర్‌బైజాన్, ఈజిప్ట్ తదితర దేశాల నుంచి వచ్చే తీర్థ యాత్రికుల శాంతిని కాంక్షిస్తూ ప్రయాణం సాగించారు. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో ఇయర్ ఆఫ్ మెర్సీని ప్రారంభించారు.

శాంతి కోసం సమావేశాలు, చర్చలు

ముస్లింలతో చర్చలు జరిపి పోప్ ఫ్రాన్సిస్ చరిత్ర సృష్టించారు. సోమవారం జరిగిన ఇంటర్‌ఫెయిత్ సమావేశంలో పోప్ సందేశాన్ని వినేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 130 కోట్ల మంది క్యాథలిక్కులు ఆసక్తిని కనబరిచారు. సందర్శనకు వచ్చిన అతిథిగా పోప్‌కు అబుధాభీ ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో ఘనస్వాగతం పలికారు. మిలటరీ పరేడ్‌తో గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా సైనిక అధికారులు గాల్లోకి 21 రౌండ్లు పేల్చగా వాటికన్ నగర జెండా రంగులను తలపించేలా తెలుపు, పసుపు రంగులు విరజిమ్మాయి. పోప్ 48 గంటల సందర్శన కోసం యుఏఇకి వస్తున్న వార్తతో పాటు ఓపెన్ ఎయిర్ ప్రాంగణంలో 1,35,000 క్యాథలిక్కులతో ప్రత్యేక ఆరాధనలో ఆయన పాల్గొంటారన్న వార్తతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. పోప్ సందర్శన సందర్భంగా అబుధాభి ప్రిన్స్ మొహమ్మద్ బిన్ జాయెడ్‌తో జరిగే చర్చల్లో ఆయన యెమెన్‌లో నెలకొన్న యుద్ధం, సంక్షోభం విషయాలను ప్రస్తావిస్తారని భావిస్తున్నారు. యెమెన్‌తో జరుగుతున్న యుద్ధంలో యుఏఇ కీలకంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. యుఏఇ జోక్యంతో యెమెన్ ప్రపంచంలోనే అత్యంత మానవతా సంక్షోభం ఎదుర్కొంటోందని ఐక్యరాజ్యసమితి ఇప్పటికే పేర్కొంది. యుఎఇ, తన భాగస్వామ్య పక్షాలు కలిసి హుతీ తిరుగుబాటుదార్లు, ప్రభుత్వం మధ్య ఎడతెగని యుద్ధం నెలకొంది. దీనితో కోటి మంది యెమన్ దేశస్తులు అత్యంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పోప్ పర్యటన నేపథ్యంలో షేక్ మొహమ్మద్ మాట్లాడుతూ, తమ మాతృదేశంలో సహనం పెరగాలని కోరుకుంటున్నామన్నారు. పోప్‌తో చర్చల సందర్భంగా తాము పరస్పర సహకారం, సహనం, మానవ సంబంధాలపై చర్చించడంతో పాటు శాంతిని, స్థిరత్వాన్ని, అభివృద్ధిని సాధించేందుకు అవసరమైన చర్యలు చేపట్టేదిశగా సంభాషించాలనుకుంటున్నట్టు ట్విట్టర్ సందేశంలో పేర్కొన్నారు. పోప్ ఒక సోదరునిగా, శాంతిదూతగా వస్తున్నారన్నారు. పోప్ రాక క్రైస్తవులు – ముస్లింల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో వైపు పోప్ మాట్లాడుతూ, యుద్ధం వల్ల ఫలితం ఉండదని, ఆ యుద్ధం ఆహార నిల్వలను పెంచదని పేర్కొన్నారు. యుద్ధం వల్ల అనేక మంది చిన్నారులు ఆకలితో ఆర్తనాదాలు చేస్తున్నారన్నారు. ఆకలితో పిల్లలు, తల్లిదండ్రులు చేస్తున్న ఆర్తనాదాలు ఇప్పటికే దేవుని చెంతకు చేరాయన్నారు. గల్ఫ్ ప్రాంతంలో యుఏఇ మత వైవిధ్యం కలిగిన దేశమని పోప్ ప్రశంసించారు. యుఏఇలో 8 క్యాథలిక్ చర్చిలుండగా, ఒమన్, కువైట్, యెమెన్‌లలో ఒక్కో దేశంలో నాలుగేసి చొప్పున ఉన్నాయి. యుఏఇ జనాభాలో ఐదింట నాలుగు వంతుల మంది ముస్లింలున్నప్పటికీ 10 లక్షల మంది వరకు క్యాథలిక్కులు కూడా ఉన్నారు. అపోస్తలిక్ వికరియేట్ ఆఫ్ సదర్న్ అరేబియే ప్రకారం... జనాభాలో 65 శాతం వలసదార్లు ఉన్నారు.

గడువు దగ్గర పడిన బ్రెగ్జిట్.. బ్రిటన్‌లో టెన్షన్...టెన్షన్



- బ్రిటన్ వైదొలిగితే పరిస్థితేంటీ?
- అల్లర్లు చెలరేగే ప్రమాదం
- రాజకుటుంబం సురక్షిత ప్రాంతాలకు
- ఎట్టిపరిస్థితుల్లోనూ బ్రెగ్జిట్ అమలు చేయాల్సిందే

లండన్: యూరప్ దేశాల్ని కుదిపేస్తున్న అంశం బ్రెగ్జిట్. బ్రిటన్ వైదొలగితే ఏం జరుగుతుందన్నదానిపై అందరిలోనూ ఆందోళనలున్నాయి. యూరో కరెన్సీ విలువ, నిరుద్యోగం, శరణార్థుల సమస్యలు మరింత ఎక్కువయ్యే ప్రమాదం కనిపిస్తోంది. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వెళ్లిపోవాలని ఆ దేశంలో 52 శాతం మంది ప్రజల కోరుకుంటున్నారు. మిగిలిన 48 శాతం మంది బ్రిటన్ యూరోపియన్ యూనియన్‌లోనే ఉండాలని కోరుతున్నారు. వెళ్లిపోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే, ఖచ్చితంగా అల్లర్లు చెలరేగే ప్రమాదం కనిపిస్తోంది. అదే జరిగితే ఏం చెయ్యాలన్న దానిపై బ్రిటన్ ప్రభుత్వం ఆలోచనలో పడింది. ముందుగా ఇంగ్లాండ్‌లోని రాజ కుటుంబంలోని రాణి ఎలిజబెత్ 2ను, ఆమె భర్తనూ సురక్షితంగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. డీల్ ప్రకారం మార్చి 29న 25 దేశాల కూటమి... యూరోపియన్ యూనియన్ నుంచీ బ్రిటన్ వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఈ బ్రిటన్ ఎగ్జిట్‌నే బ్రెగ్జిట్ అంటున్నారు. బ్రెగ్జిట్ సమయంలో అల్లర్లు జరిగితే... స్కాట్లాండ్ పోలీసుల సాయం కూడా తీసుకోవాలని లండన్ పోలీసులు భావిస్తున్నారు. మార్చిలో ఎట్టి పరిస్థితుల్లో బ్రెగ్జిట్ అమలు చెయ్యాలని బ్రిటన్ ప్రధాని థెరిసా మే డిసైడ్ అయ్యారు. బ్రెగ్జిట్‌కు సంబంధించి కొన్ని సమస్యలున్నాయి. బ్రిటన్ వైదొలగితే యూరోపియన్ యూనియన్‌లో అప్పులకు సంబంధించి ఇంకా పరిష్కారాలు దొరకలేదు. యూరో కరెన్సీ విలువ పతనం కాకుండా ఏం చర్యలు తీసుకుంటారన్నదానిపై స్పష్టత లేదు. నిరుద్యోగులు బ్రెగ్జిట్ వల్ల నష్టపోతామంటున్నారు.

ఇక బ్రిటన్‌కు సరిహద్దు దేశాలకు మధ్య వివాదాలు అపరిష్కృతంగానే ఉన్నాయి. అందువల్లే బ్రెగ్జిట్ విషయంలో బ్రిటన్ పార్లమెంట్ థెరెసా మే నిర్ణయాన్ని వ్యతిరేకించింది. స్వయంగా ఆమె పార్టీ నేతలే బ్రెగ్జిట్‌ను తప్పుపడుతూ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఆ తర్వాత జరిగిన విశ్వాస పరీక్షలో మాత్రం ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసి థెరెసా మేను గట్టెక్కించారు.

ఏది ఏమైనా రెండేళ్లుగా దొరకని పరిష్కారాలు రెండు నెలల్లో దొరికేస్తాయని అనుకోలేం. థెరిసా మే మాత్రం గడువు లోగా అన్నీ సెటిల్ చేసి, అందరితోనూ చర్చించి బ్రెగ్జిట్ అవుతామని చెబుతున్నారు.

30 మంది తెలుగు విద్యార్థులకు విముక్తి

హైదరాబాద్: ఫర్మింగ్టన్ ఫేక్ యూనివర్సిటీ వ్యవహారంలో అరెస్టయిన తెలుగురాష్ట్రాల విద్యార్థులలో 30 మందికి విడుదల లభించింది. ఆదివారం ఆ విద్యార్థులు అమెరికానుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని అమెరికా తెలుగు సంఘాల నాయకుడు నవీన్ జలగం మీడియాకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. నకిలీ వీసాల కేసులో అమాయక విద్యార్థులు ఇరుక్కుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా జైళ్లనుంచి విద్యార్థులను విడుదల చేయించేందుకు అమెరికాలో ఉన్న తెలుగు సంఘాలు న్యాయ సహాయం చేస్తున్నాయని తెలిపారు. తన ఫేస్ బుక్ ఐడీకి స్టూడెంట్స్ వివరాలు పంపమని ఆయన కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు కంగారుపడాల్సిన అవసరం లేదని, త్వరలోనే మిగిలిన విద్యార్థులు ఇండియాకు చేరకుంటారని చెప్పారు. ఇమిగ్రేషన్ అధికారులతో మాట్లాడుతున్నామని చెప్పారు. కాగా ఈ కేసులో మొత్తం 130మంది విద్యార్థులు అరెస్టవ్వగా వారిలో అధికులు భారతీయులు కావటం గమనార్హం.

అరెస్టైన విద్యార్థులందరు క్షేమం



అమెరికా: అమెరికాలో అరెస్టైన తెలుగు విద్యార్థులు అందరూ క్షేమంగా ఉన్నట్లు 'ఆటా' అధ్యక్షుడు పరమేశ్ భీంరెడ్డి తెలిపారు. భారతీయ ఎంబసీ అధికారులు, హోంల్యాండ్ సెక్రటరీ అధికారులను కలిసి విద్యార్థులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని తెలిపారు.

ఒకే సెల్లో ఎక్కువ మందిని ఉంచి వారిని హింసిస్తున్నట్లుగా వస్తున్న వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. అక్కడి పోలీసు సిబ్బంది కూడా తమకు సహకరిస్తున్నారని ఆయన వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏదైనా అవసరం అయితే ఆటా హెల్ప్లైన్ నంబర్ 8442827382 ఫోన్ చేయాల్సిందిగా ఆయన కోరారు.

ఆటా, ఇతర సంఘాల తరపున వివిధ ప్రాంతాల్లోని డిటెన్షన్ కేంద్రాల్లో ఉన్న విద్యార్థులను కలిసినట్లు ఆయన వెల్లడించారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు వల పన్ని, నకిలీ వర్సిటీని ఏర్పాటు చేసి విద్యార్థి వీసాలను దుర్వినియోగం చేస్తున్న 130 మంది విద్యార్థులతో పాటు ఎనిమిది మంది దళారులను బుధవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్టయిన విద్యార్థుల్లో ఒక్కరు మినహా అందరూ భారతీయులే. అరెస్టు చేసిన వారిని విచారణ చేసిన అనంతరం స్వదేశానికి పంపిస్తారని, ఎవరూ ఆందోళన చెందకూడదని 'ఆటా' అధ్యక్షుడు తెలిపారు.

భారత్‌లో భాగమే అనుకున్నా: ట్రంప్



వాషింగ్టన్: నేపాల్, భూటాన్ దేశాలు భారత్లో భాగమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ భావించేవారట. అమెరికా నిఘావర్గాలకు చెందిన ఇద్దరు అధికారులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు 'టైమ్' మ్యాగజైన్ శనివారం ఓ కథనాన్ని ప్రచురించింది.

ప్రపంచవ్యాప్తంగా పలు వర్తమాన అంశాలపై అధ్యక్షుడికి అవగాహన కల్పించడానికిగాను నిఘావర్గాలు ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తుంటాయి. ఇందులోభాగంగా చర్చిస్తున్నప్పుడు ఓసారి దక్షిణాసియా మ్యాప్‌ను చూస్తూ భారత్‌లో నేపాల్ భాగమే కదా? అని ట్రంప్ ప్రశ్నించారట. కాదని, అది స్వతంత్ర దేశమని నిఘా అధికారులు బదులిచ్చారు. అయితే భూటాన్ కూడా భారత్‌లో భాగమే కదా! అని ట్రంప్ మళ్లీ తన అజ్ఞానాన్ని బయటపెట్టారట. అది మరో దేశమని నిఘా అధికారులు బదులిచ్చారు.

సైనికులపై జింబాబ్వే మహిళల ఆగ్రహం



జింబాబ్వే: జింబాబ్వే సైనికులు తమపై అత్యాచారం చేశారని కొంతమంది మహిళలు బీబీసీకి చెప్పారు. అర్ధరాత్రుళ్లు ఇంట్లోకి జొరబడి తమపై దాడులు చేస్తున్నారని దేశ వాసులు వాపోతున్నారు. జింబాబ్వే ప్రభుత్వం ఇటీవల ఇంధన సుంకాలను భారీగా పెంచడంతో ప్రజలు నిరసనలకు దిగారు. రోడ్ల పైకి వచ్చి ఆందోళన చేశారు. వారిని అదుపు చేసుందుకు ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దింపింది. అయితే, సైన్యం దౌర్జన్యంగా ఇళ్లలోకి జొరబడి దాడులకు దిగుతోందని దేశ ప్రజలు ఆరోపిస్తున్నారు. రాజ్యం ఓ పద్ధతి ప్రకారం ప్రజలను హింసిస్తోందని ఆ దేశ మానవ హక్కుల సంఘం ఆరోపించింది. 'జింబాబ్వే సైనికులు నా గదిలోకి వచ్చి, నన్ను కొట్టారు. సెక్స్ కావాలని అడిగారు. నేను నిరాకరించడంతో మళ్లీ కొట్టారు' అని బాధిత మహిళ ఒకరు చెప్పారు. అత్యాచారం జరిగిన విషయం ఇంట్లో చెప్పలేదని, పెళ్లి కాకపోవడంతో దీనిపై మౌనంగానే ఉంటానని ఆమె తెలిపారు. 'సైనికులు నన్ను రేప్ చేశారు.. ఎవరికీ చెప్పలేక మౌనంగానే ఉన్నా'. "ఇంట్లోకి చొరబడ్డ మొదటి సైనికుడు నాపై అత్యాచారం చేశాడు.అతని తర్వాత మరో సైనికుడు అలాగే చేశాడు." అని మరో బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. అసలు దేశంలో అర్ధరాత్రి ఏం జరుగుతుందో తెలియడం లేదని, సైన్యం ఇళ్లలోకి చొరబడి ప్రజలపై దాడులకు దిగుతోందని జింబాబ్వే మానవ హక్కుల సంఘం కార్యకర్త బ్లెస్సింగ్ గోరేజన అన్నారు. సామూహిక అరెస్టులు, హింసను నిరసిస్తూ దేశ రాజధాని హరారేలో న్యాయవాదులు నిరసన ప్రదర్శనలు చేశారు. ప్రభుత్వం తీరుపై ప్రతిపక్ష నేత నెల్సన్ ఛమిస విరుచుకపడ్డారు. "నాటి నియంతృత్వ, నిరంకుశ పాలనలోకి మళ్లీ వెళుతున్నాం. నాటి భయం, భీతి మళ్లీ ప్రజల్లో కనిపిస్తోంది." అని ఆయన అన్నారు. మరోవైపు పన్నుల పెంపుపై జింబాబ్వే ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు.

గయానా నుంచి భారత 40వ ఉపగ్రహం



ఫ్రెంచ్: భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)తన 40వ సంచార ఉపగ్రహాన్ని ఫ్రెంచ్‌లోని గయానా నుంచి పంపేందుకు సిద్ధంగా ఉంది. జీశాట్–31ని బుధవారం అంతరిక్షంలోకి పంపనున్నారు. ఉపగ్రహ కాలం పదిహేనేళ్లు. కక్షలో ఉన్న ఉపగ్రహాల ద్వారా సమాచారాన్ని సేకరిస్తూ మరింత స్పష్టతతో సమాచారాన్ని పంపగలదు. 2535కిలోల బరువు గల ఈ ఉపగ్రహాన్ని ఫ్రెంచ్ గయానాలో ఏరియన్–5 అనే రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ ఉపగ్రహం భారతీయ భూభాగం, ద్వీపాల విశేషాలను పంపగలదు. జీశాట్–31తో నెట్‌వర్క్, టెలివిజన్ అప్లయెన్సెస్, డిజిటల్ తదితర ఎలక్ట్రానిక్ రంగాల్లో సేవలందించగలదు.

కనుమరుగు కానున్న టర్కీ!



హసాన్ కీఫ్: టర్కీలోని ఓ పురాతన పట్టణం మరి కొన్నిరోజుల్లో అదృశ్యం కాబోతోంది. జలవిద్యుత్ ప్రాజెక్టు కోసం జలాశయం నిర్మిస్తుండడంతో హసాన్కీఫ్ అనే పట్టణం 90 శాతం నీటమునిగి పోనుంది. ఆగ్నేయ టర్కీ ప్రాంతంలో వ్యవసాయ విద్యుత్ సరఫరాకు ఈ ప్రాజెక్టు నిర్మాణం తప్పనిసరని ప్రభుత్వం చెబుతోంది. ఈ నిర్మాణం కారణంగా 600 ఏళ్ల నాటి అల్ రిజ్క్ మసీదు మినార్లు, 12 వేల ఏళ్ల నాటి నియోలిథిక్ గుహల వంటి సాంస్కృతిక, వారసత్వ కట్టడాలు కూడా కనుమరుగవుతాయి. దీంతో హసాన్ కీఫ్ పరిరక్షించాలంటూ కొందరు ఉద్యమాలు చేస్తున్నారు. వీరు చేస్తున్న ఉద్యమం కేవలం చరిత్రను కాపాడేందుకే కాదు, పర్యావరణ పరిరక్షణకు కూడా. ఎందుకంటే ఈ ప్రాజెక్టు వల్ల నీరు, జంతువులు, వృక్షాలు...ఇలా అన్నింటికీ సమస్యలు తప్పవంటున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడ నివసించే జంతువులతోపాటు, వేలాది వృక్షాలు నీటిలో మునిగిపోనున్నాయి. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గించి ఈ పట్టణాన్ని రక్షిస్తారక్షించాలని కోరుతున్నారు.

తండ్రి తుపాకీతో తల్లిని కాల్చిన బాలుడు

వాషింగ్టన్:అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన ఓ నాలుగేళ్ల కుర్రాడు గర్భవతియైన తన తల్లి(27)ని తుపాకీతో కాల్చి చంపాడు. తండ్రి తలగడ కింద నుంచి తీసుకున్న తుపాకీతో ఈ దారుణానికి పాల్పడ్డాడు. బాలుడి తండ్రి తన తుపాకీని తలగడ కింద పెట్టి టీవీ చూస్తున్నాడు. తుపాకీని బుల్లెట్లతో లోడ్ చేసి పెట్టాడు. నాలుగేళ్ల బాలుడు ఆడుకుంటూ తలగడ కింద ఉన్న తుపాకీనీ చూశాడు. వెంటనే తుపాకినీ తీసుకుని సినిమా తరహాలో తల్లిపైకి గురిపెట్టాడు. అనంతరం ట్రిగ్గర్ నొక్కాడు. వెంటనే తల్లి శరీరంలోకి తూటా చొచ్చుకుపోయింది. ఆవిడ పెద్ద ఎత్తున అరుస్తూ నేలకూలింది. శబ్దం విన్న తండ్రి తన గదిలోకి వచ్చి చూసే సరికి భార్య రక్తపు మడుగులో నేలపై పడి ఉంది. వెంటనే ఆవిడను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చాలకపోవడంతో మరో ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ ఏం లాభం లేకుండా పోయింది. చికిత్స పొందుతూ తనువు చాలించింది. ఆవిడ ఎనిమిది నెలల గర్భవతి అని వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ చేసింది. తుపాకీని సరైన రక్షణ ప్రదేశంలో దాచనందుకు యజమానిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉందని స్థానిక పోలీసులు తెలిపారని స్థానిక మీడియా పేర్కొంది.

పాక్ సైనికాధికారులకు వారెంట్



ముంబయి: 2008లో జరిగిన ముంబయి బాంబు పేలుళ్ల కేసులో ఇద్దరు పాకిస్థాన్ సైనిక అధికారులకు నాన్బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. ఇటీవల అభియోగపత్రం దాఖలు చేసిన ముంబయి సిటీ క్రైం బ్రాంచ్ పోలీసులు పాక్ సైనికాధికారులు మేజర్ అబ్దుల్ రెహమాన్ పాషా, మేజర్ ఇక్బాల్ పేర్లను పేర్కొన్నారు. వారిలో మేజర్పాషా పదవీ విరమణ చేయగా.. మేజర్ ఇక్బాల్ పాకిస్థాన్ నిఘా విభాగం (ఐఎస్ఐ)లో పనిచేస్తున్నట్లు భావిస్తున్నారు. ఇదే కేసులో అబుజిందాల్కు వ్యతిరేకంగా నమోదైన అభియోగాలపై విచారణ చేస్తున్న సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ యార్లగడ్డ, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్ దాఖలు చేసిన పిటీషన్ను స్వీకరించారు. ముంబయి బాంబు పేలుళ్లలో ఉగ్రవాదులతోపాటు దాయాది సైనిక ప్రమేయం ఉందన్న భారత్ వాదన.. లష్కరే తోయిబా ఉగ్రవాది డేవిడ్ కొలెమాన్ హెడ్లీ వాంగ్మూలం ద్వారా నిరూపితమైనట్లు చెప్పారు.

ఆ చేప ఒడ్డుకొస్తే సునామీ వస్తుందా?



జపాన్: ఓ చనిపోయిన చేపను చూసి యావత్ జపాన్ వణికిపోతోంది. దాదాపు 11 మీటర్లుండే ఆ చేప... జపాన్ వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వారం రోజుల్లో ఇలాంటివి మూడు చేపలు తీరానికి కొట్టుకురావడంతో... జపాన్ ప్రజల్లో ప్రాణ భయం మరింత తీవ్రమైంది. భూకంపం విధ్వంసం సృష్టిస్తుందని హడలెత్తుతున్నారు. సునామీ ముంచెత్తుందన్న భయంతో ప్రాణాలరచేత పట్టుకొని జీవిస్తున్నారు. అసలు ఈ చేపకు సునామీకి లింకేటి?.

ఆ భారీ చేప పేరు ఓర్ ఫిష్. సముద్ర పాముగా కూడా పిలుస్తారు. పొడవాటి శరీరం, ఎర్రటి మొప్పలు, వెండిలా మెరిసే చర్మం కలిగి ఉంటుంది. ఈ చేపను సముద్ర దేవుడి దూతగా భావిస్తారు జపాన్ ప్రజలు. ఇవి నీటి అడుగున 200 మీ. నుంచి కిలోమీటర్ లోతన మాత్రమే ఇవి జీవిస్తాయి. అంత అడుగుభాగాన సంచరించడంతో మత్స్యకారుల వలకు అస్సలు చిక్కవు. ఇలాంటిది ఇటీవల ఓర్ఫిష్లు వరుసగా ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయి. తొయామా తీరంలో రెండు ఓర్ఫిష్లు మత్స్యకారులకు కనిపించాయి. అంతకు ముందు మరో ఐదు చేపలు కూడా ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. ఈ సీజన్లో మొత్తం ఏడు చేపలు కనిపించాయి. ఓర్ఫిష్ చేపలు తీరానికి కొట్టుకొచ్చినా మత్స్యకారుల వలకు చిక్కినా జపాన్ ప్రజలు భయపడితారు. ఎందుకంటే ఇవి తీరానికి వస్తే ఏదో ప్రకృతి విపత్తు సంభవిస్తుందని వాళ్లు విశ్వసిస్తారు.

సముద్ర గర్భంలో భూకంపం వస్తే వీటికి ముందే తెలిసిపోతుందట..! సునామీ పరిస్థితులు తలెత్తినా ఓర్ఫిష్ చేపలు పసిగడతాయట..! ప్రకృతి విపత్తు వచ్చినప్పుడు మాత్రమే అవి నీటి పైభాగానికి వస్తాయని జపాన్ వాసులు నమ్ముతారు. ఈ నేపథ్యంలో తీరానికి భారీ చేపలు కొట్టుకురావడంతో.. మళ్లీ సునామీ వస్తుందేమోనన్న భయంతో అక్కడి ప్రజలు వణికిపోతున్నారు. 2010లో సుమారు 10 ఓర్ఫిష్లు సముద్ర ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. ఆ తర్వాత కొన్ని నెలల్లోనే 2011 మార్చిలో జపాన్లో భారీ భూకంపం వచ్చింది. సునామీ విధ్వంసానికి సుమారు 19వేల మంది చనిపోయారు. ఫుకుషిమా న్యూక్లియర్ ప్లాంట్ ధ్వంసమైంది.

ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని జపాన్ వాసులు భావిస్తున్నారు. ఐతే అధికారులు మాత్రం ఎలాంటి భయాందోళనలు అవసరం లేదంటున్నారు. సునామీ పరిస్థితులు ఆ చేపలకు ముందే తెలుస్తుందన్న ప్రచారానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని కొట్టిపారేస్తున్నారు.



క్రిష్ .. అసలేం జరుగుతోంది?

అక్కినేని అఖిల్ నటించిన తాజా చిత్రం 'మిస్టర్ మజ్ను'. 'తొలిప్రేమ' చిత్రంతో విజయం సాధించిన వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయవంతంగా రన్ అవుతోంది. భారీ చిత్రాల నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అఖిల్ నాలుగవ సినిమా ఎవరితో చేయనున్నాడు అన్న దానికి ఆసక్తికర చర్చ సాగుతోంది. శ్రీను వైట్లతో అఖిల్ సినిమా ఉంటుందని, శ్రీను వైట్ల కాదు.. ఆది పినిశెట్టి సోదరుడు సత్య ప్రభాస్ పినిశెట్టితో చేయనున్నారనే టాక్ వచ్చింది. తాజాగా దర్శకుడు క్రిష్‌తో అఖిల్ సినిమా అంటూ ప్రచారం జరుగుతోంది. అఖిల్ నాలుగో సినిమా విషయమై క్రిష్‌తో కింగ్ ముచ్చటించారని ప్రచారం సాగుతోంది. మహానాయకుడు రిలీజ్ తర్వాత ఈ ప్రాజెక్ట్ పై క్లారిటీ వస్తుందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో షాకింగ్ ఏంటంటే ఈ వార్త విన్న క్రిష్ కూడా షాక్ అయ్యారట. అఖిల్‌తో సినిమా ఏదీ ఇంకా ఫైనల్ కాలేదని క్రిష్ చెబుతున్నారట. ఇక మరోవైపు మణికర్ణిక చిత్రానికి 70 శాతం క్రెడిట్ క్రిష్‌కే దక్కాల్సినది .. కంగన క్లీన్ స్వీప్ చేసేస్తోందంటూ ప్రచారం సాగుతోంది.



ముద్ర కాదు.. అర్జున్ సురవరం

నిఖిల్ 'ముద్ర' టైటిల్ మారింది. నిఖిల్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రానికి 'అర్జున్ సురవరం' టైటిల్‌ని ఫైనల్ చేశారు. ఈ చిత్రానికి ముందుగా ముద్ర టైటిల్ ఖరారు చేసినా.. ఇప్పుడు ఆ టైటిల్ ను మార్చామని చిత్ర యూనిట్ తెలిపింది. తాజాగా ఈ చిత్ర టైటిల్ లోగో విడుదలైంది. ఈ టైటిల్ లాంచ్ కార్యక్రమంలో హీరో నిఖిల్, హీరోయిన్ లావణ్య త్రిపాఠి, దర్శకుడు సంతోష్, నిర్మాతలు పాల్గొన్నారు. యూరప్ లో చివరి పాట చిత్రీకరణతో షూటింగ్ పూర్తి చేసుకుంది ఈ చిత్రం.

పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది అర్జున్ సురవరం. మార్చి 29న ఈ చిత్రం విడుదల కానున్నట్లు ప్రకటించారు చిత్ర యూనిట్. ఇందులో జర్నలిస్ట్ గా నటిస్తున్నారు నిఖిల్. టిఎన్ సంతోష్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్యామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వెన్నెల కిషోర్, పోసాని కృష్ణమురళి, నాగినీడు, ప్రగతి, సత్య, తరుణ్ అరోరా, రాజా రవీంద్ర ఈ చిత్రంలో సహాయ పాత్రల్లో నటిస్తున్నారు. ఔరా సినిమాస్ పివిటి, మూవీ డైనమిక్స్ ఎల్ఎల్‌పి బ్యానర్స్ పై కావ్య వేణుగోపాల్, రాజు కుమార్ నిర్మిస్తున్నారు.

బి మధు అర్జున్ సురవరం చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నిఖిల్ సిద్ధార్థ్, లావణ్య త్రిపాఠి, వెన్నెల కిషోర్, పోసాని కృష్ణమురళి, ప్రగతి, సత్య, తరుణ్ అరోరా, రాజా రవీంద్ర, నాగినీడు.. తదితరులు నటించారు. ఈ చిత్రానికి సమర్పకుడు: బి మధు, నిర్మాతలు: కావ్య వేణుగోపాల్ మరియు రాజ్ కుమార్, నిర్మాణ సంస్థలు: ఔరా సినిమాస్ పివిటి మరియు మూవీ డైనమిక్స్ ఎల్ఎల్పి, సినిమాటోగ్రఫీ: సూర్య , సంగీతం: స్యామ్ సిఎస్, ఆర్ట్ డైరెక్టర్: సాహి సురేష్, ఫైట్స్: వెంకట్, క్యాస్ట్యూమ్ డిజైనర్: రాగా రెడ్డి, కథ, స్క్రీన్ ప్లే, దర్శకుడు: టిఎన్ సంతోష్.

ఎస్పీ బాలుకు మాతృవియోగం



తిరుపతిలో ఇటీవల నిర్వహించిన ఓ చర్చా కార్యక్రమంలో రాజకీయ నాయకులపై, కథానాయికలపై సంచలన వ్యాఖ్యలు చేశారు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. ఆ విషయం మర్చిపోకముందే ఆయన ఇంట ఓ విషాదం చోటుచేసుకుంది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సొంతూరు నెల్లూరు అన్న విషయం తెలిసిందే. ఆయన చెన్నైకి మకాం మార్చినా అతని తల్లిదండ్రులు చాలా కాలంగా నెల్లూరులోనే ఉంటున్నారట. దాదాపు అన్ని భాషల్లో గాన గాంధర్వుడిగా పేరు తెచ్చుకున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తల్లి శకుంతలమ్మ (89) సోమవారం ఉదయం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో తుది శ్వాస విడిచారు.

ప్రస్తుతం ఓ సంగీత కచేరి నిమిత్తం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం లండన్‌లో ఉన్నారు. అయితే తల్లి మరణవార్త తెలిసిన వెంటనే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం హుటా హుటిన స్వగ్రామానికి బయలు దేరారని తెలిసింది. సోమవారం సాయంకాలానికి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నేరుగా నెల్లూరుకు చేరుకుంటారని, ఆ తరువాతే ఆయన తల్లి అంత్యక్రియలు జరుగుతాయని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం బాలు నెల్లూరు చేరుకుంటారు. ఆయన చేరుకునే సరికి రాత్రి అయ్యే అవకాశం వుంది కాబట్టి శకుంతలమ్మ అంత్యక్రియలు నేడు నెల్లూరులో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. బాలు తల్లి మృతిపట్ల పలువురు దక్షిణాది చలన చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు

బ్రిట్నీస్పియర్స్‌వా? జెన్నిఫర్‌వా?



ఆలియావా? అసలు నీవు.. జెన్నిఫర్ లోపెజ్‌వా? అంటూ ఒకటే తెగ ఇదైపోతున్నారు బోయ్స్. పాప్ స్టార్.. ర్యాప్ స్టార్.. రాక్ స్టార్ .. స్టార్ ఎవరైనా ఈ అమ్మడి ముందు దిగదుడుపే!! అగ్ర నిర్మాత మహేష్ భట్ వారసురాలిగా సినీరంగంలో ప్రవేశించిన ఆలియా భట్ ఇంతింతై అన్న చందంగా పెద్ద స్టార్ గా ఎదిగేసింది. రాజీ సినిమాతో 100కోట్ల క్లబ్ నాయికగా సంచలనం సృష్టించింది. ఈ యంగ్ బ్యూటీకి ప్రపంచవ్యాప్తంగా వీరాభిమానులు ఉన్నారు. త్వరలోనే తాను ప్రేమించిన లవర్ బోయ్ రణబీర్ కపూర్ ని పెళ్లాడేందుకు రెడీ అవుతోందన్న ప్రచారం ఉంది. లేటెస్టుగా ఆలియా ఇన్ స్టాగ్రమ్ లో షేర్ చేసిన ఓ ఫోటో ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఇందులో పాప్ ప్రపంచాన్ని ఏలిన టాప్ స్టార్స్ బ్రిట్నీ స్పియర్స్, లేడీ గాగ, జెన్నిఫర్ లోపెజ్ రేంజులో కనిపించింది ఈ యంగ్ బ్యూటీ. బ్లాక్ & వైట్ స్టన్నింగ్ కాంబినేషన్ డ్రెస్ లో మతి చెడగొట్టింది. కెరీర్ పరంగా చూస్తే.. ఆలియా ప్రస్తుతం బాలీవుడ్ లో పలు క్రేజీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. కళాంక్, బ్రహ్మాస్త్ర, గల్లీబోయ్ చిత్రాల్లో ఈ అమ్మడు నటిస్తోంది. ఇవన్నీ 2019 – 20 సీజన్‌లో రిలీజ్ కి రెడీ అవుతున్నాయి. ఇప్పుడున్న స్టార్స్ లో ఇండియా బెస్ట్ యంగ్ హీరోయిన్ గా వెలిగిపోతోంది ఈ అమ్మడు.

వాల్మీకిలో తెలుగమ్మాయి



యంగ్ డైరెక్టర్ హరీష్ శంకర్ కోలీవుడ్ సూపర్ హిట్ మూవీ జిగర్తండా ను తెలుగులో రీమేక్ చేయనున్న విషయం తెలిసిందే. 'వాల్మీకి' అనే టైటిల్ తో రానున్న ఈ చిత్రం ఇటీవలే ఘనంగా ప్రారంభమైంది. తమిళంలో బాబీ సింహ పోషించిన పాత్రలో వరుణ్ తేజ్ నటించనుండగా సిద్దార్థ పాత్రలో శ్రీ విష్ణు నటించనున్నాడని సమాచారం. ఇక ఈ చిత్రంలో హీరోయిన్‌గా తెలుగు అమ్మాయి ఇషా రెబ్బ ను తీసుకోవాలనుకుంటున్నారు అయితే ఇంతకు ముందు కన్నడ బ్యూటీ రష్మిక కూడా కథానాయిగా నటించనుందని వార్తలు వచ్చాయి. మరి ఈ ఇద్దరిలో ఎవరిని ఫైనల్ చేస్తారో చూడాలి. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ నిర్మించనున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నారు. ఈ ఏడాది చివర్లో ఈచిత్రాన్ని విడుదలచేసేలా సన్నాహాలు చేస్తున్నారు. ఆయనంక బోస్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిచనున్నారు.



'హనీ ఈజ్ ది బెస్ట్'

హనీ ఈజ్ ద బెస్ట్.. ఈ డైలాగ్ వినగానే వెంటనే ఎఫ్ 2 సినిమా అందులోని మెహ్రీన్ పాత్ర గుర్తుకు వస్తుంది కదా. సంక్రాంతికి వచ్చిన ఈ చిత్రం ఏ స్థాయి లో విజయం సాధించిందో అందరికీ తెలుసిందే.100 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ చిత్రం ఇప్పటికీ భారీ హిట్ టాక్‌తో భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది.ఈ చిత్రం భారీ విజయం తరువాత ఎఫ్3 చిత్రాన్ని తీయాలన్న నిర్ణయానికి వచ్చారు దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత దిల్ రాజు.. ఎఫ్2లో నటించిన తారాగణాన్నే తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారట. అయితే ఎఫ్2 కంటే.. ఎక్కువ రెమ్యునరేషన్‌ను ఎఫ్3కి అడుగుతున్నారట. ఇతరుల మాటేమో కానీ, పంజబీ బ్యూటీ మెహ్రీన్ కాస్త ఎక్కువగా రెమ్యునరేషన్ అడుగుతోందట. దీనికి దిల్ రాజు ఒప్పుకోవడం లేదట. దీంతో మెహ్రీన్ కు కోపం వచ్చి అడిగిన పారితోషికం పెంచితేనే ఎఫ్3లో నటిస్తానని చెబుతోందట.



మన్మధుడు సరసన పాయల్

టాలీవుడ్ చిత్రం మన్మథుడు అక్కినేని నాగార్జున నటించిన మన్మథుడు సినిమాకు రీమేక్ వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ఆరెక్స్ 100 హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ హీరోయిన్‌గా నటించనుందని టాక్ వినిపిస్తోంది. నాగార్జున కెరీర్‌లో చెప్పుకోదగిన సినిమాల జాబితాలో మన్మథుడుకు ప్రత్యేక స్థానముంది. ఈ సినిమా సీక్వెల్ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటోంది. ఇందులో నాగార్జున హీరోగా.. సొంత బ్యానర్లో సినిమా రూపుదిద్దుకుంటోంది. రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు నటించనున్నారు. అందులో ఒకరు ఆరెక్స్ 100 బ్యూటీ పాయల్ రాజ్‌పుత్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం.

ఆరెఎక్స్ 100 సినిమాతో పాయల్ యూత్‌కి బాగా కనెక్ట్ అయిన నేపథ్యంలో మన్మథుడు2కి ఆమె బాగా యాప్ట్ అవుతుందని సినీ జనం అంటున్నారు. ఇక నాగ్ సరసన నటించే మరో హీరోయిన్ ఎవరనేదాని పై ప్రస్తుతం వాడీవేడిగా చర్చ సాగుతోంది.



ఆ టైటిల్‌లోనే సస్పెన్స్

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీ లక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్ పై విశ్వనాథ్ తన్నీరు నిర్మించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'యమ్6'. ఈ చిత్రం ఫిబ్రవరి 8న విడుదల కానుంది. విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇదొక హారర్, కామెడీ, థ్రిల్లర్. క్వాలిటీలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించాం. దర్శకుడు జైరాం వర్మ చెప్పిన ఇంట్రెస్టింగ్ పాయింట్ నచ్చి ఈ సినిమా నిర్మించాను. ఈ చిత్రానికి కథే హీరో.

అందరికీ నచ్చే కథాంశంతో ఈ సినిమా రూపొందింది. ఇలాంటి సినిమాకి ఆర్.ఆర్ చాలా ఇంపార్టెంట్. దానికి తగ్గట్టుగానే ఈ సినిమాకి ఆర్ఆర్ బాగా కుదిరింది. ఈ సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు ఎక్కడా బోర్ ఫీల్ అవ్వరు. ఉత్కంఠకు గురి అవుతారు. అనుకోకుండా వచ్చే మలుపులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. అరకు, మంగుళూరులోని సుందరమైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. యమ్6 అనే డిఫరెంట్ టైటిల్ ఎందుకు పెట్టామో ఈ సినిమా చూస్తే తెలుస్తుంది. నా స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నాం. ఆ వివరాలను త్వరలో తెలియజేస్తాం అన్నారు.

అన్యాయాల్ని ప్రతిఘటించే సీమ రాజా

సాయికృష్ణ ఫిలింస్ బ్యానర్ పై లక్ష్మీ పెండ్యాల సమర్పణలో సాయికృష్ణ పెండ్యాల నిర్మిస్తున్న చిత్రం సీమరాజా. శివకార్తికేయ, కీర్తి సురేష్, సమంత ప్రధాన తారాగణం. ఈ చిత్రం డబ్బింగ్ పనులు పూర్తి చేసుకుని క్లీన్ యు సర్టిఫికెట్‌తో ఫిబ్రవరి 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో నిర్మాత సాయికృష్ణ పెండ్యాల మాట్లాడుతూ...



నేను డిస్ట్రిబ్యూర్ నుంచి ప్రొడ్యూసర్ అయ్యాను. నిర్మాతగా ఇది నా 4వ చిత్రం. గతంలో నేను మూడు చిత్రాలు నిర్మించాను. దండుపాళ్యం 3, కురుక్షేత్రం, మారి 2 చిత్రాలను నిర్మించాను. ఈ చిత్రం కొనడానికి ప్రధాన కారణం. నా ఫ్రెండ్ ఒకరు ఈ సినిమాలోని ఒక డైలాగ్ పంపించారు. ఆ డైలాగ్ నన్ను బాగా ఇన్‌స్పైర్ చేసింది. మనిషి బ్రతకడానికి మిత్రుడు ఎంత ముఖ్యమో శత్రువు కూడా అంతే ముఖ్యం అన్న డైలాగ్ చాలా నచ్చింది. ఆ డైలాగ్ నాలో తెలియని ఒక ఫీలింగ్‌ని తెచ్చింది. ఆ డైలాగ్‌తో సినిమా చెయ్యడానికి సిద్ధపడ్డానికి ఒకేసారి విడుదల చేద్దామనుకున్నా కాకపోతే అదే సమయంలో సమంతవి రెండు సినిమాలు ఉండడం వలన చెయ్యలేకపోయాను. దాని తర్వాత డబ్బింగ్ అన్నీ బాగా నేషనలైజ్డ్‌గా కుదిరింది. చంద్రబోస్, వెన్నెలకంటిగారితో పాటలు రాయించాము. ఈ చిత్రంలో మొత్తం ఆరు పాటలు. శ్రేయా ఘోషల్‌తో ఒక పాట పాడించాము. ప్రతిదీ హై టెక్నీషియన్లతో సినిమా చెయించాం. మీకు ఎక్కడా కూడా డబ్బింగ్ సినిమా చూస్తున్నాము అన్న ఫీలింగ్ కలగదు. కేవలం డబ్బింగ్కే 60 లక్షలు ఖర్చుపెట్టాను. ఒక స్ట్రయిట్ తెలుగు ఫిల్మ్ చూసిన ఫీలింగ్ రావాలని అంత ఖర్చుపెట్టాను. వీడియో గీతాన్ని విడుదల చేస్తే దాదాపు 10లక్షల వ్యూస్ వచ్చాయి. ట్రైలర్ని ఈ రోజు ఉదయం విడుదల చేశాం. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మన తెలుగుకి కనెక్ట్ అయ్యే చాలా ఎమోషన్స్ ఉన్నాయి. కీర్తిసురేష్, సమంత ఉన్నారు. కీర్తిసురేష్ యువరాణి గెటప్ ఒక 30 నిమిషాల పాటు ఉంటారు సినిమాలో. సమంత మెయిన్ హీరోయిన్ సినిమా మొత్తం టీచర్‌గా చేస్తుంది. నెపోలియన్‌గారు హీరో ఫాదర్ క్యారెక్టర్ హీరో శివకార్తికేయన్. గతంలో దిల్రాజుగారు రెమో చిత్రంతో ఇక్కడ పరిచయం చేశారు. రెండవ చిత్రం మాది. మెయిన్గా ఇందులో చెప్పుకోదగ్గది సిమ్రన్గారిని ఇప్పటి వరకు ఒక మంచి గ్లామరస్ హీరోయిన్‌గా చూశారు. మొట్ట మొదటి సారి విలన్‌గా చేశారు. ఈ చిత్రంలో విలన్ సిమ్రన్ చాలా బాగా చేశారు. సిమ్రన్ చెప్పే డైలాగ్ హైలెట్‌గా ఉంటుంది. మీరు పంచెకట్టే మగోళ్ళయితే నేను చీర కట్టిన మగోడ్ని అంటది సూపర్ డైలాగ్. సినిమాలో చాలా పవర్‌ఫుల్ డైలాగ్స్ ఉంటాయి. తెలుగులో డబ్బింగ్ చిత్రాలకు అవార్డులు ఇస్తారో ఇవ్వరో నాకు తెలియదు కాని ఒకవేళ ఇవ్వవలసి వస్తే సిమ్రన్ గారికి కనీసం 10 అవార్డులైనా వస్తాయి. కథలోకి వస్తే అల్లరి చిల్లరిగా తిరిగే రాజు కుటుంబీకుడు హీరో. రాజు మొత్తం జాగ్రత్తగానే పని చేసుకుంటూ వెళతారు. ఫుల్‌లెంగ్‌తో కమర్షియల్ మూవీ. తమిళ్లో 3 గంటల చిత్రం. శివకార్తికేయన్‌గారిది బాహుబలి రేంజ్‌లో ఫైట్లు, గుర్రాలు అన్నీ ఉంటాయి. కాని నేను ఇక్కడ అవన్నీ తీసేశాను. కేవలం రెండు గంటలు మాత్రమే పెట్టాను. అసలు రాజు అనే వాడు ఎలా ఉంటాడు ఏంటి అన్నది ఫ్లాష్‌బ్యాక్ ఓపెన్ అవుతుంది. సిమ్రన్ విలన్ లాల్ మళయాళం యాక్టర్ బాగా చేశారు.

సమంత కర్ర ఫైట్

మొత్తానికి ఊరికి న్యాయం చేసే రాజు అవుతాడు. రిలీజ్ మొత్తం హ్యాపీ . బిజినెస్‌లో ఎటువంటి ఇబ్బంది లేదు. 18 ఏళ్ళనుంచి నాది ఇదే పని. నాకు స్టేట్‌లో ఉన్న 2,724 థియేటర్లు తెలుసు ప్రతి జిల్లా డిస్ట్రిబ్యూషన్ తెలుసు. ఈ చిత్రం దాదాపు 300 నుంచి 400 థియేటర్లలో విడుదల చేస్తున్నాం. సినిమాల్లో ఎప్పుడూ ఎవరూ ఎవరికీ హెల్ప్ చెయ్యరు ఎవరి పని వాళ్లు అలా చేసుకుంటూ వెళ్ళమే. మనం ఒక పది మెట్లు ఎక్కుతున్నామంటే మనల్ని వెనక్కి లాగే వాళ్ళే ఎక్కువ. నైజాం నేనే చేస్తా మొత్తం. ఈ చిత్రంలో సమంత కర్రఫైట్ కూడా ఉంటుంది... అని తెలిపారు.

అన్యాయాన్ని ప్రశ్నిస్తా

నటుడు, దర్శకనిర్మాత పి.సత్యా రెడ్డి తన తనయుడు మనీష్ బాబుని హీరోగా పరిచయం చేస్తూ .. రాజా వన్నెం రెడ్డి దర్శకత్వంలో జనం ఎంటర్ టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మిస్తోన్న చిత్రం ప్రశ్నిస్తా. ఈ చిత్రం లోగో లాంచ్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ లాబ్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాతలు బెల్లంకొండ సురేష్, సి.కళ్యాణ్, టి.ప్రసన్నకుమార్, దాసరి కిరణ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, అభిషేక్ అగర్వాల్, హీరో మనీష్ బాబు, హీరోయిన్స్ అక్షిత, హసీనా మస్తాన్ మీర్జా, దర్శకుడు రాజా వన్నెం రెడ్డి, మాటల రచయిత రాజేంద్ర కుమార్, సంగీత దర్శకుడు వెంగి, సతీష్ రెడ్డి, శేషు బాబు, శివ కుమార్ పాల్గొనగా నిర్మాత సత్యారెడ్డి బొకేలతో అతిథుల్ని స్వాగతించారు.. అనంతరం...నిర్మాత పి.సత్యారెడ్డి మాట్లాడుతూ... ఆరోజు కళ్యాణ్ గారు అన్న మాట నిజం అయ్యింది. రాజా వన్నెం రెడ్డి మా అబ్బాయిని హీరోగా చేస్తానని 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి టైమ్' లో మాట ఇచ్చారు. ఇప్పుడు ఆయన మాట మీద నిలబడి మంచి కథతో అద్భుతమైన సినిమా చేశారు. సమాజంలో జరుగుతున్న అన్యాయం, అక్రమాలు, ప్రభుత్వ పాలసీలు మీద ఒక స్టూడెంట్ లీడర్ ఏ విధంగా పోరాడారు.. ఎలా ప్రశ్నించాడు అనేది కథ. మా అబ్బాయిని, ఈ సినిమాని అందరూ ఆదరించి సక్సెస్ చెయ్యాలని కోరుకుంటున్నాను.. అన్నారు. దర్శకుడు రాజా వన్నెంరెడ్డి మాట్లాడుతూ... ఇండస్ట్రీలో గ్రాస్పింగ్ పవర్ ఉన్న హీరోల్లో కృష్ణ గారి పేరు చెప్తారు. అలా ఈ చిత్రం లో పెద్ద పెద్ద డైలాగ్స్ మనీష్ చెప్పాడు. ఒక కసితో ఎక్స్ ట్రార్డినరీగా నటించాడు మనీష్. అసలు ఎక్స్ పెక్ట్ చేయలేదు. ప్రెజెంట్ ట్రెండ్‌కి తగ్గట్లుగా ఈ సినిమా ఉంటుంది. సత్యారెడ్డి క్వాలిటీకి వెనకాడకుండా ఈ సినిమాని నిర్మించారు. డెఫినెట్‌గా మనీష్ మంచి హీరో అవుతాడు.. అన్నారు. హీరో మనీష్ బాబు మాట్లాడుతూ.. అంచనాలకు తగ్గట్లుగానే సినిమా ఉంటుంది అన్నారు. అక్షిత, హసీనా మస్తాన్ మీర్జా అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు.





వాల్‌నట్స్ ఉపయోగాలు..

- రోజూ వాల్నట్స్‌ని తీసుకుంటే గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాల్‌నట్స్‌లో ఎక్కువ యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి అన్ని రకాల హార్ట్ డిసీజెస్‌ను ఎదుర్కోవడానికి సహాయపడుతాయి.
- వాల్‌నట్స్ రోజూవారీ ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవాలి. ముఖ్యంగా మహిళల రెగ్యులర్ డైట్‌లో. మహిళల్లో టైప్3 డయాబెటిస్‌ను నివారించే లక్షణాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి.
- ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్, డయాబెటిస్ వంటి వ్యాధులతో పాటు బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది.
- వాల్ నట్ మెదడు మీద ఎక్కువగా ప్రతిస్పందిస్తుంది. వాల్ నట్స్ విటమిన్–ఇ, ఫ్లేవనాయిడ్స్‌ను కలిగి ఉండి, జ్ఞాపకశక్తి లోపానికి గురిచేసే, హానికరమైన ఫ్రీరాడికల్స్, కెమికల్స్‌ని నాశనం చేస్తుంది.
- గర్భిణీ స్త్రీలు వాల్ నట్స్‌ని నిత్యం తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. వీటిలో ఉండే కాంపౌండ్స్ వల్ల కడుపులో పెరిగే పిండానికి ఎలాంటి అలర్జీలు కలగకుండా వ్యాధినిరోధకతను పెంచుతాయి.

పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర



పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు పాత్ర ప్రధానమైనది. వారి ఎదుగుదలపై సరైన శ్రద్ధ చూపితేనే జీవితం సాఫీగా సాగుతుంది. కుదరట్లేదని బయటి వాళ్లకి అప్ప చెప్తే పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేము. అమ్మ లాలింపు, తండ్రి దండిపు, తాతా నానమ్మల ఓదార్పు ఇలా అన్ని కలగలిస్తేనే పిల్లలకు జీవితం విలువ తెలుస్తుంది. జీవితంపై ఆసక్తి కలిగి మంచి నడవడికతో ముమ్ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

చిన్నపిల్లల్లో క్రమశిక్షణ ఎందుకు లోపిస్తుంది? దీనికి బాధ్యులెవరు? బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు చేసుకునే తల్లులు కూడా పిలల క్రమశిక్షణ విషయంలో ఎందుకు విఫలమవుతున్నారు. ఈ విషయాలన్నీ లోతుగా పరిశీలిస్తే, క్రమశిక్షణపై సరియైన అవగాహన లేకపోవడం, అజమాయిషీలో అలసత్వం, పిల్లల శక్తిని వయస్సును తప్పుగా అంచనా వేయడం లాంటి అనేక ముఖ్యమైన అంశాలు కనబడతాయి. వాటిని ఎలా సరిదిద్దాలంటే...

క్రమశిక్షణ అంటే...

పెద్దలుగా చేసే ఈ చిన్న పొరపాట్లు తిట్టడం, కొట్టడం, అరవడం, విసుక్కోవడం, ఇరిటేట్ అవడం ఇవన్నీ డిసిప్లేన్ కాదు. ఇలాంటి చర్యలు పిల్లల్లో కాదు, సమాజంపైనే సరియైన అవగాహన ఏర్పడదు. ఏమి చెయ్యాలో, ఎలా చెయ్యాలో అర్థమయ్యేలా చెప్పడమే నిజమైన క్రమశిక్షణ. అది కూడా పిల్లల మనసుకు హత్తుకునేలా, వారికి అర్థమయ్యేలా నెమ్మదిగా, విపులంగా చెప్పాలి. ఇతరుల మనోభావాలను గౌరవిచడం, ఎవరి మనస్సు నొప్పించకుండా ప్రవర్తించే అలవాట్లను నేర్పించాలి. ఇవేవీ చేయకుండా ఫలానా పని సరిగా చెయ్యలేదని పిల్లల్ని నిందించడంలో అర్థం లేదని పెద్దవాళ్ళు గుర్తించాలి.

పెద్దల పర్యవేక్షణలోనే పిల్లల పెంపకం..

పిల్లల నడవడికను తల్లిదండ్రులు ఎప్పుడూ పర్యవేక్షిస్తూ ఉండాలి. ముఖ్యంగా ఉద్యోగం చేసే తల్లులు ఈ విషయంలో జాగ్రత్తతో వ్యవహరించాలి. గతంలో అయితే స్త్రీలు ఇంటికే పరిమితమై పిల్లల ఆలనా పాలన చూసుకునేవారు. కానీ



ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇద్దరూ పనిచేస్తేనే ఇల్లు గడుస్తుంది. అందుకే ఇప్పుడు క్రచ్‌లు పిల్లల బాధ్యత తీసుకుంటున్నాయి. క్రచ్‌లు ఎంత బాధ్యత వహించినా మన బాధ్యతను కూడా మరవకూడదు కదా.. అందుకే ఉద్యోగస్తులైన తల్లిదండ్రులల్లో ఎవరికి తీరిక దొరికినా మధ్యలో అప్పుడప్పుడు క్రచ్‌కి వెళ్తూ ఉండాలి. తమ పిల్లల ప్రవర్తన గురించి, క్రమశిక్షణ గురించి స్వయంగా అడిగి తెలుసుకోవాలి. శిక్షణ ఎలా ఉందో తెలుసుకొని, నచ్చకపోతే మరొక చోటుకి మార్చాలి.

ముందు రోజుల్లో...

అమ్మమ్మల కాలంలో అయితే ఇంట్లో తాత, మామ్మ లాంటి, నానమ్మల్లాంటి పెద్దవాళ్ళు ఉండేవారు. వాళ్లే పిల్లలను చూసుకునేవారు. నేటి ఒంటరి జీవితాల్లో ఇంటిని, పిల్లలను చూసుకునే వారే లేరు. పెద్దలు లేని చోట ఇలాంటి ఇబ్బందులు సహజం. చిన్న కుటుంబాలు ఎక్కువవుతున్న ఈ కాలంలో పెద్ద వాళ్ళ అవసరం ఎంతైనా ఉంది. వారి అనుభవాలు పిల్లల ఆలనాపాలనాకు ఎంతో ఉపయోగపడతాయి. సరైన ప్రవర్తన, క్రమశిక్షణ అలవడటానికి పెద్దవాళ్ళ అనుభవం, సహకారం చాలా అవసరం. ఒకే సంతానం అయినప్పుడు ఎక్కువ గారాబం చేస్తారు. గారాబం పరిమితి దాటితే క్రమశిక్షణ గాడి తప్పుతుంది. దేనికైనా ఒక హద్దు తప్పనిసరిగా ఉండాలి.

యాంత్రికంగా జీవించడం...

తల్లిదండ్రులు యాంత్రిక జీవితంలో ఇల్లు, ఆఫీస్ తప్పితే ఎలాంటి సుఖసంతోషాలు లేకుండా పసి పిల్లలు అడిగిందల్లా సమకూర్చడం ఎక్కువ అయ్యింది నేటి రోజుల్లో. కానీ రాను రానూ ఈ సమస్య ఎక్కువ అవుతుంది. ఎందుకంటే పిల్లలు పెద్దవుతున్న కొద్దీ వారి కోరికలు అవసరాల ఖరీదు పెరుగుతుంది. పెంకితనమూ, మొండితనమూ పెరుగుతుంది. అందుకే మేము అడిగేవన్నీ అమ్మానాన్నా కొనరనే గ్రహింపు పిల్లలకు మొదటి నుంచే కలిగేలా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి. పిల్లలకు డబ్బు విలువ తెలియజేయాలి. వారు అడగ్గానే ఇవ్వకుండా దేనికోసమో అడిగి అవసరం తెలుసుకొని ఇవ్వాలి. అలాగని మరీ వారిని ఎందుకు దేనికీ అంత అవసరమా అని అనుమానించినట్టు మాట్లాడకూడదు. అది మీకు అనవసరమనిపిస్తే దాని వలన కలిగే లాభా నష్టాల గురించి అవసరమైతే ఇంటి పరిస్థితుల గురించి కూడా చెప్పాలి. అప్పుడే పిల్లల ప్రతికూల అంశాలపై అవగాహన ఏర్పడుతుంది.





మెరిపించే సౌందర్యానికి
తీసుకోవాల్సిన ఆహారాలు..

అందంగా కనిపించడానికి ముఖ్యమైంది చర్మం. ఎలాంటి మచ్చలు, మొటిమలు లేకుండా ప్రకాశవంతంగా మెరుస్తూ కనిపించాలంటే ముఖానికి వాడే క్రీములు, పౌడర్‌లో కాదు జాగ్రత్తలు తీసుకోవాల్సింది. శరీరానికి తీసుకునే ఆహారాలను బట్టే చర్మం నిగారింపును సంతరించుకుంటుంది. అందుకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలేమిటో ఓసారి చూద్దామా.. స్త్రీ చర్మం నిగనిగలాడుతూ ఉండాలని కోరుకుంటుంది. అయితే కాలుష్యం, ఎండ మొదలైన వాటి బారిన పడి చర్మం కమిలిపోవడం, తెల్లని మచ్చలు రావడం, గరుకుగా తయారవడం వంటివి జరగవచ్చు. ఇలాంటి దుష్ప్రభావాల నుండి మీ చర్మాన్ని రక్షించుకోవాలంటే ఈ క్రింది జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

ఆహారపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- బొప్పాయి, అరటి, జామ, ఆపిల్ వంటి పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- మంచినీరు ఎక్కువగా తాగడం మంచిది.
- నిమ్మ, ఉసిరి లాంటి పుల్లటి పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. ఎందుకంటే వీటిలో ఉండే సి విటమిన్ మీ చర్మాన్ని కాపాడుతుంది.
- తేనెను అప్పుడప్పుడూ తీసుకోవడం వల్ల చర్మం పొడి బారకుండా తాజాగా ఉంటుంది.
- నానబెట్టిన బాదం పప్పును ఉదయాన్నే తసుకుంటే చర్మం పొడిబారదు. రోజూ ఒక గుడ్డును తీసుకున్నా చర్మానికి మంచిది. ఎక్కువగా పళ్లరసాలను తాగితే చర్మానికి గ్లో వస్తుంది.

చర్మ ఛాయకు..

- ఒక చిన్న పాత్రలో నారింజ తొక్కలు వేసి అయిదు నిమిషాలు మరిగించి దించి ఆ తొక్కలను చర్మంపై రాసుకుంటే చర్మం నిగనిగలాడుతుంది.
- కలబందను కొన్ని రోజుల పాటు చర్మానికి రాసుకుంటే ఫలితం కనబడుతుంది.
- ఒక టేబుల్ స్పూన్ బొప్పాయి గుజ్జులో కొద్దిగా తేనె, కోడిగుడ్డు తెల్లసొన కలిపి చర్మానికి పట్టిస్తే చర్మం నిగనిగలాడుతుంది.
- టీస్పూన్ కీరాజ్యూస్‌లో కొంచెం నిమ్మరసం, చిటికెడు పసుపు కలిపి చర్మానికి రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- కొబ్బరి నూనెను చర్మమంతా వారానికి ఒకసారి మర్ధనా చేసుకోవాలి.





పాలక్ పాస్తా

క్రీముతో కూడిన టమాటోపాలకూర పాస్తా చాలా సులభమైన రెసిపి. ఇందులో చాలా ఐరన్, విటమిన్లు ఉండి మంచి రుచిని అందిస్తుంది.

కావలసిన పదార్థములు

నీరు 1 లీటరు, ఉప్పు రుచికి తగినంత, మాకరోని 2 కప్పులు, ఆలివ్ నూనె 2 చెంచాలు, వెల్లుల్లి రెబ్బలు తరిగినవి 4, చిన్న ఉల్లి పాయ తరిగినది 1, మధ్య సైజు టమాటా, తరిగినది 2, మధ్య సైజు మష్రూమ్స్ తరిగినది 3, పాలకూర తురిమినది 1 కట్ట, డైట్ మయోన్‌సైస్ 5 చెంచాలు, నల్ల మిరియాల పొడి 1 చెంచా, ఎర్ర బియ్యం కంద పోహ.

తయారు చేయు విధానం

ఒక కుండలాంటి పాత్రను తీసుకుని నీటితో నింపి మరిగించండి. మాకరోని మరియు ఉప్పును వేయండి. ప్యాక్ పై ఉన్న సూచనల ప్రకారం 5 నిమిషాల పాటు వండండి. మాకరోని అడుగున అంటకుండా అప్పుడప్పుడు కలుపుతూ ఉండండి. ఒక గరిటెను వాడుతూ 120 మిలీల పాస్తా స్టాకును బీకర్లో పోయండి. ఉడికిన పాస్తాను జల్లెడపట్టి కొలాండర్లోకి మార్చండి. నాన్ స్టిక్ పెనంలో నూనెను వేడిచేయండి (సన్న మంటపై) వెల్లుల్లి, ఉల్లిముక్కలను వేసి ఉల్లిపాయ రంగు మారేదాకా సుమారు 30 సెకన్లపాటు వేయించండి. టమాటాను వేసి మెత్తబడే వరకు 12 నిమిషాల పాటు ఉడికించండి. మష్రూమ్, పాలకూర ముక్కలను వేసి పాలకూర నుంచి నీరంతా పోయేదాకా 23 నిమిషాలు వేయించండి. చిటికెడు ఉప్పు, మిరియాల పొడి వేసి రుచిని పెంచండి. పైన కాయగూరలతో పాటు పాస్తా స్టాకును కూడా వేసి కలపండి. మంటపై నుంచి పాన్ ను తీసేయండి. ఇప్పుడు మయోన్నైస్ వేసి బాగా కలపండి. మళ్ళీ స్టవ్ పై పెటి, 1 నిమిషం పాటు సన్నమంటపై ఉంచండి లేదా సాస్ గట్టిపడేవరకూ ఉంచండి. పై సాస్ కి మాకరోని జత చేసి మొత్తం పట్టేట్లా తిరగేస్తూ కలపండి. ఈ వంటకాన్ని అందంగా అలంకరించి వేడిగా వడ్డించండి.

వెజ్ క్యాసరోల్

ఫ్రెంచ్‌లో పాన్ లాంటి గిన్నెను క్యాసరోల్ అంటారు. ఫ్రాన్స్ లో పెద్ద లోతైన పాన్ ను ఈ వంటకం వండటానికి వాడతారు. అందులోనే వడ్డిస్తారు కూడా. దీన్ని ఓవెన్‌లో కూడా వాడవచ్చు. ఇందులో వండే వంటకాన్ని క్యాసరోల్ అంటారు. ఇక్కడ మేము అన్ని కాయగూరలను వాడి శాకాహర క్యాసరోల్ తయారీ విధానాన్ని వివరించాం. ఇది ఒక పూర్తి భోజనానికి సరిపోతుంది. దీన్ని అన్నంతో కలిపి లేదా లేకుండా కూడా తినవచ్చు.

కావలసిన పదార్ధములుః

ఆలివ్ లేదా రాప్ సీడ్ నూనె 1 చెంచా, సన్నగా తరిగిన ఉల్లిపాయ 1, వెల్లుల్లి



రెబ్బలు, తరిగినవి3 స్మోక్డ్ పాప్రికా 1 చెంచా, ఎండబెట్టిన థైమ్ జీలకర్ర 1 చెంచా, మధ్యమ సైజులో క్యారట్లు తరిగినవి 3, సన్నగా తరిగిన సెలరీ స్టిక్స్ 2, మధ్యమ సైజువి ఎర్ర క్యాప్సికం , తరిగినది 1 పసుపుపచ్చ క్యాప్సికం, టమాటాలు లేదా చెక్కు తీసిన చెర్రీ టమాటాలు 2,400గ్రాములు కాయగూరల స్టాకు క్యూబ్ 2 కప్పులు కొర్గెట్టెస్ , తాజా థైమ్ 2, వండిన పప్పు 2 కప్పులు, ఎర్ర బియ్యంతో కంద పోహ.

తయారు చేయు విధానం

పెద్ద గట్టి బాండీలో నూనెను వేసి వేడి చేయండి. ఉల్లిపాయ ముక్కలు వేసి మెత్తబడేవరకూ 510 వేయించండి. వెల్లుల్లి, మసాలా దినుసులు, ఎండబెట్టిన థైమ్, క్యారట్ ముక్కలు, సెలరీ మరియు మిరియాలు వేయండి. టమాటాలు, స్టాకు, కొర్గెట్టెలు మరియు తాజా థైమ్ వేసి 20 –25 నిమిషాలపాటు వండండి. థైమ్ స్ప్రిగ్స్‌ను బయటకి తీయండి. పప్పులను వేసి మంట తక్కువలో ఉడికించండి. తెల్లని బాస్మతి బియ్యం, ఉడికించి లేదా కినోవాతో కలిపి వడ్డించండి. క్యాసరోల్ రుచికరంగా ఉండాలంటే ఒకరోజు ముందే తయారుచేయటం మంచిది.

పన్నీర్ మేకరోని

మేకరోని అనేది బహుముఖ పదార్థం. మేకరోనితో ఒక కొత్త ఫ్యూజన్ రెసిపీని,కూరగాయలు, పనీర్ లేదా ఏ ఇతర పదార్థాలతో నైనా సృష్టించవచ్చు. అదే రుచితో ప్రయోగాలు చేసి రకరకాల రుచులను సృష్టించవచ్చు. ఈ రెసిపీ లో ఉపయోగించే పనీర్, మయోన్నైస్, మిరపకాయలు మొదలైనవి పూర్తిగా మేకరోని యొక్క భారతీయ రూపం. పనీర్ ని ఇష్టపడే స్నేహితులతో కలిసి తయారుచేసుకొని ఎంజాయ్ చేయండి.

కావలసిన పదార్ధములు

నీరు 1 లీటరు, ఉప్పు రుచికి సరిపడా, మేకరోని 2 కప్పులు, విజిటెబుల్ నూనె 2 టేబుల్ స్పూన్లు, మీడియం సైజ్ ఉల్లిపాయ 1 (తరిగినది), పచ్చి మిరపకాయలు 23 (తరిగినవి), మీడియం ఆకుపచ్చ క్యాప్సికమ్ 1 (తరిగినవి), ఎర్ర కారం పొడి 1 స్పూన్ పనీర్ (తురిమిన) 1 కప్పు పాలు, 1 కప్పు తందూరి మయోన్నైస్ , 5 టేబుల్ స్పూన్లు.

తయారు చేయు విధానం

ఒక కుండ తీసుకోని దానిలో నీటిని నింపండి. మీడియం మంట మీద నీటిని మరిగించాలి. 3.మరిగే నీటిలో 9 గ్రాముల ఉప్పు,మేకరోని వేయాలి. ప్యాక్ మీద సూచనల ప్రకారం లేదా సుమారు 5 నిమిషాల పాటు ఉడికించాలి. మేకరోని అడుగు అంటకుండా మధ్య మధ్యలో కలపాలి. ఒక డ్రైనర్ సాయంతో ఉడికిన మేకరోనిలో ఉన్న నీటిని తొలగించాలి. ఒక నాన్ స్టిక్ పాన్ తీసుకోవాలి. వంట చేయటానికి నాన్ స్టిక్ స్ప్రే లేదా నూనెను ఉపయోగించవచ్చు. పాన్‌లో నూనె పోసి తక్కువ మంట మీద వేడి చేయాలి. ఉల్లిపాయ, పచ్చి మిరప, క్యాప్సికమ్ ముక్కలు కోసుకోవాలి. పాన్‌లో చిన్న ముక్కలుగా తరిగిన ఉల్లిపాయ, పచ్చి మిరప మరియు క్యాప్సికమ్ లను వేయాలి. ఒక నిమిషం వేగించాలి. పనీర్ వేసి బాగా కలపాలి. పాలు పోసి కూరగాయ ముక్కలు కలిసేలా కలపాలి. పొయ్యి కట్టేసి మయోన్నైస్,చిటికెడు ఉప్పు వేసి కలపాలి. మరల పొయ్యి వెలిగించి సాస్ 12 నిముషాలు లేదా చిక్కగా వచ్చేవరకు ఉడికించాలి. సాస్‌లో మేకరోని వేసి బాగా కలపాలి. సర్వ్ చేయటానికి వేడి వేడి పనీర్ భుర్జీ మేకరోని రెసిపీ రెడీ.



సాధారణంగా అందరూ చికెన్, మష్రూమ్ పోట్‌పై తయారుచేయడానికి ఇష్టపడతారు కానీ మేము ఇక్కడ ఒక సరికొత్త రెసిపిని మీకు పరిచయం చేయబోతున్నాం. మేము ఇక్కడ చికెన్ బదులు టర్కీ అనబడే సీమకోడిని ఉపయోగిస్తున్నాం. ఒకవేళ మీకు కూడా డిన్నర్‌కి లేదా విందుకి ఈ రెసిపి ప్రయత్నించాలనుకుంటే, ఇది తప్పక అందరికీ నోరూరిస్తూ నచ్చుతుంది. టర్కీ మరియు మష్రూమ్ పోట్.

పుట్టగొడుగుల పోట్

కావలసిన పదార్ధములు

వెన్న 1 కప్పు, పెద్ద ఉల్లిపాయ 1, ర్యాషర్స్ స్ట్రీకీ బెకాన్ , తరిగినది 4 చెస్ట్ నట్ పుట్టగొడుగులు, తరిగినవి 1 కప్పు సీమకోడి మిన్స్ (తొడ భాగం మంచిది) 2 కప్పులు మైదాపిండి, 1 కప్పు చికెన్ స్టాకు 2 కప్పులు షీటు రెడీ రోల్ పఫ్ పేస్ట్రీ కొట్టినది 1 విల్టెడ్ స్ప్రింగ్ గ్రీన్స్.

తయారు చేయు విధానం

పెద్ద బాండీలో వెన్నను వేడిచేయండి. ఉల్లిపాయ ముక్కలు వేసి మెత్తబడేవరకూ 810నిమిషాలు వేయించండి. బెకాన్, పుట్టగొడుగులను వేసి, గోధుమరంగులోకి మారేదాకా వండండి. కోడి మాంసాన్ని చెక్క గరిటెతో ముక్కలు చేస్తూ వేయండి. గోధుమరంగులోకి మారేదాకా 5 నిమిషాల పాటు ఉడికించండి. మైదాపిండిని వేసి, 1 నిముషం కలపండి. తర్వాత చికెన్ స్టాకును, థైమ్ ను వేయండి. బాగా కలిపి, మధ్య మంటపై 12 నిమిషాలు ఉంచి గట్టిపడే దాకా ఉడికించండి. రుచికి కావాల్సినట్టు చేసుకుని, 10–15 నిమిషాలు పక్కనబెట్టి చల్లబడనివ్వండి. ఓవెన్ ను 220సి/220 సి ఫ్యాన్/గ్యాస్ 7 వేడి చేయండి. చల్లబడ్డాక, టర్కీ మిశ్రమాన్ని 2 రామెకిన్స్ లేదా చిన్న పై డిష్ లలో భాగాలు చేయండి. పేస్ట్రీని విడదీసి, 2 చతురస్రాలుగా కట్ చేసి పైన పెట్టండి. డిష్ చివర్లను వత్తి, ఓవెన్ లో 30 నిమిషాలు బేక్ చేసి గోధుమరంగులోకి మారేదాకా వండండి. విల్టెడ్ స్ప్రింగ్ గ్రీన్స్ తో అలంకరించి వడ్డించండి.



కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	395	విజయవాడ	395
ముంబయి	450	ఢిల్లీ	412
చెన్నై	430	బెంగళూరు	425



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	95	ఢిల్లీ	120
కరీంనగర్	100	ముంబయి	115
వరంగల్	105	చెన్నై	115



సెన్సెక్స్ +113.31
36,582



నిఫ్టీ + 18.60
10,912

రూపాయి
₹71.80
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
34,450
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

డీలా పడిన అడాగ్ గ్రూప్



- 35శాతం నష్టపోయిన ఆర్‌కామ్ షేర్లు

ముంబయి: అనిల్ ధీరుభాయ్ అంబానీ గ్రూప్‌కు చెందిన పలు కంపెనీల షేర్లు సోమవారం ట్రేడింగ్ సెషన్‌లో భారీగా కుంగాయి. మార్కెట్ ఆరంభంలో ఆర్‌కామ్ షేరు ఒక దశలో 48శాతం పతనమైంది. ఆ తర్వాత కోలుకొని దాదాపు 35శాతం నష్టంతో రూ.7.55 వద్ద స్థిరపడింది. ముఖ్యంగా అడాగ్ గ్రూప్‌లోని ఐదు ప్రధాన కంపెనీల షేర్లు మరీ డీలాపడ్డాయి.రిలయన్స్ హోం రూ. 30.55 , రిలయన్స్ నేవల్ ఇంజినీరింగ్ రూ.10.19, రిలయన్స్ నిప్పన్ లైఫ్ రూ.130.50, రిలయన్స్ పవర్ రూ.18.05ల వద్ద ముగిశాయి. ఈ ఐదు కంపెనీల షేర్లు ఆల్‌టైమ్ కనిష్ఠానికి అతిదగ్గరిలో ఉన్నాయి. దివాల పరిష్కార ప్రక్రియకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్‌కామ్ ఎక్స్ఛేంజిలకు సమాచారం ఇవ్వడంతో వాటి షేర్లు భారీగా కుంగాయి.ఆర్‌కామ్‌కు మార్చి 2018నాటికి రూ.46,547 కోట్లుగా బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. దివాల పరిష్కార ప్రక్రియకు చేరిన రెండోకంపెనీగా ఆర్‌కామ్ నిలిచింది. అంతకు ముందు ఎయిర్ సెల్ దివాల పరిష్కార ప్రక్రియకు చేరింది. ట్రేడింగ్‌లో అడాగ్ గ్రూప్ కంపెనీ షేర్లతో పాటు మరికొన్ని ప్రధాన షేర్లు కూడా ఆల్‌టైమ్ గరిష్ఠానికి దగ్గరల్లో ట్రేడయ్యాయి. వీటిల్లో తేజస్ నెట్ వర్క్స్, శంకర బిల్డింగ్ ప్రొడక్ట్స్, టాటా టెలీ సర్వీస్, జయప్రకాష్ అసోసియేట్స్, పుంజులాయిడ్, రెలిగేర్ ఎంటర్ ప్రైజస్, ప్రభాత్ డెయిరీ వంటి 29 కంపెనీల షేర్లు అత్యల్పస్థాయిల్లో ట్రేడయ్యాయి.

9న ఆర్‌బీఐ బోర్డుతో ఆర్థిక మంత్రి భేటీ..

- వడ్డీ రేట్లను కఠినతరం చేసే యోచనలో ఆర్‌బీఐ
- 7న కీలక నిర్ణయం వెలువడే అవకాశం



ఢిల్లీ: ద్రవ్యోల్బణం తగ్గుదల నేపథ్యంలో ఈ వారంలో జరిగే ద్వైమాసిక సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ .. పాలసీ రేట్లను క్రమానుగతంగా కఠినతరం చేసే విధానం నుంచి తటస్థ విధానానికి మారే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు రేట్ల పెరుగుదల, ద్రవ్యలోటుపరమైన సవాళ్ల కారణంగా కీలక పాలసీ రేట్లను తగ్గించకపోవచ్చని చెబుతున్నారు. అక్టోబర్, డిసెంబర్ త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం.. ఆర్‌బీఐ అంచనా వేసిన 3.8 శాతం కన్నా తక్కువగా 2.6 శాతంగానే నమోదైన సంగతి తెలిసిందే. ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గడం, అటు అంతర్జాతీయంగా మందగమన ఆందోళనల నేపథ్యంలో 2018–19లో రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశిత 4 శాతం కన్నా తక్కువే ఉండొచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకానమిస్ట్ సమీర్ నారంగ్ చెప్పారు. పరపతి విధానాన్ని మార్చుకోవడానికి ఆర్‌బీఐ దీని వల్ల కాస్త వెసులుబాటు లభిస్తుందని, అయితే విద్య, వైద్యం, గృహావసరాల వ్యయాలు అధికంగానే ఉండటం వల్ల రేట్ల తగ్గింపునకు అవకాశాలు పరిమితంగానే ఉన్నాయని ఆయన తెలిపారు.ఇటు పెరుగుతున్న ముడి చమురు ధరలు, అటు ద్రవ్యపరమైన సవాళ్ల కారణంగా ఈ ఏడాది ఆర్‌బీఐ పాలసీపరంగా సంక్లిష్టమైన నిర్ణయాలే తీసుకోవాల్సి రావొచ్చని కన్సల్టెన్సీ సంస్థ డీబీఎస్ ఎకనామిక్స్ పేర్కొంది. ఉర్జిత్ పటేల్ నిష్క్రమణ అనంతరం కొత్త గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శక్తికాంత దాస్ సారథ్యంలో ఫిబ్రవరి 5 నుంచి 7 దాకా మూడు రోజులపాటు ఆర్‌బీఐ ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష జరగనున్న సంగతి తెలిసిందే. 7వ తేదీ(గురువారం) మధ్యాహ్నం పాలసీ నిర్ణయం వెలువడుతుంది. ఈ ఆర్థిక సంవత్స రం రెండు సార్లు రేట్లను పెంచిన ఆర్‌బీఐ క్రమానుగతంగా కఠినతర విధానాన్ని పాటిస్తోంది. డిసెంబర్‌లో రేట్లను మార్చకపోయినప్పటికీ ద్రవ్యోల్బణం పెరిగే రిస్కులు లేకపోతే తగ్గించే సంకేతాలే ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే విశ్లేషకుల అంచనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

9న ఆర్‌బీఐ బోర్డుతో ఆర్థిక మంత్రి భేటీ..

సాంప్రదాయం ప్రకారం బడ్జెట్ అనంతరం ఫిబ్రవరి 9న ఆర్‌బీఐ బోర్డు సభ్యులతో ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ సమావేశం కానున్నారు. మధ్యంతర బడ్జెట్‌లో కీలక అంశాల గురించి వివరించనున్నారు. ఆర్‌బీఐ ఆరో ద్వైమా సిక పాలసీ విధాన సమీక్ష అనంతరం రెండు రోజులకు ఈ భేటీ జరగనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మధ్యంతర డివిడెండ్ చెల్లించాలన్న కేంద్రం సూచన కూడా ఇందు లో చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్రం రూ. 28,000 కోట్ల దాకా మధ్యంతర డివిడెండ్ రావొచ్చని అంచనా వేస్తోంది.

లాభాలతో మొదలు..

- చివరి గంటలో ఊపందుకున్న అమ్మకాలు
- పుంజుకున్న బ్యాంక్, ఐటీ, ఎనర్జీ రంగాలు



ముంబయి: బడ్జెట్ అనంతరం స్టాక్ మార్కెట్లలో తొలి ట్రేడింగ్ సెషన్ లాభాలతో ముగించింది. సోమవారం ఉదయం నష్టాలతో ప్రారంభమైన దేశీయ సూచీలు మధ్యాహ్నం నాటికి కోలుకున్నాయి. ఆటో, లోహ, ఎఫ్ఎంసీజీ, ఫార్మా రంగాలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో మధ్యాహ్నం వరకు మార్కెట్లు నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. కానీ చివరి గంటలో బ్యాంక్, ఎనర్జీ, ఐటీ రంగాల్లో కొనుగోళ్లు ఊపందుకోవడంతో సెన్సెక్స్ 113 పాయింట్లకు పైగా లాభపడింది. అటు నిఫ్టీ కూడా 10,900 మార్క్ పైనే స్థిరపడి ట్రేడింగ్‌ను ముగించింది. ఉదయం 93 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్‌ను ఆరంభించిన సెన్సెక్స్ ఒకానొక దశలో తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైంది. దీంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 200 పాయింట్లకుపైగా నష్టాల్లో కొనసాగింది. అటు నిఫ్టీ కూడా 10,800 మార్క్‌లో కదలాడింది. కానీ చివరి గంటలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో ఉదయం నాటి నష్టాల నుంచి కోలుకొని లాభాలను గడించింది. సెన్సెక్స్ 113.31 పాయింట్లు లాభపడి 36,582.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 18.60 పాయింట్లు లాభపడి 10,912.25 వద్ద స్థిరపడింది.రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్జీసీ, బజాజ్ ఆటో, టీసీఎస్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు భారీ లాభాలను గడించాయి. ఎన్ఎస్ఈలో యస్ బ్యాంక్, హిందాల్కో, హిందుస్థాన్ పెట్రోలియం, పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ షేర్లు నష్టాలను చవిచూశాయి. రియలన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.8లక్షల కోట్లు దాటింది.

పసిడి.. పైపైకి



ఢిల్లీ: పసిడి ధర పైపైకి పోతోంది. సోమవారం పది గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.340 పెరిగి రూ.34,450కి చేరుకుంది. స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ ఊపందుకోవడమే ధరల పెరుగుదలకు కారణమని బులియన్ వర్గాలు తెలిపాయి. దేశీయ వ్యాపారుల నుంచి డిమాండ్ పెరిగినా బలహీనమైన గ్లోబల్ ట్రెండ్ కారణంగా ధరల పెరుగుదల పరిమితంగానే ఉందని చెబుతున్నారు. ఇక, అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ఔన్స్‌కు 1,312.2 డాలర్లకు పడిపో యింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర పది గ్రాములకు రూ.33,400గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.31,810గా ఉంది. పసిడి ధర తాజా పెరగుదలతో దేశ రాజధాని ఢిల్లీలో 99.9 స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ. 34,450కి చేరుకోగా, 99.5 స్వచ్ఛత కలిగిన బంగారం ధర పది గ్రాములకు రూ.34,300గా ఉంది. సార్వభౌమ పసిడి పథకంలో 8 గ్రాముల బంగారం ధర రూ.100 పెరిగి రూ.26,100కు చేరుకుంది. బంగారం ధరతోపాటు పెరిగే వెండి ధర ఈసారి రూ.130 తగ్గింది. దీంతో కేజీ వెండి ధర రూ.41,530కి పడిపోయింది. పరిశ్రమ వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ తగ్గడమే ధర పడిపోవడానికి కారణమని వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి.

ఫుల్ స్టయిలిష్‌గా కొత్త రెనాల్ట్ క్విడ్



ఢిల్లీ: భారత ఆటోమొబైల్ దిగ్గజం రెనాల్ట్ కొత్త కారును లాంచ్ చేసింది. తన ఎంట్రీ లెవల్ కారు రెనాల్ట్ క్విడ్ లో కొత్త కారును సోమవారం భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. దీని ధర రూ.2.674.63 లక్షల (ఎక్స్ షోరూమ్ ఢిల్లీ) గా నిర్ణయించింది, మెరుగైన భద్రతా ఫీచర్స్‌తో దీన్ని భారతీయ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామని రెనాల్ట్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది.0.8 లీటర్, 1లీటరు పెట్రోల్ ఇంజిన్లలో మాన్యువల్, ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్‌లలో కొత్త క్విడ్ లభించనుంది. అత్యాధునిక భద్రత నిబంధనలతోపాటు, పాదచారుల భద్రతకు అనుగుణంగా తమ కొత్తకారు ఉంటుందనీ, ముఖ్యంగా ఏబీఎస్, ఎలక్ట్రానిక్ బ్రేక్ ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్ లాంటి ఫీచర్లను ఇందులో జోడించినట్టు కంపెనీ తెలిపింది. అలాగే స్పీడ్, ఎయిర్‌బ్యాగ్ రిమైండర్ ఫీచర్, 17.64 సెం.మీ టచ్ స్క్రీన్ మీడియా, నావిగేషన్ సిస్టం, కెపాసిటివ్ టచ్ స్క్రీన్‌తో పాటు ఆండ్రాయిడ్ , ఆపిల్ కార్ ప్లేలకు అనుగుణంగా పుష్ టు టాక్ ఫీచర్ అందించినట్టు తెలిపింది. కాగా 2.75లక్షలకు పైగా యూనిట్ల అమ్మకాలతో భారత్ మార్కెట్‌లో రెనాల్ట్‌కు క్విడ్ విజయవంతమైన కారుగా నిలిచింది.

స్పోర్ట్స

టీ20 సిరీస్‌కు గప్టిల్ దూరం



వెల్లింగ్టన్: సొంతగడ్డపై టీమిండియా చేతిలో వన్డే సిరీస్ కోల్పోయిన న్యూజిలాండ్‌కు మరో ఎదురు దెబ్బ పడింది. బుధవారం నుంచి టీమిండియాతో జరుగనున్న టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు, ఓపెనర్ మార్టిన్ గప్టిల్ దూరమయ్యాడు. వెన్నునొప్పితో బాధపడుతున్న గప్టిల్ టీ20 సిరీస్‌కు దూరమవుతున్నాడని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. గప్టిల్ స్థానంలో జేమ్స్ నీశమ్‌ను జట్టులోకి తీసుకున్నారు. తొలివిడత ప్రకటించిన టీ20 జట్టు జాబితాలో నీశమ్ పేరు లేకపోయినప్పటికీ, గప్టిల్ గాయం వెన్నునొప్పి కారణంగా దూరం కావడంతో గప్టిల్ స్థానంలో నీశమ్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు. గప్టిల్ కోలుకోవడానికి మరి కొంత సమయం పట్టే అవకాశం ఉండడంతో టీ20 సిరీస్‌కు గప్టిల్ అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమని న్యూజిలాండ్ కోచ్ గ్యారీ స్టీడ్ తెలిపాడు. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్ ఐదు రోజుల వ్యవధిలో ముగియనుంది. ఈ వ్యవధిలో గప్టిల్ కోలుకోవడం కష్టమని, దాంతో అతనిని సిరీస్ నుంచి తప్పించి విశ్రాంతి ఇచ్చామని అన్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి బంగ్లాదేశ్‌తో ఆరంభమయ్యే వన్డే సిరీస్ నాటికి గప్టిల్ జట్టుతో కలిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బుధవారం నుంచి న్యూజిలాండ్, భారత్ జట్ల మధ్య టీ20 సిరీస్ ఆరంభం కానుంది. తొలి టీ20 ఫిబ్రవరి 6న వెల్లింగ్టన్ వేదికగా జరుగుతుండగా, ఫిబ్రవరి 8న రెండో టీ20 అక్లాండ్‌లో, ఫిబ్రవరి 10న హామిల్టన్ వేదికగా మూడో టీ20 జరుగనున్నాయి.

ఐసీసీ నిర్ణయంపై వార్న్ మండిపాటు



నార్త్‌సౌండ్: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో స్లో ఓవర్ రేట్ కారణంగా వెస్టిండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్‌పై ఐసీసీ ఒక మ్యాచ్ నిషేధం విధించింది. ఈ విషయాన్ని ఆసీస్ స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ తీవ్రంగా తప్పుబట్టాడు. అసలు హోల్డర్‌పై నిషేధం విధించే ముందు ఐసీసీ కనీసం కామన్ సెన్స్ లేకండా వ్యవహరించిందంటూ మండిపడ్డాడు. ఈ విషయంలో ఐసీసీ నిర్ణయాన్ని సవాల్ చేయాల్సిందిగా హోల్డర్‌కు వార్న్ సూచించాడు. ఇంగ్లండ్ వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన రెండో టెస్టు మూడు రోజులు మించి జరగలేదు. అటువంటప్పుడు స్లో ఓవర్ రేట్ అంటూ హోల్డర్స్‌పై మ్యాచ్ నిషేధం విధించడం నిజంగానే చెత్త నిర్ణయమని, ఇక్కడ ఐసీసీ కనీసం ఇంగితం కూడా లేకుండా వ్యవహరించిందని మండిపడ్డాడు. హోల్డర్ ఐసీసీ నిర్ణయంపై అప్పీల్‌కు వెళ్లమని వార్న్ పేర్కొన్నాడు. రెండో టెస్టులో ఇంగ్లాండ్‌పై 10 వికెట్లతో విజయం సాధించి సిరీస్‌ను ఇంకో మ్యాచ్ ఉండగానే కైవసం చేసకున్న విండీస్‌ను వార్న్ అభినందించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో వెస్టిండీస్ ఎంత బలమైనదో మరోసారి నిరూపించిందన్న వార్న్ ఇదే విజయ పరంపరను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కితాబునిచ్చాడు.

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

అగ్రస్థానంలో కోహ్లీ



- రెండోస్థానంలో టీమిండియా

ముంబయి: ఐసీసీ తాజాగా ప్రకటిం చిన వన్డే ర్యాకింగ్స్‌లో టీమిండియా రెండో స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా, న్యూజి లాండ్ పర్యటనల్లో టీమిండియా వన్డే సిరీస్ లను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో టీమిండియా 122 పాయింట్ల రేటింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో ఇంగ్లాండ్ 126 పాయింట్లతో తొలి స్థానంలో ఉండగా దక్షిణాఫ్రికా మూడో స్థానం లో కొనసాగుతోంది.

బ్యాట్స్‌మెన్ జాబితాలో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ 887 పాయింట్లతో తొలి స్థానంలో ఉండగా, తాత్కాలిక సారథి రోహిత్ శర్మ 854 పాయింట్లతో రెండో స్థానాల్లో కొనసాగుతున్నారు. వీరిద్దరి తర్వాత న్యూజిలాండ్ ఆటగాడు రాస్ టేలర్ మూడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ పదో స్థానంలో నిలిచాడు. వికెట్ కీపర్ ఎంఎస్ ధోనీ 17వ స్థానంలో నిలవగా, కేదార్ జాదవ్ ఎనిమిది స్థానాలు మెరుగు పరుచు కుని 35వ స్థానం లో నిలిచారు.


బౌ లింగ్ విభా గంలో టీమిండియా పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మొ దటి స్థానంలో కొనసాగుతున్నాడు. నాలుగో స్థానం లో కుల్దీప్ ఉండగా, చాహల్ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. మరో పేసర్ భువనేశ్వర్ కుమార్ 17వ స్థానంలో ఉన్నా డు. న్యూజిలాండ్ సిరీస్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపి 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' దక్కించుకున్న మహమ్మద్ షమీ తన స్థానాన్ని మెరుగు పరుచుకుని 30 స్థానంలో నిలిచాడు.

చాహల్‌పై పాట పాడిన భారత ఆర్మీ



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ పర్య టనలో టీమిండియాను ప్రోత్సహి స్తూ కనిపిస్తుంది. మ్యాచ్‌లో బాగా రాణించిన వారి పేరు మీద పాట పాడడం భారత ఆర్మీ ప్రత్యేకత. టీమిండియా ఎక్కడ ఉంటే అక్కడ భారత ఆర్మీ వాలిపోతోంది. సరి గ్గా 20 ఏళ్ల క్రితం యూకేలో ప్రా రంభమైన ఈ ఆర్మీ టీమిండియా వెన్న ంటనే ఉంటోంది. ఆటలో మంచి ప్రతిభను కనబరిన వారి మీద పాట పాడి జట్టును ఉత్సాహపరుస్తోంది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనలో, న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టును ప్రోత్సహిస్తూ కనిపించింది. ఇంతకు ముందు ఆసీస్ పర్యటనలో యువ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ మీద పాట పాడిన వీళ్లు తాజాగా న్యూజిలాండ్‌పై ఆఖరి వన్డేలో తన సత్తాచాటి 3 వికెట్లు పడగొట్టిన స్పిన్ బౌలర్ యుజ్వేంద్ర చాహల్ మీదా ఓ పాట పాడారు. ఆఖరి వన్డేలో ఆతిథ్య జట్టుపై రోహిత్ జట్టు గెలవడంతో భారత్ ఆర్మీ ఆనందానికి అవధుల్లేవు. టీమిండియా జట్టులో తాము కూడా భాగమని జట్టులో తాము 12వ ఆటగాడితో సమానమని భారత్ ఆర్మీలోని ఓ వ్యక్తి చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన చాహల్ మీద ఓ పాట పాడి తమ అభిమానాన్ని చాటుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను బీసీసీఐ ట్విటర్‌లో పోస్ట్ చేయడంతో అది కాస్త వైరల్‌గా మారింది.

క్రీడా పురస్కారాల జ్యూరీలో బింద్రా, గోపీచంద్



ముంబయి: భారత క్రీడా పురస్కారాల ఎంపిక కమిటీని ఎంపిక చేశారు. దేశానికి ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం అందించిన అభినవ్ బింద్రా, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఈ జ్యూరీలో కీలక సభ్యులు. ఫిబ్రవరి 16న ఈ పురస్కారాలను బహూకరించనున్నారు. హాకీ మాజీ సారథి సర్దార్ సింగ్, టెన్నిస్ ఆటగాడు మహేశ్ భూపతి, దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష, మాజీ షూటర్ అంజలి భగవత్ కమిటీలో సహ సభ్యులు.అథ్లెట్‌కు ఇచ్చే పురస్కారం కేవలం అతడికి మాత్రమే గుర్తింపు కాదు. ఆ జట్టు, సహాయ బృందానికీ గుర్తింపు ఇచ్చినట్టు. పురస్కారమనేది వ్యక్తిగత కష్టానికి గుర్తింపు కాదు జట్టు కష్టానికీ గుర్తింపు' అని బింద్రా వెల్లడించారు. ఈ పురస్కారాలను ఆర్పీ సంజీవ్ గోయెంకా గ్రూప్, విరాట్ కోహ్లీ ఫౌండేషన్ సంయుక్తంగా అందిస్తోంది. ప్రతి విభాగంలో నామినేట్ అయిన క్రీడాకారులను జ్యూరీ ఈ మధ్యనే ఎంపిక చేసింది. దాదాపు 200 మంది పాత్రికేయులు ఆటగాళ్లను నామినేట్ చేశారు.

ధోనీ ఉన్నప్పుడు క్రీజు దాటొద్దు

- బ్యాట్స్‌మెన్‌లకు ఐసీసీ సలహా

దుబాయ్: మెరుపు వేగంతో స్టంపౌట్లు చేయడంలో జార్ఖండ్ డైనమైట్ ధోనీకి సాటి ఎవరు లేరు. పోటీ రారు కూడా. స్టంపౌట్లలో ధోని స్టైలే వేరు. మెరుపు వేగంతో స్పందించి ఎలాంటి స్టార్స్ బ్యాట్స్‌మెన్‌ను అయినా ఇంటికి సాగనంపుతాడు. తాజాగా జరిగిన కివీస్, టీమిండియా లాస్ట్ వన్డేలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. వెల్లింగ్టన్ వన్డేలో ధోనీ విషయంలో కాస్త ఏమరుపాటుగా వ్యవహరించిన కివీస్ బ్యాట్స్‌మెన్ నీశమ్ భారీ మూల్యం చెల్లించుకున్నాడు. 36 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసిన నీశమ్(32 బంతుల్లో 44) వరుస బౌండరీలతో ప్రమాదకరంగా మారాడు. ఈ సమయంలో కేదార్ జాదవ్ బౌలింగ్‌కు పిలిచిన ధోనీ దానికి తగిన ఫలితం రాబట్టాడు. జాదవ్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడేందుకు నీశమ్ ప్రయత్నించగా బంతి అతని శరీరానికి తగిలి వెనక్కి వెళ్లింది. ఈ సమయంలో ధోనీ సహ అందరూ ఎల్బీకోసం అప్పీల్ చేస్తుండగా బంతి ధోనీకి కాస్త దూరంగా ఉండడం గమనించిన నీశమ్ పరుగుకు ప్రయత్నించాడు. అంతే వేగంగా ధోనీ బంతిని అందుకొని వికెట్లకు విసరడం రెప్పపాటులో జరిగిపోయింది. దీంతో నీశమ్ రనౌట్‌తో నిరాశగా పెవిలి యన్ బాట పట్టాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఎం తగా అంటే ధోని చేసిన ఈ రన్ అవుట్‌పై ఐసీసీ సైతం స్పందిచింది. ఓ యూజర్ అ డిగిన ప్రశ్నకు ఐసీసీ సమాధానమిస్తూ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ వికెట్ల వెనుక ఉంటే ఎలాంటి బ్యాట్స్‌మెన్ అయినా క్రీజ్ దాటకపోవడమే మంచిదని సలహా ఇచ్చారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్



విజయక్రాంతి, దర్మారం (నిజామాబాద్ జిల్లా): అండర్–12 సబ్ జూని యర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ముగిసింది. బాలికల విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మెదక్, నిజామాబాద్ జట్టును 1–0 తో విజయం సాధించింది. మూడవ స్థానం కోసం జరిగిన పోరులో మహబూబ్‌నగర్, రంగారెడ్డి జట్టును 10–0తో చిత్తు చిత్తుగా ఓడించింది. అనంతరం జరిగిన బాలుర ఫైనల్స్‌లో నిజామాబాద్ జట్టు విజేతగా నిలిచింది. ఆదిలాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 5–0 తేడాతో గెలిచి టైటిల్ సొంతం చేసుకుంది. నిజామాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మెన్ జి.రాములు ముఖ్య అతిదిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు.



Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal - Malkajgiri District 500043. Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.